శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

హోర్ముజ్‌ను అమెరికా భూభాగంగా ప్రకటిస్తాం 08
ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇబ్బందుల్లో పేద విద్యార్థులు
దేశ భవిష్యత్తు బాధ్యతలు స్వీకరించేందుకు యువ న్యాయ పట్టభద్రులు, న్యాయవాదులు సిద్ధంగా ఉండాలి 07

సంపుటి 09, సంచిక: 257 | ఆదివారం | 16-08-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

మహిళా కోటా అమలుకు సహకరించండి

విభేదాలు పక్కనపెట్టి రాజకీయ పార్టీలు ముందుకు రావాలి
ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞప్తి

- పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ఇస్తామని వ్యాఖ్య
- భారత్‌ను ఉన్నత శిఖరాలకు నడిపించేందుకు 'సప్తధార'లు ప్రకటన

న్యూఢిల్లీ : చటసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు తమ విభేదాలను పక్కనపెట్టి రాజకీయ పార్టీలు ముందుకు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో యువత ముందుండి నడిపించాలని పిలుపునిచ్చారు. సాయుధ నక్సలిజం నిర్మూలించబడినప్పటికీ, 'దిమాగి (మేధావి) నక్సల్స్' ఇంకా పొంచి ఉన్నారని హెచ్చరించారు. 80 సాత్వంతత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం ఢిల్లీలోని ఎర్రకోటపై మోదీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన జాతినుద్దేశించి ప్రసంగించారు. తన 13వ ప్రసంగంలో 'విక్సిత్ భారత్ 2047' దార్శనికత చుట్టూ పార్టీలను, యువ భారతీయులను ఏకం చేయడానికి ప్రయత్నించారు. 'సప్తధార' రోడ్ మ్యాప్‌ను ప్రకటించారు. వాటి ద్వారా భారతదేశ ఆర్థిక, వ్యూహాత్మక ఉన్నతికి ఒక మార్గసూచిని వివరించారు. యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, పోటీ పరీక్షలకు ఉచిత తరువాయి 8లో

'దిమాగి నక్సల్స్'తో ముప్పు

ప్రగతి 'సప్తధార'లు
తయారీ రంగం, విద్యుత్, వ్యవసాయం, ఆహార శుద్ధి, సాంకేతికత, ఆవిష్కరణలు, గతిశక్తి, రక్షణ శక్తి, హరిత, నీలి ఆర్థిక వ్యవస్థలు, సాఫ్ట్ పవర్

మోదీ 'దిమాగి నక్సల్స్'పై
విపక్షాలు మండిపాటు
నిస్సహాయతకు నిదర్శనమని వ్యాఖ్య
ప్రశ్నించే వారిపై కళంకం వేయడానికే... : డి.రాజా
ఎప్పుడూ ప్రతిపక్షాలను నిందించే యోచనే : ఎం.ఎ. బేబి 07

కృష్ణ గోదావరి

నీటి వాటాలో రాజీ పడబోం

తుమ్మిడిహెట్టి నుంచి పాలమూరు వరకు పెండింగ్ సాగునీటి ప్రాజెక్ట్‌లను ప్రాధాన్యతాక్రమంలో పూర్తి చేస్తాం

- విధ్వంసమైన తెలంగాణ రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించేందుకు ప్రయత్నిస్తున్నాం
- దెబ్బతిన్న వ్యవస్థలను మా 32 నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్కొక్కటిగా గాడిలో పెట్టాం
- వ్యవసాయానికి రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశాం
- టిఎస్ ఐపాస్ ద్వారా రూ. 1.95 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

విధ్వంసమైన తెలంగాణ రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పారు. దెబ్బతిన్న వ్యవస్థలను తమ 32 నెలల ప్రజా పాలనలో ఒక్కొక్కటిగా గాడిలో పెట్టామని, సంక్షేమాన్ని విస్తరించామని, అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశించామని, తెలంగాణ భవిష్యత్తుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా సాధించే విషయంలో రాజీపడబోమని సిఎం స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి నుంచి పాలమూరు వరకు పెండింగ్ సాగునీటి ప్రాజెక్ట్‌లను ప్రాధాన్యతక్రమంలో పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే దిశగా ముందుకు సాగుతామన్నారు. హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో శనివారం ప్రభుత్వం నిర్వహించిన భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సిఎం రేవంత్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ 32 నెలల పాటు ప్రజా ప్రభుత్వం చేసిన కృషితో ఇప్పుడు ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు. ఆర్‌బిఐ తాజా గణాంకాల ప్రకారం 2025–26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931 అని, దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ ఆదాయం దాదాపు 91 శాతం అధికంగా ఉందని, ఈ ఫలితం తెలంగాణ ఆర్థిక వ్యవస్థ బలాన్ని చాటిచెబుతుందన్నారు. సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల కోసమో లేదా తరువాయి 8లో

ఆకలి తీర్చేదే 'రేషన్‌కార్డు'

- బిజెపి, బిఆర్ఎస్ ఒకే నాణానికి బొమ్మా బొరుసు
- ఏనాడైనా పేదలకు సన్న బియ్యం ఇవ్వాలనే ఆలోచన వచ్చిందా?
- సంగారెడ్డిలో స్మార్ట్ కార్డుల పంపిణీలో సిఎం రేవంత్‌రెడ్డి ఫైర్ 03

దేశంలో బిజెపి-ఆర్ఎస్ఎస్ విద్వేష వ్యాప్తి

ప్రజలను విభజిస్తూ శాంతికి భంగం కలిగిస్తున్నాయి
సమాజంలో శాంతి, ఐక్యతను కాపాడాలని కాంగ్రెస్ కోరుకుంటోంది : ఖర్గే

న్యూఢిల్లీ : స్వాతంత్ర్య దినోత్సవ వేళ బిజెపి, ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. అవి దేశంలో ద్వేషాన్ని వ్యాప్తి చేస్తూ, ప్రజలను విభజిస్తూ, శాంతికి భంగం కలిగిస్తున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. 'మొహబ్బత్ కి దుకాన్' ప్రారంభిస్తున్న కాంగ్రెస్, సమాజంలో శాంతి, ఐక్యతను కాపాడాలని కోరుకుంటోందన్నారు. శనివారం ఇందిరా భవన్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాను ఖర్గే ఆవిష్కరించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, పలువురు ఇతర సీనియర్ పార్టీ నాయకులు హాజరయ్యారు. జెండావిష్కరణ అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్ చేసిన ప్రతి పనికి పథకాల పేర్లు మార్చి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్రెడిట్ తరువాయి 8లో

స్వాతంత్ర్య పోరాటం, దేశాభివృద్ధిలో కమ్యూనిస్టులది గణనీయమైన పాత్ర

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

స్వాతంత్ర్య పోరాటంలో, దేశాభివృద్ధిలో కమ్యూనిస్టులది గణనీయమైన పాత్ర ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తులో దేశ రక్షణ, రాజ్యాంగ పరిరక్షణతో పాటు సమసమాజ నిర్మాణం కోసం అదే దృఢనిశ్చయంతో పనిచేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందన్నారు. ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమాఖ్య స్ఫూర్తిని కాపాడేందుకు మరిన్ని సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని పల్లా వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, పి.ప్రేమ్‌పావని, ఆర్.అంజయ్య నాయక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు తరువాయి 12లో

ఇందిరమ్మ టవర్స్‌కు 60,000 దరఖాస్తులు

- ఒక్కో ఫ్లాట్‌కు 8 మంది పోటీ
- ముగిసిన దరఖాస్తు గడువు

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ నగర పరిధిలో అల్పాదాయ వర్గాల కోసం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకానికి అనూహ్య స్పందన లభిస్తోంది. ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించిన 16 నియోజకవర్గాల్లో 7,340 ఫ్లాట్లకుగాను శనివారం సాయంత్రానికి 60,014 దరఖాస్తులు వచ్చాయని, అంటే సగటున ఒక్కో ఫ్లాట్కు 8.18 మంది పోటీ పడుతున్నారని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం తెలిపారు. ఖైరతాబాద్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, నాంపల్లి నియోజకవర్గాల్లో అత్యధిక దరఖాస్తులు నమోదయ్యాయి. ఈ దరఖాస్తుల పరిశీలన అనంతరం ఆగస్టు 20 తర్వాత లాటరీ ప్రక్రియ చేపడతామని, సెప్టెంబరు మొదటి వారంలో పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. ఇదే క్రమంలో ఆదివారం నుంచి ఎల్.బి. నగర్, గోషామహల్, ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో కొత్తగా 1,920 ఫ్లాట్ల (ఒక్కో నియోజకవర్గంలో 480) కోసం తరువాయి 8లో

రైతుబంధు నిలిపివేత సబబే

సింగిల్ జడ్జి ఆదేశాలు రద్దుచేసిన హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్

2019 ఖరీఫ్, రబీ సీజన్లలో ఆర్థిక వనరుల పరిమితుల కారణంగా కొంతమంది రైతులకు రైతుబంధు నిధులు విడుదల చేయకపోవడాన్ని హైకోర్టు సమర్థించింది. ఆర్థిక, సంక్షేమ విధానాల్లో ప్రభుత్వ ప్రాధాన్యాలను నిర్ణయించే అధికారం న్యాయస్థానాలకు లేదని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆర్థిక విధానం ఏకపక్షంగా, వివక్షాపూరితంగా ఉండటం లేదా రాజ్యాంగ, చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు నిరూపితమైతే తప్ప అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని పేర్కొంది. కొవిడ్ తరువాయి 12లో

హ్యామ్‌తో పల్లెలకు రాచబాట

- దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో గ్రామీణ రహదారులకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్
- అసోం, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఆసక్తి చూపుతున్న కేంద్ర సంస్థలు
- రూ.16,007 కోట్లతో తొలి విడత పనుల పైలాన్ ఆవిష్కరణకు సిద్ధం
- నేడు ములుగు వేదికగా హ్యామ్ పనులకు శ్రీకారం చుట్టనున్న సిఎం రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని మారుమూల పల్లెలకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించి, గ్రామీణ తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చేందుకు ప్రజా ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక అధ్యాయానికి నాంది పలికింది. దేశంలోనే ప్రథమంగా గ్రామీణ రహదారుల నిర్మాణంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఎఎం) విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం, నేడు ములుగు వేదికగా రూ.16,007 కోట్ల విలువైన మొదటి విడత హ్యామ్ రహదారుల పనులను అధికారికంగా ప్రారంభించనుంది. ఈ సందర్భంగా నూతన కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పైలాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించనుండగా, స్థానిక శాసనసభ్యురాలు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క నేతృత్వంలో అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

తొలి దశలో 7,448 కిలోమీటర్ల మేర రహదారులు

గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం రూపొందించిన ప్రణాళికలో భాగంగా మొదటి విడతలో 2,145 రహదారులను (7,448 కిలోమీటర్లు) రూపుదిద్దనున్నారు. ఇప్పటివరకు సరైన రహదారి సదుపాయం లేని 176 గ్రామ తరువాయి 8లో

ఇండోనేసియాలో పెను భూకంపం

47 మంది మృతి

కుప్పకూలిన భవనాలు
విరిగి పడిన కొండచరియలు : స్తంభించిన 700 కి.మీ హై వే
260 దాటిన కొలంబియా భూకంప మృతులు



మౌమెరే : ఇండోనేసియా ఫ్లోరెస్ ద్వీపంలోని అనేక ప్రాంతాలలో శనివారం ఉదయం పెను భూకంపం సంభవించింది. దీంతో అనేక భవనాలు కూలిపోయాయి. ఎండే రీజెన్స్‌లో కొండ చరియలు విరిగిపడటంతో 700 కి.మీ పొడవుగల జాతీయ రహదారి రాకపోకలకు పనికి రాకుండాపోయింది. రోడ్లు చీలిపోయాయి. శిథిలాలు చెల్లాచెదురుగా అన్నిచోట్లా విస్తరించాయి.ప్రాథమిక అంచనాల ప్రకారం 47 మంది మరణించగా అనేకమంది శిథిలాల్లో కూరుకుపోయారు. 38 మృతదేహాలను జాతీయ ప్రకృతి వైపరీత్యాల నిర్వహణా ఏజన్సీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఎక్కువగా 16 మృతదేహాలను సిక్కామంగ్గరై,తూర్పు మంగ్గరై ప్రాంతాల నుండి స్వాధీనం చేసుకున్నారు. నాగెకియో గ్రామం నుండి 2000 మంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పారిపోయారు. భూకంప తీవ్రతతో రోడ్డు,నేల ముక్కలు ముక్కలుగా బీట్లు వారింది. ఈస్ట్ నుసా టెంగాకా రాష్ట్రం ఎండే నగరానికి 68 కి.మీ ఉత్తర వాయువ్యంగా 10 కి.మీ అతి తక్కువ ఓతులో సంభవించిన ఈ పెను భూకంపం తీవ్రత రిచ్‌టర్ స్కేలుపై 7.7 గా తరువాయి 8లో

సహజ ఇంజినీర్లు...బీవర్లు

చెక్ రిపబ్లిక్‌లో జరిగిన ఒక సంఘటన ప్రకృతి శక్తిని మరోసారి ప్రపంచానికి గుర్తుచేసింది. ఒక చిత్తడి నేల ప్రాంతాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వ అధికారులు దాదాపు ఏడు సంవత్సరాల పాటు ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రాజెక్టుకు సుమారు 12 లక్షల అమెరికన్ డాలర్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే పనులు ప్రారంభం కాకముందే అక్కడికి వచ్చిన బీవర్ల కుటుంబం ఆ ప్రాంత రూపురేఖలను మార్చేసింది. యూరోపియన్ బీవర్లు తమ సహజ స్వభావంతో చిన్న చెట్లను కొరికి, కొమ్మలు, మట్టి, రాళ్లను ఉపయోగించి ఆనకట్టలు నిర్మించాయి. ఆశ్చర్యకరంగా, అవి నిర్మించిన ఆనకట్టలు మానవ ఇంజినీర్లు రూపొందించిన ప్రణాళికల్లో ఉన్న ప్రదేశాలకు దాదాపు సరిపోయాయి. ఎలాంటి యంత్రాలు, నిర్మాణ సామగ్రి, మానవ శ్రమ లేకుండానే బీవర్లు నీటి ప్రవాహాన్ని నియంత్రించి, చిత్తడి నేల పునరుద్ధరణకు దోహదపడ్డాయి. దీంతో ప్రభుత్వానికి చేపట్టాల్సిన భారీ నిర్మాణ పనులు అవసరం లేకుండా పోయాయి. ఫలితంగా సుమారు 1.2 మిలియన్ డాలర్ల వ్యయం ఆదా అయింది. మనుషులు సంవత్సరాల పాటు ప్రణాళిక చేసిన పనిని ప్రకృతి కొద్ది కాలంలోనే పూర్తి చేయడం శాస్త్రవేత్తలను, అధికారులను ఆశ్చర్యపరిచింది. బీవర్లను ప్రకృతి ఇంజినీర్లు అని పిలవడానికి కారణం ఇదే. అవి నిర్మించే ఆనకట్టలు కేవలం నీటిని అడ్డుకోవడం మాత్రమే కాదు, మొత్తం పర్యావరణ వ్యవస్థను మార్చగల సామర్థ్యం కలిగి ఉంటాయి. వాటి వల్ల చిత్తడి నేలలు ఏర్పడతాయి, నీటి నాణ్యత మెరుగుపడుతుంది, వరదల ప్రభావం తగ్గుతుంది. పర్యావరణ శాస్త్రంలో ఇలాంటి విధానాలను 'ప్రకృతి సహజ పరిష్కారాలు'గా పేర్కొంటారు. అంటే ప్రకృతి సహజ ప్రక్రియలను ఉపయోగించి పర్యావరణ సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.

ఆర్మీ చీమలుకట్టే సజీవ వంతెనలు

మధ్య, దక్షిణ అమెరికా ఉష్ణమండల వర్షారణ్యాల్లో నివసించే 'ఆర్మీ చీమలు' ప్రకృతిలోని అద్భుతమైన సమష్టి ప్రవర్తనకు ఉదాహరణగా నిలుస్తాయి. ఇవి కలప, ఆకులు లేదా మట్టితో వంతెనలు నిర్మించవు. బదులుగా, తమ శరీరాలనే ఒకదానితో ఒకటి కలిపి సజీవ వంతెనలను నిర్మిస్తాయి. వేలాది చీమలు కలిసి ఒకే వ్యవస్థలా పని చేస్తూ అడ్డంకులను దాటేందుకు ఈ సహజ నిర్మాణాలను ఉపయోగిస్తాయి. ప్రతి చీమ తన కాళ్లు, శరీర భాగాలతో మరో చీమను గట్టిగా పట్టుకుని గొలుసు మాదిరిగా అనుసంధానమవుతుంది. వీటి ప్రత్యేకత ఏమిటంటే, ఈ వంతెనలు ముందుగానే రూపొందించిన ప్రణాళిక ప్రకారం నిర్మించబడవు. చీమల సమూహం ప్రయాణించే దిశ, ఎదురయ్యే అడ్డంకుల ఆధారంగా కొన్ని చీమలు వంతెనలో చేరుతాయి, మరికొన్ని విడిపోతాయి. అందువల్ల వంతెన పొడవు, ఆకారం, బలం అవసరానికి అనుగుణంగా మారుతూ ఉంటుంది. సోషల్ మీడియాలో ఈ చీమల వంతెనలు వందల అడుగుల పొడవు ఉంటాయని ప్రచారం కనిపించినప్పటికీ, శాస్త్రీయ పరిశీలనల ప్రకారం వాటి పరిమాణం సాధారణంగా కొన్ని అడుగుల నుంచి కాలనీ పరిమాణం, పరిసర పరిస్థితులను బట్టి మారుతుంది. ఆర్మీ చీమల ఈ సామూహిక తెలివితేటలు శాస్త్రవేత్తలకు ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తున్నాయి. ఒక నాయకుడి ఆదేశాలు లేకుండానే ప్రతి చీమ తన స్థానిక పరిస్థితులకు అనుగుణంగా స్పందిస్తూ మొత్తం సమూహానికి ఉపయోగపడే నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ విధానం రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, స్వార్మ్ ఇంజినీరింగ్ వంటి రంగాలకు కొత్త ఆలోచనలను అందిస్తోంది. చిన్న జీవులైనా, పరస్పర సహకారం, సమన్వయం ఉంటే ఎంతటి క్లిష్టమైన సమస్యలనైనా పరిష్కరించగలమని ఆర్మీ చీమలు చూపిస్తున్నాయి. ప్రకృతిలోని ఈ సజీవ వంతెనలు జీవుల మధ్య సహకారం ఎంత శక్తివంతమైనదో తెలియజేసే అద్భుత ఉదాహరణలు.

అంగారక గ్రహం ఎవరిది?

ఈ ప్రశ్న విచిత్రంగా ఉండవచ్చుగానీ, నిజానికి ఇది ఆలోచించాల్సిన విషయమే. ఎందుకంటే, 1997లో నాసా చేపట్టిన 'మార్స్ పాత్ ఫైండర్' మిషన్ అంగారక గ్రహంపై విజయవంతంగా దిగిన తర్వాత ఒక విచిత్రమైన సంఘటన వార్తల్లో నిలిచింది. యెమెన్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు నాసాపై ఫిర్యాదు చేసినట్లు పలు కథనాలు పేర్కొన్నాయి. వారి వాదన ప్రకారం, వేల సంవత్సరాల క్రితం తమ పూర్వీకుల నుంచి అంగారక గ్రహం తమకు వారసత్వంగా వచ్చిందని, కాబట్టి తమ అనుమతి లేకుండా నాసా అక్కడ పరిశోధనలు చేయడం చట్టవిరుద్ధమని వారు పేర్కొన్నారు. అయితే ఈ వాదనకు అంతర్జాతీయ చట్టపరమైన ఆధారం లేదు. అది చారిత్రక ఆధారాలు లేదా చట్టబద్ధమైన యాజమాన్య హక్కులపై కాకుండా సంప్రదాయ కథనాలు, వ్యక్తిగత విశ్వాసాలపై ఆధారపడింది. 1967లో అమల్లోకి వచ్చిన 'ఔటర్ స్పేస్ ఒప్పందం' ప్రకారం, అంగారక గ్రహం వంటి ఖగోళ వస్తువులపై ఏ దేశం, వ్యక్తి లేదా సంస్థ వ్యక్తిగత యాజమాన్య హక్కులను ప్రకటించలేరు. అంతరిక్షం మానవజాతి మొత్తం ప్రయోజనాల కోసం ఉపయోగించాల్సిన ప్రాంతంగా పరిగణించబడుతుంది. ఏ దేశమూ గ్రహాలను తన సొంత భూభాగంగా ప్రకటించుకోలేరు. అందువల్ల యెమెన్ పౌరుల ఫిర్యాదుకు చట్టపరమైన గుర్తింపు లభించలేదు.అది నాసా మార్స్ పాత్‌ఫైండర్ మిషన్‌పై ఎలాంటి ప్రభావం చూపలేదు. ఈ సంఘటన వినోదాత్మకంగా కనిపించినప్పటికీ, అంతరిక్ష చట్టాల ప్రాముఖ్యతను గుర్తుచేస్తుంది.

మంచు వాలులపై పెరిగే అద్భుత వృక్షం



ఆఫ్రికాలోని టాంజానియాలో ఉన్న ప్రసిద్ధ కిలిమంజారో పర్వతం ఎత్తైన ప్రాంతాల్లో మాత్రమే కనిపించే 'డెండ్రోసెనెసియో కిలిమంజారి' అనే మొక్క ప్రకృతి అనుకూలన శక్తికి అద్భుత ఉదాహరణ. దీనిని సాధారణంగా 'జెయింట్ గ్రౌండ్‌సెల్' అని పిలుస్తారు. సముద్ర మట్టానికి సుమారు 2,800 మీటర్లకు పైబడిన ఎత్తులో పెరిగే ఈ మొక్క, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల ను కూడా తట్టుకుని జీవిస్తుంది. కిలిమంజారో పర్వతంపై పగటి సమయంలో సూర్యరశ్మి తీవ్రంగా ఉన్నప్పటికీ, రాత్రివేళ ఉష్ణోగ్రతలు గడ్డకట్టే స్థాయికి పడిపోతాయి. ఇలాంటి తీవ్రమైన మార్పులను ఎదుర్కొనేందు కు ఈ మొక్క ప్రత్యేకమైన శారీరక లక్షణాలను అభివృద్ధి చేసుకుంది. మందపాటి కాండం నీటిని నిల్వ చేసుకుంటుంది. దట్టంగా గుత్తులుగా పెరిగే ఆకులు చలికి రక్షణ కల్పిస్తాయి. జెయింట్ గ్రౌండ్‌సెల్ దాదాపు 10 మీటర్ల ఎత్తు వరకు పెరిగి చెట్టులా కనిపిస్తుంది. అయితే ఇది నిజమైన చెట్టు కాదు. ఇది 'ఆస్టరేసీ' కుటుంబానికి చెందిన ఒక పుష్పించే మొక్క. దీని ప్రత్యేకతల్లో ఒకటి ఎండిపోయిన పాత ఆకులు కాండాన్ని చుట్టుముట్టి అలాగే ఉండిపోవడం. ఈ ఎండిన ఆకుల పొర సహజమైన రక్షణ కవచంలా పనిచేసి కాండాన్ని మంచు నుంచి కాపాడుతుంది. లక్షల సంవత్సరాల పరిణామ క్రమంలో జీవులు తమ పరిసరాలకు ఎలా అనుగుణంగా మారతాయో ఈ మొక్క స్పష్టంగా చూపిస్తుంది. పర్వత వాతావరణంలో కూడా జీవించగల సామర్థ్యంతో జెయింట్ గ్రౌండ్‌సెల్ కిలిమంజారో పర్వతానికి ఒక ప్రత్యేక గుర్తింపుగా మారింది.

– బిఎస్ఎస్ మైత్రేయి

మోదీ ప్రాధాన్యతల్లోకి మహిళలు, యువత

80వ స్వాతంత్ర్యదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట బురుజులనుంచి వరుసగా 13వ సారి జాతీయ పతాకావిష్కరణ గావించిన తదుపరి చేసిన సాంప్రదాయక ప్రసంగంలో అనేక ఉద్ఘాటనలతోపాటు రెండు తరగతుల ప్రజలు ప్రత్యేక ప్రస్తావనకు, ప్రాధాన్యతకు నోచుకున్నారు. వారు మహిళలు, యువత. చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు రిజర్వేషన్ చట్టం అమలును లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)తో ముడిపెట్టి రాజ్యాంగ సవరణకు మార్చినెల బడ్జెట్ సమావేశంలో చేసిన ప్రయత్నం విఫలం కావటం వల్ల ప్రభుత్వ ప్రతిష్టకు తగిలిన ఎదురుదెబ్బ, గల నెలలో జన్ జీ యువత నీట్ ఇతర ప్రశ్నాపత్రాల లీకేజికి ప్రభుత్వంనుంచి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ, విద్యార్థుల, వారి తల్లిదండ్రుల మనోవేదనను ప్రతిబింబిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జంతర్‌మంతర్‌లో గాంధేయమార్గంలో సాగించిన ఉధృతమైన ఆందోళనపై, పార్లమెంటు మార్చ్‌పై క్రూరమైన హింసను ప్రయోగించి అపఖ్యాతి పాలైన ప్రభుత్వం, విద్యామంత్రి ప్రధాన్ చేత రాజీనామా చేయించి పొందిన నైతిక పరాజయం నుంచి కోలుకునే ప్రయత్నం ఇందుకు నేపథ్యంగా భావించవచ్చు. పోలీసు హింసకు జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఐక్యంగా పార్లమెంటు బయట, లోపల సాగించిన ఆందోళనతో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా పార్లమెంటు సమావేశాల నుంచి ముఖంచాటేసి మరీ అప్రతిష్టపొందారు. ఈ ఉద్యమ ఖ్యాతి కాక్రోచ్ జనతాపార్టీకి, ప్రతిపక్ష ఇండియా కూటమికి దక్కిన దృష్ట్యా జన్ జీ తరం తల్లిదండ్రులను బుజ్జగించటానికి ప్రధానమంత్రి, ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్ హితోపదేశాలకు, దేశం నలుమూలలా సంఘ్, బిజెపి నాయకుల ప్రచారానికి దన్ను చేకూర్చే ప్రయత్నం ప్రధాని ప్రసంగంలో కనిపిస్తుంది.

ముందు మహిళా రిజర్వేషన్ చట్టం అమలు అంశాన్ని చూదాం. ''అందరూ మహిళలను పూజించాలి. మహిళా రిజర్వేషన్ బిల్లు(పార్లమెంటు ఉభయ సభల ఆమోదం, రాష్ట్రపతి ఆమోద ముద్రతో అది 2003 సెప్టెంబర్‌లో చట్టరూపం దాల్చింది) అమలుకోసం ముందుకు రావాలని అన్ని పార్టీలను కోరుతున్నాను. దాన్ని ఆమోదించినందుకు వారు కూడా ఆ ఖ్యాతిని పొందవచ్చు. మన మహిళలకు ఆ హక్కు ఇవ్వండి. అది ఈ క్షణం అవసరం''అని ప్రధాని మోదీ వక్కాణించారు. దీనివెనుకనున్న వాస్తవం ఏమిటి? దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లుపై దీర్ఘకాలం మాట్లాడని మోదీ, తన రెండవ పదవీకాలం చివరలో అకస్మాత్తుగా తన అంబులపొది నుంచి ఈ బిల్లును పార్లమెంటు ముందుకు తెచ్చారు. అన్ని పక్షాలు బలపరిచాయి. ఉభయ సభలు బిల్లును ఆమోదించాయి. అయితే దీన్ని తక్షణం 2024 ఎన్నికల్లోనే అమలు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయగా, 2026 తదుపరి తొలి సెన్సెస్ వరకు నియోజకవర్గాల మార్పుపై రాజ్యాంగ సవరణ ద్వారా నిషేధం ఉందని, అందువల్ల ఆ సెన్సెస్ ప్రాతిపదికపై దాన్ని అమలు చేయాల్సి ఉంటుందని నాడు ప్రభుత్వం తన వైఖరిని సమర్థించుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓట్ల కోసం రిజర్వేషన్ బిల్లు హడావిడిగా తెచ్చారని అందరికీ అర్థమైంది. అయినా ఆ ఎన్నికల ఫలితాలు ఆశించిన ఫలితం ఇవ్వలేదు.

బిజెపి లోక్‌సభ బలం 240కి పరిమితమైంది. ఇప్పుడేమో మహిళలకు త్వరగా న్యాయం చేయాలంటూ, ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకోకుండా, ఏకపక్షంగా 2010సెన్సెస్ ప్రాతిపదికగా డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి మోదీ భంగపడ్డారు. కాని కిందపడ్డా తమదే పైచేయి అనే మనస్తత్వం కదా!

ప్రతిపక్షాలు మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించి వారికి ద్రోహం చేశాయంటూ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం సాగించారు. నియోజకవర్గాల సంఖ్యను ప్రతీరాష్ట్రంలో 50 శాతం పెంపుదల నోటిమాట తప్ప బిల్లులో ప్రతిపాదించలేదు. నియోజకవర్గాల సంఖ్య పెంపుదలతో మహిళా రిజర్వేషన్‌ను సంధానించారు. అయితే ప్రస్తుత లోక్‌సభ, అసెంబ్లీల సంఖ్యాబలం ఆధారంగానే మహిళా రిజర్వేషన్ అమలు జరపాలని, ముందుగా అఖిలపక్ష సమావేశం జరిపి ఏకాభిప్రాయ సాధనకు కృషి చేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. ఆ డిమాండ్‌కు ప్రభుత్వం స్పందించదు. ప్రతిపక్ష పార్టీలను చీల్చి మద్దతు కూడగట్టుకోవాలని ప్రభుత్వం నీచమైన ప్రయత్నం చేస్తోంది.

రెండు, యువత. ప్రధాని తమ 75 నిముషాల ప్రసంగంలో ''యువత'' పదాన్ని 50 సార్లుకు పైగా ప్రస్తావించారు. వారిని ఆకట్టుకునేందుకు కొన్ని తాయిలాలు ప్రకటించారు. పోటీ పరీక్షలకోసం ఎంతో ధనం వెచ్చిస్తూ కుటుంబానికి భారంగా తయారైన యువతకోసం 'పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్'; ఒక కోటి యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) శిక్షణ, క్రీడా ప్రతిభులకోసం అన్వేషణ; మరింత క్రియాశీలమైన పౌర రక్షణ వ్యవస్థ వాటిలో ఉన్నాయి.

భారతదేశాన్ని ముందుకు నడిపించి, ఉన్నత శిఖరాల కు చేర్చేందుకు 'సప్తధారల'ను మోదీ ప్రకటించారు. అవి–మాన్యుఫాక్చరింగ్, విద్యుచ్ఛక్తి, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్నాలజీ మరియు ఆవిష్కరణలు, గతిశక్తి, రక్షణ శక్తి, గ్రీన్ అండ్ బ్లూ ఆర్థిక వ్యవస్థ, మేధాశక్తి. అడవులనుంచి నక్సలైట్లను ఏరివేశామని, మేధావులైన మావోయిస్టులు ఇంకా పట్టణాలలో పనిచేస్తున్నారని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎర్రకోట వేడుకల్లో పలు విశేషాలు, వివాదాలు కూడా ఉన్నాయిః జాతీయ గేయం 'వందేమాతరం' మొత్తం ఆరు పాదా లూ తొలిసారి పాడినారు. ఆర్మీ బ్యాండ్ బాణీ వాయించగా సభికులు పెదాలు కదిపేరు. తదుపరి ప్రధాని జాతీయ పతాకం ఎగురవేయగా, అనంతరం జాతీయగీతం 'జనగణమన' ఆలాపన జరిగింది. కాంగ్రెస్ పాలనను నిందించటానికే సర్వసాధారణంగా తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరు ప్రస్తావించే నరేంద్రమోదీ ఈసారి స్వాతంత్ర్య సమరయోధుల పేర్లలో భాగంగా ప్రస్తావించారు. ఇక వివాదాల్లోకి వస్తే, ప్రధాని జేబు చతురస్రంపై త్రివర్ణ పతాకం రివర్స్ వరుసలో ఉండటాన్ని ప్రతిపక్షాలు ఎత్తిచూపాయి. కాగా కాంగ్రెస్ నాయకుల గైరుహాజరు స్వాతంత్ర్య దినం రోజున 'వందేమాతరం' గీతాన్ని అవమానించటమేనని బిజెపి వారు విమర్శించారు. ●

విద్యా వ్యవస్థపై ఆర్‌ఎస్‌ఎస్ ఉడుంపట్టు

కృష్ణ ఝా

చీకటిని పారద్రోలి విద్య జ్ఞానాన్ని ఆవిష్కరిస్తుందనే విషయం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు తెలియంది కాదు. అందుకే ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ జెన్ జీతో సమావేశం అయ్యేందుకు ముందే, దాని అజెండా ఏమిటో వారికి ముందే తెలుసు. సమాజాన్ని తప్పుదోవ పట్టించేందుకు, వారికి అనుకూలురైన చరిత్రకారులచే వాస్తవాలను వక్రీకరించడం ఒక్కటే వారికి చెల్లుతుంది. ప్రాచీన నాగరిక విలువల ముసుగులో హిందుత్వ ఆధారంగా రూపొందించబడిన విద్యారంగ విధానంలోనే అడ్డూ అదుపు లేకుండా కార్పొరేటీకరణ చేయటం అంతర్లీనంగా ఇమిడి ఉండటంతో, అది వినాశకరంగా నిరూపితమైంది. ఇది విద్య ప్రాధాన్యతా స్థానాన్ని అంతం చేయడానికి దారితీసింది. ప్రజలకు విద్యను అందించడం ఎల్లప్పుడూ ఏ ప్రభుత్వానికైనా ప్రధాన బాధ్యతగా పరిగణించబడేది, కానీ ఇప్పుడు ఆ బాధ్యతను నీతిమాలిన ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు.

ప్రాథమిక పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల వరకు అన్ని విద్యా, పరిశోధనా సంస్థలు తమకు నచ్చిన వ్యక్తుల ఆధ్వర్యంలో నడిపిస్తున్నారనేది నేడు అందరికీ తెలిసిన విషయమే. నియామకాలు ఎంపిక విధానంలో జరుగుతాయి. వాటికి ఆర్‌ఎస్‌ఎస్ ద్వారా ఎంపిక చేయబడతాయి. కేవలం అనుబంధ సంస్థల సభ్యులు మాత్రమే అర్హత పొందుతారు. పాఠశాల ఉపాధ్యాయుల నుండి వైస్ ఛాన్సలర్ల వరకు, విద్యా, పరిశోధనా సంస్థల డైరెక్టర్ల నుంచిడి స్వయంప్రతిపత్తి సంస్థల అధిపతుల వరకు మితవాద శక్తులు బరితెగించి అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. ఈ నియామకాలు, మితవాద శక్తుల ప్రత్యక్ష అండతో అధ్యయనాలు, పరిశోధనల పునర్వ్యవస్థీకరణకు దారితీసి, మొత్తం విద్యా వ్యవస్థను కలుషితం చేస్తున్నాయి.

మరో అంశం, మితవాద సిద్ధాంతాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలను సవరించడం. ఎన్‌సిఇఆర్‌టి, సిబిఎస్ఇ లేదా వివిధ రాష్ట్ర బోర్డు ల వంటి సంస్థలు ఈ పనిని చేపట్టాయి. వాస్తవాలను వక్రీకరించి, వాటి నిష్పాక్షికతను దెబ్బతీయడానికి ప్రయత్నాలు జరిగాయి. శాస్త్రీయ దృక్పథాన్ని పరిరక్షించడంలో నిష్పాక్షికత ఒక ముఖ్యమైన అంశం. మధ్యయుగం, అలాగే మొఘల్ యుగం, స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన అంశాలను పూర్తిగా తొలగించారు. ఆర్‌ఎస్‌ఎస్ లేదా ఇతర హిందుత్వ ప్రముఖులకు చరిత్రలో చోటు కల్పించేందుకు ముస్లిం వ్యతిరేక ఆర్‌ఎస్‌ఎస్ వైఖరికి అనుగుణంగా బరితెగించి ఉన్నత విద్య సిలబస్‌లో కోతలు విధించారు. చరిత్రలో వారి ప్రతికూల, విధ్వంసకర పాత్ర ఉన్నప్పటికీ, వక్రీకరణ విషయంలో వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వడానికి ప్రయత్నాలు జరిగాయి. వాస్తవానికి, ఇప్పుడు పాఠ్యప్రణాళికపై నిశిత పర్యవేక్షణ ఉంది. హిందుత్వ జాతీయవాదానికి ఇబ్బంది కలిగించే దేన్నీ అనుమతించరు. కుల, లింగ భేదాలు, సమాజంలోని సంఘర్షణలు, వైరుధ్యాలు, సమాజంలోని వివిధ రకాల విభజనల వాస్తవాలను అణచివేస్తున్నారు. వామపక్షవాదులుగా లేదా జాతీయవాదులు కానివారిగా ఆర్‌ఎస్‌ఎస్ భావించే రచయితలను, మేధావులను తొలగిస్తున్నారు.

అయితే, ఆర్‌ఎస్‌ఎస్ విద్యా వ్యవస్థను ఆర్థికంగా ఎలా తన ఆధీనంలోకి తీసుకుందో అనే విషయం ఇంకా ప్రజల దృష్టికి రాలేదు. ఇది అనేక రూపాల్లో ఉంటుంది వర్క్‌షాప్‌లు, సెమినార్లకు నిధులు సమకూర్చడం నుంచి ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరేపిత సంస్థలు ప్రచురించే నిర్దేశిత పుస్తకాలలోని వక్రీకరణలకు ఆజ్యం పోసే అనువైన సబ్జెక్టులను చదవడానికి స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం వరకు ఇది విస్తరించి ఉంది. సంఘ్ పరివార్ దృష్టిలో, ఈ చర్యకు రెండు ప్రయోజనాలు ఉన్నాయి ఇది ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థలకు డబ్బును మళ్ళిస్తుంది, వారి విషపూరిత భావజాల వ్యాప్తిని సులభతరం చేస్తుంది.

ఈ అంశాలన్నీ దాదాపు అన్ని విద్యాసంస్థలపై నియంత్రణ సాధించడానికి ఆర్‌ఎస్‌ఎస్‌కు దోహదపడ్డాయి. ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రణలో ఉన్న సంస్థలలో, విద్యార్థులకు ప్రశ్నలు అడిగే స్వేచ్ఛ, తమ ఆలోచనలను వ్యక్తపరిచే స్వేచ్ఛ, తమ ఆసక్తులను అనుసరించి, తాము చేయాలనుకున్నది చేసే స్వేచ్ఛ ఉండదు. సొంతంగా ఆలోచించే స్వేచ్ఛ లేదా ప్రశ్నలు అడిగే స్వేచ్ఛ కేవలం విద్యార్థికి తెలుసుకునే హక్కును గౌరవించినప్పుడే సాధ్యమవుతుందని అర్థం చేసుకోవాలి. విద్యార్థులకు అన్ని వనరుల నుండి సమాచారం, జ్ఞానాన్ని పొందే హక్కు ఉండాలి. వారిని విభిన్న జ్ఞాన వనరులకు పరిచయం చేయడం విద్యాసంస్థలు, ఉపాధ్యాయుల కర్తవ్యం. ఆ హక్కు నేడు ప్రమాదంలో ఉంది.



నెమ్మదిగా, మన విద్యాసంస్థలు ఆర్‌ఎస్‌ఎస్ నడుపుతున్న సరస్వతీ శిశు మందిరాల ప్రతిరూపాలుగా మారుతున్నాయి. ఆ శిశు మందిరాల బోధనా పద్ధతులు, పాఠ్యప్రణాళిక, దినచర్యపై జరిపిన అధ్యయనాలు, యువత మనసులను హిందుత్వ భావజాలంలోకి ఎలా మారుస్తున్నాయో చూపిస్తున్నాయి. యువత యొక్క సాంస్కృతిక, రాజకీయ కల్పనలను తీర్చిదిద్దడానికి విద్యను ఒక ముఖ్యమైన సాధనంగా ఆర్‌ఎస్‌ఎస్ చాలాకాలంగా పరిగణిస్తోంది. దాని పాఠశాలలపై జరిపిన అధ్యయనాలు, హిందూయేతరులను శత్రువులుగా చూపించే విధంగా చరిత్రను, సామాజిక గుర్తింపును ఎలా బోధించవచ్చో నమోదు చేశాయి.

విద్యా వ్యవస్థపై ఆర్‌ఎస్‌ఎస్ తెచ్చిపెట్టిన విధ్వంసం నుండి భాగవత్ తప్పించుకోలేరు. అంతేకాకుండా, జెన్ జీ సభ్యులతో తన సంభాషణల సందర్భంగా వారిని(జెన్ జీని) దేశద్రోహులుగా ముద్ర వేయకూడదని పేర్కొంటూ భాగవత్ తనను తాను మితవాద స్వరంగా ప్రదర్శించుకున్నప్పటికీ, నీట్ వివాదంపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల సమయంలో, ప్రముఖ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త అతుల్ లిమాయే, ఎంపిలు నిశికాంత్ దుబే, కంగనా రనౌత్ వంటి బిజెపి నాయకులతో సహా ఆయన సహచరులలో చాలామంది, నిరసన చేస్తున్న యువతపై బహిరంగంగా తీవ్రమైన ఆరోపణలు చేశారు.

ఈ వైరుధ్యాన్ని విస్మరించడం అసాధ్యం. ఈ ఆరోపణలు జెన్ జీలోని కొందరు సభ్యులతో భాగవత్ జరిపిన సంభాషణను ఒక పకడ్బందీ రాజకీయ వ్యూహంగా స్పష్టం చేస్తున్నాయి. ఒక స్వరం వ్యవస్థ ప్రతిష్టను మెరుగుపరచడానికి ప్రయత్నిస్తుండగా, మరో స్వరం అసమ్మతిని భయపెడుతూ, విభజిస్తూ, అప్రతిష్టపాలు చేస్తూనే ఉంది. ఆర్‌ఎస్‌ఎస్ ఈ 'ద్వంద్వ ప్రమాణాల' వైఖరితో భారత యువతను తప్పుదోవ పట్టించలేము.

జెన్ జీ తరం సంభాషణకు, గౌరవానికి, నమ్మకానికి అర్హులని భాగవత్ నిజంగా విశ్వసిస్తే, ఆయన కొంత నైతిక స్థిరత్వాన్ని ప్రదర్శించాలి. భాగవత్ దృష్టిలో, దాని అర్థం కేవలం యువ భారతీయుల ఉద్దేశాలను, దేశభక్తిని పదేపదే ప్రశ్నించిన ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నాయకులను బహిరంగంగా వ్యతిరేకించడం మాత్రమే కాదు. మన యువతరం పట్ల సంఘ్ పరివార్ నాయకుల నోటి నుండి అలాంటి అసభ్య భాష ఎందుకు వస్తుందో ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి ఆత్మపరిశీలన చేసుకోవడం కూడా దాని అర్థం. అంతేకాకుండా, ఈ సంక్షోభానికి ఆర్‌ఎస్‌ఎస్ అనేది పరిష్కారం కాదని, అదే అసలు కారణమని భాగవత్ అంగీకరించాలి. ఈ సంక్షోభం పరిష్కారం కావాలంటే, విద్యా వ్యవస్థను ఆర్‌ఎస్‌ఎస్ పట్టు నుండి విడిపించడం అత్యవసరం. యువ భారతీయులు నాణ్యమైన విద్య, పారదర్శకమైన పరీక్షలు, ఉపాధి అవకాశాలు, పాలనలో జవాబుదారీతనం కోరుతున్నారు. ఈ ప్రశ్నకు భాగవత్ వద్ద గానీ, ఆర్‌ఎస్‌ఎస్ వద్ద గానీ, బిజెపి ప్రభుత్వం వద్ద గానీ ఎలాంటి సమాధానం లేదు.

రాజీవ్ యువ వికాసం కోసం యువత ఎదురుచూపులు

కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు
7569548477

ఆరు గ్యారంటీల హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అందులో ఒక గ్యారంటీలో భాగంగా ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకం కోసం నిరుద్యోగ యువత, విద్యార్థులు ఎంతో ఆశతో దరఖాస్తులు చేసుకున్నారు. 2025 మార్చి 17 నుండి ఏప్రిల్ 14 వరకు దరఖాస్తులు ప్రభుత్వం స్వీకరించగా, స్వయం ఉపాధి ద్వారా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలనే లక్ష్యంతో లక్షలాదిమంది యువత తెలంగాణ వ్యాప్తంగా రాజీవ్ యువ వికాసం పథకానికి మొత్తం 16,25,441 (సుమారు 16.23 లక్షలు) దరఖాస్తులు వచ్చాయి. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇబిసి వర్గాల యువతీ యువకులకు రూ.50,000 నుండి రూ.4లక్షల వరకు సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయం, రుణాలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి ప్రతి ప్రభుత్వంలో యువత కొరకు ప్రత్యేకమైన పథకాలను ప్రవేశపెట్టారు. ఆ పథకాల కొనసాగింపుగానే ఈ పథకానికి రాజీవ్ యువ వికాసం అని పేరు పెట్టారు. ఇది కొత్త పథకం కాదు. పేరు మాత్రమే కొత్తది.

రాజీవ్ యువ వికాసంకు దరఖాస్తుల స్వీకరణ పూర్తయినప్పటికీ పథకం అమలు విషయంలో స్పష్టత లేకపోవడం యువతలో ఆందోళనకు కారణమవుతోంది. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా వివిధ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీపై ఆధారపడి చిన్న వ్యాపారాలు, వాహనాలు, ఇతర ఉపాధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు అనేక మంది యువత ముందుకు వచ్చారు. అయితే దరఖాస్తులు తీసుకున్న తర్వాత వాటి పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక, బ్యాంకులకు ప్రతిపాదనలు పంపడం, రుణాల మంజూరు, సబ్సిడీ విడుదల వంటి ప్రక్రియలు ఎప్పుడు పూర్తవుతాయనే దానిపై స్పష్టమైన సమాచారం లేకపోవడంతో దరఖాస్తుదారులు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసి కాలం గడుస్తున్నా పథకం అమలు కోసం ఎదురుచూడాల్సి వస్తోందని పలువురు యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తులు తీసుకోవడం మాత్రమే కాదు.. లబ్ధి ఎప్పుడు?

ప్రభుత్వ పథకాలపై యువతలో నమ్మకం కల్పించాలంటే ప్రకటనలకే పరిమితం కాకుండా నిర్ణీత కాలపరిమితిలో వాటిని అమలు చేయాల్సిన అవసరం ఉంది. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన తదుపరి ప్రక్రియపై ప్రభుత్వం స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని యువత కోరుతోంది. యువ వికాసం పథకం పారదర్శకంగా అన్ని వర్గాల యువతకు అందే విధంగా చూడాలి. ఈ పథకం ద్వారా యువకులు తన కాళ్ళ మీద తాను బ్రతికే విధంగా ఉండాలి.

లబ్ధిదారుల ఎంపిక ఎప్పుడు పూర్తి చేస్తారు? రుణాలు ఎప్పుడు మంజూరు చేస్తారు? సబ్సిడీ ఎప్పుడు విడుదల చేస్తారు? అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. దరఖాస్తుదారులకు వారి దరఖాస్తు ప్రస్తుత స్థితిని తెలుసుకునే అవకాశం కల్పించాలని యువత డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న యువతకు స్వయం ఉపాధి ఒక ముఖ్యమైన మార్గం. ఇలాంటి సమయంలో రాజీవ్ యువ వికాసం పథకాన్ని వేగంగా అమలు చేస్తే ఎంతోమంది యువత తమ కాళ్లపై తాము నిలబడే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని యువత కోరుతోంది. ఈ పథకం నిరుపయోగం కాకుండా యువతలో నైపుణ్యతను పెంపొందించుటకు ఆర్థిక సహకారం తోపాటు శిక్షణను ఇవ్వాలి.

ప్రభుత్వం మార్కెట్ అంటే తాము ఇచ్చిన రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ది పొందినవారికి వారు తయారు చేసే ఉత్పత్తులను ప్రభుత్వం మార్కెటింగ్ కల్పిస్తే యువత అభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుంది.

గిరిజన ప్రాంతాలలో రోడ్లు నిర్మించాలి

లేఖ

దేశంలో రోడ్డు రవాణా అత్యంత వేగంగా ప్రమాద రహితంగా జరుగుటకు అంతర్జాతీయ స్థాయిలో రోడ్డు నిర్మాణాలు జరుగుచున్నవి. ఇది చాలా గర్వించదగ్గ విషయం. గుట్టలను తొలుచుకుంటూ సముద్రం పైన క్రింది భాగములో లోయలలో అసలు నిర్మాణమే జరగదనే చోట అత్యంత సాంకేతిక వ్యవస్థతో నిర్మాణాలు చేపడుతున్నారు ఇది మన దేశ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అనడంలో సందేహం లేదు 6, 8 వరుసల రహదారులు దూరాన్ని వేగవంతంగా తక్కువ సమయంలో చేరుటకు నిర్మిస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అవసరాలకు అంతర్జాతీయ స్థాయిలో దేశ వర్తక వాణిజ్యాలు నిర్వహించుటకు ఎంతగానో తోడ్పడతాయి కానీ విచిత్రమైన విషయం దేశ నలుమూలల్లో ఉన్న గిరిజన ప్రాంతాలలో ఇప్పటివరకు కూడా రోడ్డు నిర్మాణాలు పూర్తి స్థాయిలో చేపట్టకపోవడం. గిరిజనులను గిరిజన ప్రాంతాలను పట్టించుకున్నట్టు కనపడడం లేదు స్వతంత్ర దేశముగా ఏర్పడి 79 సంవత్సరాలు గడుస్తున్నా గిరిజన ప్రాంతాలకు ప్రాథమిక వసతులు సౌకర్యాలు కల్పించకపోవడం గర్హనీయమైన విషయం. ఇటీవల దిన పత్రికలలో ప్రసారమాధ్యాలలో గిరిజన ప్రాంతాలలో రోడ్డులు వంతెనలు లేక గర్భిణీ స్త్రీలు అనారోగ్య బారిన పడిన వారిని వైద్య సహాయం కోసం వాగులు వంకలు చేతులపై మరియు ఇతరత్రా దాటించడం చూస్తున్నాము. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు పెట్టుబడుదారులను ఆకర్షించ డం కోసం తగు ప్రభుత్వ భవనాలు ఉన్న ప్రైవేటు హోటల్లో ఫంక్షన్ హాల్లో సమావేశాలు కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి నిర్వహిస్తున్నారు. మైదాన ప్రాంతాలలో ఏ విధంగానైతే రోడ్డు సౌకర్యాలు కలిపిస్తున్నారో అదే విధంగా ప్రత్యేక పథకం ద్వారా దేశం నలుమూలల గిరిజన ప్రాంతాలలో అత్యాధునిక సాంకేతికత కూడిన రోడ్లు, వంతెనల నిర్మాణాలు వెంటనే చేపట్టాలని పాలకులను హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను.

దండంరాజు రాంచందర్ రావు

STATE & REGIONAL NEWS
జనరల్
STATE & REGIONAL NEWS
కరీంనగర్
ఆదివారం
16-08-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily

ఆకలి తీర్చేదే ‘రేషన్‌కార్డు’

- ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకొని పేదలకు సంక్షేమాన్ని అందిస్తున్నాం
- బిజెపి, బిఆర్‌ఎస్ ఒకే నాణేనికి ఉన్న బొమ్మా బొరుసు
- ఏనాడైనా పేదలకు సన్న బియ్యం ఇవ్వాలనే ఆలోచన వచ్చిందా? సంగారెడ్డిలో ‘స్మార్ట్‌కార్డుల’ పంపిణీలో సిఎం రేవంత్‌రెడ్డి ఫైర్

ప్రజాపక్షం/సంగారెడ్డి : రేషన్ అనే వ్యవస్థను ప్రారంభించిందే కాంగ్రెస్ పార్టీ అని, రేషన్‌కార్డు అనేది కేవలం బియ్యం తెచ్చిపెట్టే సాధనం కాదని, ఆత్మగౌరవమని సిఎం ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎక్కడికి వెళ్లినా మీ ఆకలి తీర్చే కార్డని చెప్పారు. ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకొని పేదలకు సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. రేషన్‌లో సన్న బియ్యం ఇవ్వడంతోనే మార్కెట్‌లో బియ్యం రేట్లు తగ్గాయని సిఎం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డిలో తొలుత మాజీ ప్రధానులు నెహ్రూ, రాజీవ్‌గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు వివేక్ వెంకట స్వామి, దామోదర రాజనర్సింహ, పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో కలిసి స్మార్ట్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాల్లో మంత్రులు, ప్రభుత్వ విప్‌లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ‘మేము ఇచ్చే పథకాలపై చాలా మంది వివిధ రకాలుగా మాట్లాడుతున్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ నాణేనికి ఉన్న బొమ్మా బొరుసు. ఈ రెండు పార్టీ నేతలను ప్రశ్నిస్తున్నా, ఏనాడైనా పేదలకు సన్న బియ్యం ఇవ్వాలనే ఆలోచన వచ్చిందా? మీరిచ్చిన దొడ్డు బియ్యం పేదలు ఏనాడైనా వండుకు తిన్నారా?. మేం ఇచ్చిన సన్న బియ్యం బర్రెలకు, కోళ్లకు దాణాగా వాడారా? అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. వరి వేసుకుంటే, ఉరి వేసుకున్నట్లే అని ఆనాడు కెసిఆర్ అన్నారని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కెసిఆర్ మాత్రం వందలాది ఎకరాల్లో వరి పండిస్తున్నారని రేవంత్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 బోనస్ ఇచ్చి మరి వడ్లు కొంటున్నామన్నారు. 32 నెలల్లో 70 లక్షల రైతుల ఖాతాల్లో రూ.36 వేల కోట్ల రైతు బంధు నిధులు వేశామని చెప్పారు. ‘కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు రాజు అయ్యాడు. తమ్ముడు రేవంత్‌రెడ్డిని ఆశీర్వదించడానికి, పాలపిట్ట చీరకట్టుకుని మహిళలు వచ్చారు. ఈసారి మహిళలకు సారె కింద చిలకపచ్చ చీరలు పంపిణీ చేస్తాం. అవి కట్టుకొని, ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకావాలి. ఇందిరమ్మ రాజ్యం అంటేనే మహిళల రాజ్యం’ అని సిఎం ఉద్ఘాటించారు.

6 నెలలకు ఒకసారి ఉద్యోగ నోటిఫికేషన్లు

కెసిఆర్ కుటుంబంలో అందరికీ ఉద్యోగాలు వచ్చాయని, రాష్ట్రంలో యువతకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదని సిఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. 6 నెలలకు ఒకసారి ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తాయని, నిరుద్యోగులు చదువుకోవాలని కోరారు. నిరుద్యోగులు ఎవరి ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. యువతకు ఉద్యోగాలు ఇచ్చి, ఆదుకునే బాధ్యత తమదని హామీ ఇచ్చారు. కెసిఆర్ చేసిన రూ.8 లక్షల 11 వేల కోట్ల అప్పులకు ఏడాదికి రూ.75 కోట్ల వడ్డీ కడుతున్నామని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తున్నామన్నారు. 12 ఏళ్ల బిజెపి పాలన, 10 ఏళ్ల బిఆర్‌ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను పోల్చి చూడాలని ప్రజలను కోరారు. ఎల్‌నినో ఉన్నా దేవుడి దయవల్ల కృష్ణా నదిలోకి పుష్కలంగా నీళ్లు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ ఆనందం వ్యక్తం చేశారు. ‘తమిళనాడు, కర్ణాటక పోయి మాజీమంత్రి అఘోర పూజలు చేస్తున్నారు. నాపైన, మా మంత్రుల పైన చేతబడి చేయిస్తే తట్టుకోగలం. మీరు ఎక్కడికి వెళ్లినా సోషల్‌మీడియాలో ఫొటోలు పెడతారుగా, శివమొగ్గ పోతే ఎందుకు సోషల్‌మీడియాలో ఫొటో పెట్టలేదు?. బావకు మద్దతుగా బామ్మర్ది వచ్చారు. చేతబడి చేసింది కాంగ్రెస్ నేతలపై కాదు, మాపైనే చేశారని బామ్మర్ది చెప్తున్నారు. ఫామ్‌హౌస్‌లో ఉన్న పెద్దాయన అందుకే బయటకు రావట్లేదు. అధికారం కోసం వారు ఎంతకైనా దిగజారుతారు’ అని అన్నారు. రాహుల్‌గాంధీ రాముడు అయితే జగ్గారెడ్డి హనుమంతుడని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఓడిపోయినా ప్రజల మధ్యే జగ్గారెడ్డి తిరుగుతున్నారని, రూ.1000 కోట్లు ఇచ్చినా జగ్గారెడ్డి లాంటి నాయకుడు దొరకడని రేవంత్ అన్నారు. నాయకులకు మార్కులు వేస్తే, తన కన్నా మంచి మార్కులు జగ్గారెడ్డికి వస్తాయని అన్నారు.

స్మార్ట్‌కార్డుల ఫొటోలపై రాద్ధాంతం ఆపండి

పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట : రేషన్‌కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం నూతనంగా అందజేస్తున్న స్మార్ట్‌కార్డుల ఫొటోలపై బిజెపి చేసే రాద్ధాంతాన్ని ఆపాలని రాష్ట్ర పౌరసరఫరాల, భారీ నీటి పారుదల శాఖల మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ ద్వారా లబ్ధిదారులకు అందజేసే సన్నబియ్యాన్ని ఇస్తే ప్రధాని మోదీ ఫొటో పెట్టేందుకు ఆలోచన చేస్తామని స్పష్టం చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసే స్మార్ట్‌కార్డుల విషయంలో రాజకీయ విమర్శలు సరికాదన్నారు. గతంలో అరకొరగా రేషన్‌కార్డులు ఇచ్చిన వారు అసలు సన్నబియ్యం ఇవ్వనివారు ఇప్పుడు స్మార్ట్‌కార్డులపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మీ పాలనలో మీ కార్డుల్లో మీ ఫొటోలు పెట్టుకోవద్దని తాము ఏనాడు చెప్పలేదని అలాంటిది తమ ప్రభుత్వంలో వారు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఈ రాజకీయ రాద్ధాంతాన్ని ఆపాలని హితవు పలికారు.

కార్పొరేట్ శక్తుల చేతుల్లో దేశం బందీ

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఎందరో మహనీయుల త్యాగాలతో సిద్ధించిన దేశం నేడు కార్పొరేట్ శక్తుల చేతుల్లో బందీ అవుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, సిపిఐ కార్యాలయం, గ్రామ పంచాయితీ భవనాలు, కార్మిక అడ్డాలు బస్తీ కూడళ్లలో ఆయన జాతీయ పతాకాలు ఆవిష్కరించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్య పోరాట అమర వీరులకు ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఆ ఫలాలు నేటికి అట్టడుగు పేద వర్గాల వారికి అందక పోవడం బాధాకరమన్నారు. కేంద్రపాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, విభజన విధానాల వల్ల దేశంలో పేదరికం నిరుద్యోగం ఆర్థిక అసమానతలు మరిత తీవ్రరూపం దాలుస్తున్నాయని ధ్వజమెత్తారు. దేశ సంపద అంతా కొద్ది మంది బడా కార్పొరేట్ల చేతుల్లో పోగుపడుతుంటే శ్రమ జీవులు సామాన్య ప్రజలు మాత్రం నిత్యం బ్రతుకు పోరాటం చేయాల్సి వస్తోందన్నారు. స్వాతంత్ర్య పోరాట యోధుల ఆశయాలైన సమాజ స్థాపన కోసం పేదల హక్కుల సాధన కోసం ప్రజలంతా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, జిల్లా సమితి సభ్యులు భూక్యా శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, గెద్దాడు నగేష్, కే.రత్నకుమారి, యాండ్ర మహేష్ నాయకులు ఎండి యూసుఫ్, నిమ్మగడ్డ వెంకటేశ్వర రావు, నేరెళ్ల శ్రీనివాస్, కార్పొరేటర్లు మునిగడప పద్మ, బండి నర్సింహ, పి.ధనలక్ష్మి, పడాల ఆకాంక్ష, నామా కీర్తి, మంద నాగలక్ష్మి, పట్టణ నాయకులు కే.ధర్మరాజు, జలీల్, షహీన్, కైసర్, నాగరాజు, అస్మిత్, భవాని పాల్గొన్నారు.

కార్మిక చట్టాల పరిరక్షణకు ఉద్యమాలు ఉధృతం

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్

ఎఐటియుసి కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో త్యాగధనులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని, అయితే స్వాతం త్ర్యం వచ్చి 79 ఏళ్లు గడిచినా దాని ఫలాలు ప్రజలందరికీ అందకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బాల్‌రాజ్ మాట్లాడుతూ దేశంలోని మొట్టమొదటి కార్మిక సంఘంగా ఎఐటియుసి ఏర్పడిన నాటి నుంచి స్వాతంత్ర్యం, కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. కనీస వేతనాల పెంపు, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు తదితర డిమాండ్ల సాధన కోసం భవిష్యత్‌లో నిర్వహించే పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ హాసీనాబేగం, ఉప ప్రధాన కార్యదర్శి చెట్టుక్రింది శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మారగోని ప్రవీణ్ కుమార్, కార్యదర్శి ఎ.పార్వతి, రమేష్, జె.లక్ష్మి, ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీకాంత్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : అనేక ఉద్యమాలు, త్యాగాల ద్వారా సాధించుకున్న స్వాతంత్ర్యం, పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడంతో పాటు, ఎంతో కష్టపడి నిర్మించుకున్న రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్, సిఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ అన్నారు. కొండాపూర్‌లోని చండ్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ (సిఆర్ ఫౌండేషన్)లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ కె.నారాయణ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాల స్ఫూర్తిని ఆచరణలో పెట్టేందుకు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఐక్యతను కాపాడే క్రమంలో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, లౌకికవాదానికి సవాళ్లు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి వి.చెన్నకేశవరావు, సిఆర్ పాలీ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె.రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోశ్యభట్ల కల్పన, సభ్యులు వి.లలిత, వృద్ధాశ్రమం సలహామండలి సభ్యులు మల్లంపాటి వెంకటేశ్వర రావు, రాజేంద్రరావు, తమ్మారెడ్డి తాన్యాకుమారి, ఐదుకల్లు అరుణ, వెలువోలు సాంబశివరావు, మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమ వాసులు, మహిళా సంక్షేమ కేంద్రం వృత్తి విద్యా కోర్సుల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్ గౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

కాంగ్రెస్ నేతలు ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్: టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్‌పై బిజెపి ఎంపి ధర్మపురి అరవింద్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. బాధ్యతాయుతమైన ఎంపి పదవిలో ఉండి అసభ్యకరమైన, అనుచిత భాష ఉపయోగించడం సరికాదని కాంగ్రెస్ ఎంపి ఎం.అనిల్‌కుమార్ యాదవ్, టిపిసిసి నేత ఈరవత్రి అనిల్‌కుమార్, మత్స్య అభివృద్ధి సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో శనివారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ మహేష్‌కుమార్ గౌడ్ విద్యార్థి, యువజన కాంగ్రెస్‌లో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగి టిపిసిసి అధ్యక్షుడి స్థాయికి వచ్చారని, అలాంటి వ్యక్తి గురించి తెలిసి కూడా అరవింద్ వెటకారంగా, చిల్లరగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. తన తండ్రి పేరును చెప్పుకుని రాజకీయాల్లోకి వచ్చిన చరిత్ర ధర్మపురి అరవింద్‌దని అనిల్ యాదవ్ విమర్శించారు. బిజెపిలో ఉన్న అరవింద్.. తాను మాజీ పిసిసి అధ్యక్షుడి కుమారుడిననే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఈరవత్రి అనిల్‌కుమార్ మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఉపయోగించే భాష సమాజానికి ఆదర్శంగా ఉండాలని అన్నారు. అహంకారంతో మాట్లాడటం సరికాదని, వయసుకు, పదవికి గౌరవం ఇవ్వాలని సూచించారు. మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ అరవింద్ తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వ్యక్తులను అవమానించేలా మాట్లాడటం తగదన్నారు. ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించాలని సూచించారు. నిజామాబాద్‌లో ఏదైనా వార్డు నుంచి పోటీ చేసి గెలిచి తన బలం నిరూపించుకోవాలని అరవింద్‌ను ఆయన సవాల్ చేశారు.

దేశం కోసం మహనీయులు త్యాగాలు

రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాత్యాగాలు, వారి పోరాటాల ఫలమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కెభవన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. రైతు కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎం.భవానీరెడ్డి, కమిషన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పరకాలకు సిఎం రేవంత్ రెడ్డి

- పరకాలలో రూ.400 కోట్లకు పైగా అభివృద్ధి పనులను ప్రారంభించనున్న సిఎం ఎ.రేవంత్‌రెడ్డి
- ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యేలు ప్రకాష్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, కెఆర్. నాగరాజులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/హనుమకొండ : ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆగస్టు 16న (ఆదివారం) మధ్యాహ్నం పరకాలలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పరకాలలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పరకాల, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేతతో కలిసి పరకాలలోని స్థానిక అంగడి స్థలం వద్ద భారీ బహిరంగ సభ ప్రాంగణం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో హెలిపాడ్ వద్ద ఏర్పాట్లను ప్రత్యక్షంగా మంత్రి శనివారం పరిశీలించారు. పరకాలలోని అంగడి స్థలం వద్ద సభా ప్రాంగణం, వేదిక, పార్కింగ్, ట్రాఫిక్, భద్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలను పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నియోజకవర్గంలో రూ.400 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజల చిరకాల అవసరాలను తీర్చే ఈ కార్యక్రమాలు పరకాల అభివృద్ధికి కొత్త ఊపునిస్తాయన్నారు.

మూడు జిల్లాల్లో సిఎం పర్యటన

ప్రజాపక్షం/హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం కామారెడ్డి, ములుగు, హనుమకొండ జిల్లాల్లో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం బయలుదేరి కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం కందర్పల్లి చేరుకుని, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంత రావు కుమార్తె వివాహ విందుకు హాజరవుతారు. అనంతరం ములుగు జిల్లా మేడారం చేరుకుని వన దేవతలు సమ్మక్క సారలమ్మ గద్దెలను దర్శించుకుంటారు. అక్కడి నుంచి ములుగు పట్టణానికి చేరుకుని గట్టమ్మ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన పైలాన్ ఆవిష్కరించి కొత్త కలెక్టరేట్ సముదాయాన్ని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి హన్మకొండ జిల్లా పరకాల చేరుకుని వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ శిలాఫలకాలను సిఎం ఆవిష్కరిస్తారు. అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

హైదరాబాద్: హైదరాబాద్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) స్థానిక ప్రధాన కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించేలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సృజనాత్మక, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా భారతదేశ సమష్టి వారసత్వం, విలువలను స్మరించుకున్నారు. కోటిలోని స్థానిక ప్రధాన కార్యాలయంలో ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నీలేష్ ద్వివేది జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు జాతీయ గీతాన్ని ఆలపించారు. సమావేశంలో ప్రసంగించిన ద్వివేది సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. త్రివర్ణ పతాకం భారతదేశ గొప్ప వారసత్వానికి, లక్షలాది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు, దేశ ప్రజల ఆకాంక్షలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఉద్యోగుల పిల్లలు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బంది, వారి పిల్లలను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు రష్మీ ద్వివేది, జనరల్ మేనేజర్లు సతీష్ కుమార్, రణవిజయ్ ప్రతాప్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బస్‌భవన్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : బస్‌భవన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టిజిఎస్ ఆర్‌టిసి విసి, ఎండి వై.నాగిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్యం అమరవీరుల త్యాగాల ఫలితమని ఆయన పేర్కొన్నారు. సరిహద్దుల్లో సైనికులు దేశాన్ని కాపాడుతున్నట్లే, ప్రజలను నిత్యం సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సిబ్బంది నిజమైన రవాణా యోధులని ప్రశంసించారు. ఎలక్ట్రిక్ బస్సులతో పాటు ‘గ్రీన్ ఆర్‌టిసి’ దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచడంతో పాటు కార్గో, లాజిస్టిక్స్ సేవలను విస్తరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇడిలు సిహెచ్.వెంకన్న, ఎం.రాజశేఖర్, ఎఫ్‌ఎ విజయపుష్ప, జెడి నర్మద, సిపిఎం ఉషాదేవి, సిఎంఇ జానిరెడ్డి, సిటిఎం శ్రీదేవితో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బిసి కమిషన్ కార్యాలయంలో..

తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత వందేమాతరం గీతాన్ని ఆలపించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన ఎంతోమంది మహనీయులను ఈ సందర్భంగా స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, అసిస్టెంట్ సెక్రటరీ కుమారి ఎన్. సునీత, రిసెర్చ్ అసోసియేట్ లక్ష్మీ నారాయణ, కార్యాలయ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అబ్కారీ భవన్‌లో...

అబ్కారీ భవన్ ఆవరణలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరి కిరణ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించగా, వందేమాతరం, జాతీయ గీతాలాపన జరిగింది. కార్యక్రమంలో ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, జాయింట్ కమిషనర్ అంజన్‌రావు, డిప్యూటీ కమిషనర్లు ఎ.శ్రీనివాసరెడ్డి, జె.హరికిషన్, అడిషనల్ ఎస్‌పి వెంకటేశ్వరబాబు, అసిస్టెంట్ కమిషనర్లు, ఇఎస్‌లు, టిబిసిఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రవాణా శాఖ కార్యాలయంలో..

హైదరాబాద్‌లోని రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కె.వెంకటరమణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదరికానికి అసమర్థ పాలకులే కారణం

- సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాపక్షం/హైదరాబాద్: స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా నేటికి దేశంలో పేదరికం, కుల వ్యవస్థ, అవినీతి, అక్రమాలు కొనసాగడానికి అసమర్థ పాలకులే కారణమని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాలు, భగత్‌సింగ్ లాంటి ఎందరో వీరుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, స్వాతంత్ర్య పోరాట చరిత్రలేని ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి దేశాన్ని పాలిస్తూ తిరోగమనంలోకి తీసుకెళుతున్నాయని, ఇది దేశానికి అవమానకరమన్నారు. హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాన్‌వెస్లీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామిక హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలే వాటిని హరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి, జూలకంటి రంగారెడ్డి, జి.నాగయ్య, టి.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎం) కార్యాలయం, ఉప్పల్ జోన్, ఎంఎంసి. ఇ-మెయిల్: eecircle9.ghmc@gmail.com

కొటేషన్ నోటీసు

కొటేషన్ నోటీసు: NIT నం. 04/EE/Uppal Circle-09/2026-27/Quotations, తేదీ: 14-08-2026

దిగువ పేర్కొన్న అంశాలకు సంబంధించి పేరున్న సంస్థల నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించబడుతున్నాయి. కొటేషన్లు 17-08-2026 సాయంత్రం 4.00 గంటల వరకు స్వీకరించబడతాయి మరియు అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు తెరవబడతాయి. ఇతర వివరాలను కార్యాలయ వేళల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ సర్కిల్-09 వారి కార్యాలయం నుండి పొందవచ్చు.

క్ర.సం.	వివరాలు	యూనిట్లు
1.	ISI మార్క్ కలిగిన 180 mm వ్యాసం (dia) గల PVC కేసింగ్ పైపు సరఫరా మరియు అమర్చడం	Rmt
2.	ISI మార్క్ కలిగిన 250 mm వ్యాసం (dia) గల PVC కేసింగ్ పైపు సరఫరా మరియు అమర్చడం	Rmt
3.	DTH (డౌన్ ది హోల్ హ్యామర్) పద్ధతిని ఉపయోగించి నిర్దేశించిన లోతు వరకు అన్ని రకాల భూగర్భ పొరలలో 165 మి.మీ. వ్యాసం (finished dia meter) వచ్చేలా బోర్‌వెల్ తవ్వాలి. అలాగే 125 మి.మీ. అంతర్గత వ్యాసం కలిగిన కేసింగ్ పైపును (క్లాంపింగ్‌లతో సహా) అమర్చడానికి వీలుగా బోర్‌ను సిద్ధం చేయాలి. ఇందులో కేసింగ్ పైపును దించి అమర్చడం, సగటున 7kg/cm2 (100 psi) పీడనంతో బోర్‌వెల్‌ను ఫ్లష్ (శుభ్రం) చేయడం మరియు దిగుబడి పరీక్ష (yield test) నిర్వహించడం. రవాణా పాయింట్ టు పాయింట్ సిబ్బందితో ఛార్జీలు, వినియోగ వస్తువులు రిగ్ మార్పిడి మరియు జిల్లాలోని ఇతర ఛార్జీలు ఇందులో కలిపి ఉంటాయి. బోర్‌వెల్ నిలువుగా మరియు సరైన అమరికలో ఉండాలి. అలాగే పనిని సంబంధిత శాఖవారికి సంతృప్తికరమైన రీతిలో పూర్తి చేయాలి. ఈ పనులన్నీ is-2800 పార్ట్-I & II-1979 ప్రమాణాలకు మరియు ఎప్పటికప్పుడు జారీ చేయబడే సవరణలకు అనుగుణంగా నిర్వహించబడాలి.	Rmt
	6 1/2 అంగుళాల వ్యాసం కలిగిన బోరు బావిని తవ్వడం	
	0 నుండి 30 మీటర్లు	
	30 నుండి 60 మీటర్లు	
	60 నుండి 90 మీటర్లు	
	90 నుండి 120 మీటర్లు	
	120 నుండి 150 మీటర్లు	
	150 నుండి 180 మీటర్లు	
	180 నుండి 210 మీటర్లు	
	210 నుండి 240 మీటర్లు	
	240 నుండి 270 మీటర్లు	
	270 నుండి 300 మీటర్లు	
	300 నుండి 330 మీటర్లు	
	330 నుండి 360 మీటర్లు	
	360 నుండి 390 మీటర్లు	

షరతులు:
1. కొటేషన్లు 17-08-2026 సాయంత్రం 4.00 గంటలలోపు లేదా అంతకంటే ముందుగా అందాలి. వీటిని అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు ఉప్పల్ సర్కిల్-09, ఉప్పల్ కార్యాలయంలో (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం) తెరుస్తారు.
2. ఎటువంటి కారణం చూపకుండానే కొటేషన్లను రద్దు చేసే అధికారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ సర్కిల్-09, ఉప్పల్ వారికి ఉంటుంది.

సంబంధిత అధికారి చిరునామా: శ్రీ కె. రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ సర్కిల్-09, ఉప్పల్, హైదరాబాద్.

DIPR R.O. No. : 8011-PP/CL/ADVT/2026-27, Date: 15-08-2026

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ సర్కిల్-09, ఎంఎంసి.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుందాం

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గన్నా చంద్రశేఖర్

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: భారతదేశ స్వాతంత్ర్య కోసం ప్రాణత్యాగాలను చేసిన అమలుపెరగని పోరాటాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హుజూర్‌నగర్ లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ముందు ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య కోసం పోరాడిన సిపిఐ పార్టీకి చెందిన వారు ఉండటం గర్వించ్చదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో గుండు వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, సోమగాని కృష్ణ, ఇందిరాల వెంకటేశ్వర్లు, చెన్నగానిసైదులు, జడ వెంకన్న, జక్కుల శ్రీనివాస్, దొంతగాని సత్యనారాయణ, స్టాలిన్, సీతరాములు పాల్గొన్నారు.

దేవరకొండ సిపిఐ కార్యాలయంలో...

ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని సిపిఐ కార్యాలయం పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో శనివారం భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ పల్లా నర్సింహారెడ్డి ఎగరవేశారు. అనంతరం భారత స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల పాత్రను వివరించారు. దేశం కోసం పోరాటం చేయాల్సివస్తే ప్రతి ఒక్కరు సిద్ధం కావాలని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు నవీన్, మండల కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు, యాదయ్య, మైనోద్దిన్, శివకుమార్, నగేష్, జ్యోతిబస్, బుచ్చయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య

ప్రజాపక్షం/చింతపల్లి : ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలోని నారాయణరావు భవన్‌లో శనివారం మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు ముందుగా త్రివర్ణ పథకాన్ని ఆవిష్కరించిన అనంతరం సమావేశంలో వెంకటయ్య పాల్గొని మాట్లాడారు. పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను బేషరతుగా అమలు చేయాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి రైతాంగానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించే పోరాటాలలో ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వేముల బుచ్చయ్య, మల్లోజు శేఖరాచారి, గుండ్లపల్లి ఇద్దిరాములు, కొణిదల వెంకటయ్య, యాచారం శ్రీశైలం, కుర్మేటి కృష్ణయ్య, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు మిడిదొడ్డి రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు శంశోద్దిన్, నరసింహ పాల్గొన్నారు.

తల్లి ఉద్యోగం తొలగించటంపై కూతురు నిరసన

పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడిన రత్తమ్మ

ప్రజాపక్షం/కోదాడ: తమ ఉద్యోగాలను తొలగించడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ మహిళ పెట్రోల్ తాగేందుకు ప్రయత్నించగా , ఆమె కూతురు అక్కడే నిరసనకు దిగిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. దీంతో మున్సిపాలిటి కార్యాలయం ఎదుట కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. కోదాడ మున్సిపాలిటి కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి హాజరై తిరిగి వెళ్లిన సమయంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. తన గోడును వెళ్లబోసుకునేందుకు పులి రత్నమ్మ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. తాను మున్సిపాలిటిలో ఉద్యోగం చేసేందుకు పూర్తి అర్హురాలని, అయితే ఇప్పుడు తొలగించారని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆమె వినతిపత్రం సమర్పించేందుకు సమాయత్తమయ్యారు. తమ గొడును ఎవరు పట్టించుకోవడం లేదని తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. అదే సమయంలో రత్నమ్మ కూతురు పులి జ్యోతి కూడా తన తండ్రి ఉద్యోగం తనకు ఇవ్వాలని సంవత్సరాల తరబడి ఇక్కడే పని చేస్తున్నానని ఆయిన జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంతులు ఉన్నాయి.. కళ ఉంది.. కానీ కృష్ణమ్మ పరుగులు లేవు...

ప్రజాపక్షం/నందికొండ: ఆగస్టు 15న దేశభక్తిని చాటేలా త్రివర్ణ పతాక రంగుల విద్యుత్ దీపాలతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు దగదగలాడుతోంది. రాత్రివేళ కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల కాంతులతో ప్రకాశిస్తున్న సాగర్ ప్రాజెక్టు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రాజెక్టు పరిసరాలు విద్యుత్ కాంతులతో కొత్త అందాలను సంతరించుకున్నాయి. అయితే ఈ అందాల వెనుక కనిపించని ఓ వెలితి అటు పర్యాటకులను, ఇటు స్థానికులను కలచి వేస్తోంది. గతేడాది ఇదే సమయంలో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లపై నుంచి జాలువారిన కృష్ణమ్మ వరద ప్రవాహం త్రివర్ణ కాంతుల్లో మరింత అద్భుతంగా కనిపించింది. గేట్ల నుంచి ఉప్పొంగుతూ కిందికి దూకిన కృష్ణా జలాలు, వాటిపై పడిన విద్యుత్ దీపాల కాంతులు కలిసి నాగార్జునసాగర్‌ను కనువిందు చేసే దృశ్యంగా మార్చాయి.కానీ ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా ఉంది.

గ్రామ స్వరాజ్యానికి కృషి చేద్దాం

తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

ప్రజాపక్షం/భువనగిరి : ప్రపంచ చరిత్రలో ఆగస్టు 15కి విశిష్ట స్థానం ఉందని, సుమారు రెండు శతాబ్దాల బ్రిటిష్ పాలన నుంచి మన దేశానికి స్వాతంత్ర్యం లభించిన పవిత్రమైన రోజు అని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ముఖ్య అతిథి హోదాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ప్రియమైన స్వాతంత్ర్య సమరయోధులకు, అమరవీరుల కుటుంబ సభ్యులకు, జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, న్యాయమూర్తులకు, అధికారులు, ఉద్యోగులకు, కర్షకులు, కార్మికులు, పాత్రికేయులు, విద్యార్థినీ విద్యార్థులకు 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారు. వారి త్యాగాలకు ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు. వారి ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని, దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం కోసం మనమందరం ఐక్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. పూజ్య బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేయడానికి కృషి చేద్దామన్నారు. ఈ సందర్భంగా తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని మీకు వివరించడానికి సంతోషిస్తున్నామన్నారు. దేశభక్తిపై విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకర్షించాయి. విధులలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, మున్సిపల్ కమీషనర్ శ్రీ వాణి, వైస్ చైర్మన్ మంజుల, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, జడ్పీ సిఈఓ శోభారాణి జిల్లా అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ అంటే పోరాటం.. త్యాగం.. తిరుగుబాటు.. ఆత్మగౌరవం

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండ: స్వాతంత్ర్య సమరంలో,తెలంగాణ సాయుధ పోరాటంలో నల్లగొండ జిల్లా ప్రజలు సింహభాగం పాత్ర పోషించారని రాష్ట్ర రోడ్లుభవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం,శంకర్ నాయక్, ఎంపీ రఘువీర్ రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి లతో కలసి మంత్రి కోమటిరెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు.80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆయన ప్రసంగించారు.ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే నేటి స్వతంత్ర భారత దేశం. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు ఎందరో దేశభక్తులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్,డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, భగత్‌సింగ్ వంటి మహనీయుల త్యాగాల ఫలితంగానే మనకు స్వాతంత్యం లభించింది అని మంత్రి అన్నారు. వీర నారి చాకలి ఐలమ్మ, రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి,ఆరుట్ల కమలాదేవి, బొమ్మగాని ధర్మభిక్షం తదితరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఉద్యమ చరిత్రను తిరగేస్తే ప్రతి పేజీలో నల్లగొండ పోరాట స్ఫూర్తి కనిపిస్తుంది అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. వేడుకల్లో నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్,జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీవో అశోక్ రెడ్డి,అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దేవాదుల ప్రాజెక్టు పూర్తికి ప్రాధాన్యత

సూర్యాపేటలో రూ.2,392 కోట్లతో 3 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట : రాజకీయాలకు అతీతంగా సూర్యాపేట జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రైతు సంక్షేమం, ఆహారభద్రతకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సూర్యాపేటలో రూ.2,392 కోట్లతో 3 ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేస్తామని చెప్పారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టడం జరిగిందన్నారు. రైతులకు వాస్తవ సాగునీటి ప్రయోజనాలుగా మారేలా మిగతా ప్రాజెక్టు పనులు పూర్తి చేయడంతోపాటు అడ్డంకులను తొలగించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. సూర్యాపేట ప్రజలకు నేను మాటా ఇస్తున్నానని ఈ ప్రభుత్వ పదవీ కాలంలోనే దేవాదుల ఫేస్ 6 ను పూర్తిచేసి కార్యరూపంలోకి తీసుకస్తామని హామీ ఇచ్చారు. దేవాదుల ద్వారా గోదావరి జలాలను తుంగతుర్తి నియోజక వర్గంలోకి తీసుకవచ్చి రైతులకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. కృష్ణబేసిన్ వ్యవస్థను స్థానిక ప్రాజెక్టుల ద్వారా లభించే సాగునీటికి గోదావరి జలాలు అదనపు బలంగా నిలుస్తాయన్నారు. జిల్లాలో 5.82 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని దీర్ఘకాలిక మౌలిక నీటి వసతులతో పూర్తిస్థాయిలో సాగయ్యేలా చూస్తామన్నారు. నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పి స్టేజ్ 2, మూసీ తదితర వ్యవస్థలతో నీటిలభ్యతను నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. రూ.2,392 కోట్లతో సూర్యాపేట సాగునీటికి కొత్త ఊపు వస్తుందన్నారు. వీటి ద్వారా 77వేల ఎకరాల సాగునీటి ప్రయోజనం చేకూరుతుందన్నారు. రూ.1649కోట్లతో చేపట్టే మహాత్మాగాంధీ ముత్యాల్ బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా సుమారు 53వేల ఎకరాలు, రూ.292 కోట్లతో నిర్మాణం చేస్తున్న జవహర్ జాన్‌పహాడ్ బ్రాంచ్ కెనాల్ ద్వారా 10వేల ఎకరాలకు, రూ.450 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకం ద్వారా దాదాపు 14వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 3.82 లక్షలకు పైగా ఆహారభద్రత కార్డుదారులు ఉన్నారని వీరందరికి స్మార్ట్‌కార్డులు అందించి ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత సులభతరం, పారదర్శకం చేస్తామన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పి కె. నరసింహతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛ

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ పట్టణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఏ బాలునాయక్ జాతీయ జెండాను ఎగరవేశారు. పట్టణంలోని పలు కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, ఎంపిడివో కార్యాలయంలో ఎంపిడివో డానియల్, ఆర్డివో కార్యాలయంలో ఆర్డివో పద్మప్రియ, రైతు వేదికలో ఏడిఏ శ్రీలక్ష్మీ , తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌లు మువ్వన్నెల జెండాను ఎగరవేశారు. ఈకార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే మందుల

ప్రజాపక్షం/తుంగతుర్తి : తుంగతుర్తి నియోజక వర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శనివారం తన క్యాంప్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2వేల కోట్ల రూపాయలతో నియోజక వర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. స్వాతంత్ర్య సాధన కోసం పోరాడి అసువులు బాసిన అమరులకు ఘనంగా నివాళులర్పించారు. తుంగతుర్తి మండల కేంద్రం తోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాజకీయ పార్టీల కార్యాలయాల్లో, సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

సమరయోధుల త్యాగాలు మరువద్దు :ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ప్రజాపక్షం/మునుగోడు: భారత స్వాతంత్రం కోసం పోరాడిన సమరయోధుల త్యాగాలను మరువద్దని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.శనివారం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మునుగోడు క్యాంపు కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జనగణమన గీతాలాపన చేశారు.సమరయోధుల ఆశయాల కోసం పనిచేయాలి: ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాటి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితమే ఈరోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు.

గేదెలు చోరీ చేసిన నిందితుల అరెస్టు

ప్రజాపక్షం/నూతనకల్ : గేదెలను చోరీ చేసిన ఇద్దరు నింధితులను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ ఆర్. నాగరాజు దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలోని మిర్యాల గ్రామానికి చెందిన రైతు వెల్పుల అవిలయ్యకు చెందిన 2 గేదెలు వ్యవసాయ భూమి వద్ద కట్టివేయగా జూలై 31వ తేదీన చోరీకి గురయ్యాయి. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధర్యాప్తు చేసి నింధితులను గుర్తించామని చెప్పారు. మండలంలోని చిననెమిల ఎక్స్ రోడ్డు వాహనాలు తనిఖీ చేస్తుండగా టిజి 04 టి 4056 నంబర్ గల అశోక్ లే లాండ్ టాటా ఏసి వాహనంలో వెళ్తుండగా అనుమానం వచ్చి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ చేయగా ఖమ్మం జిల్లా కొనిజెర్ల మండల కేంద్రంలోని రామనర్సయ్య నగర్‌కు చెందిన గుగులోతు ప్రసాద్, బానోతు నాగులుగా గుర్తించి వారు గేదెల దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా బయటపడింది. మిర్యాల గ్రామంతోపాటు మద్దిరాల మండలం కుక్కడం, మహబూబ్‌బాద్ జిల్లా మర్రిపెడ బంగ్లా, ఖమ్మం జిల్లా తిరుమలాయిపాలెం గ్రామాల్లో రాత్రి సమయాల్లో పశువుల గొట్టాల దగ్గర కట్టివేసిన పశువులను దొంగలించి నల్లగొండ పశువుల సంతలో విక్రయించినట్లు ఒప్పుకున్నట్లు వివరించారు. వీరితోపాటు వాహనాన్ని, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపారు. సిబ్బంది నవీన్ రెడ్డి, హరి నాయక్, లక్ష్మి నారాయణ, హోంగార్డు పాల్గొన్నారు.

సాగర్‌కు వియత్నాం బౌద్ధ ముద్ర

బుద్ధవనంలో 45 అడుగుల అమితాబ బుద్ధ విగ్రహం

ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్‌లోని అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకున్న బుద్ధవనానికి మరో అరుదైన ఆకర్షణ జతకానుంది. వియత్నాం దేశపు బౌద్ధ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే సుమారు 45 అడుగుల అమితాబ బుద్ధ విగ్రహాన్ని బుద్ధవనంలో ఏర్పాటు చేసేందుకు ఆ దేశ ప్రతినిధులు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా శనివారం వియత్నాం ప్రతినిధులు,ఇంజనీర్లు బుద్ధవనంలో విగ్రహ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. గతంలో పలుమార్లు బుద్ధవనాన్ని సందర్శించిన వియత్నాం ప్రతినిధులు ఇక్కడ బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ఆసక్తిని ఇప్పటికే వ్యక్తం చేశారు. శనివారం బుద్ధవనంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్యతో కలిసి పాల్గొన్న అనంతరం వారు విగ్రహ ఏర్పాటుకు అనుకూలమైన స్థలాలను పరిశీలించారు.స్థల పరిశీలనలో వియత్నాం ప్రతినిధులు గుయేన్,తీ కిమ్ లాంగ్ గుయేన్, నహుట్ మిన్హ్ ట్రాన్, కొక్ ఫామ్,వాన్ హాయ్,గుయేన్ లే థాంహ్ తమ్,ఉంగ్ తన్ థే, ఫామ్ అన్హ్ డూయ్,గుయేన్ లే థాంహ్ గుయేన్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం వారు నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించారు. వారితో పాటు బుద్ధవనం డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ నజీష్, ఆర్ బీ డీఈ సతీష్, ఏఈ ప్రదీప్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ ఆఫీసర్ రవి చంద్ర, బుద్ధవనం ఆర్ట్స్ అండ్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్ రావు, టూరిజం గైడ్ సత్యనారాయణ ఉన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యార్థి యువజన వ్యతిరేక విధానాలపై పోరాటాలు

సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

ప్రజాపక్షం/మోత్కూర్ : సెప్టెంబర్ 8,9,10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) యువజన ప్రదర్శన బహిరంగ సభ, రాష్ట్ర 3వ మహా సభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం మోత్కూరు కేఆర్ భవన్‌లో శనివారం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి నయీమ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమైనదని యువతరంలో ప్రగతిశీల అభ్యుదయ భావాలను దేశభక్తిని లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలను నైతిక విలువలను పాదుకొల్పడానికి అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. పని హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని సమగ్ర యువజన విధానం కోసం విద్యా, వైద్య, వ్యాపారాన్ని అరికట్టాలని అవినీతికి వ్యతిరేకంగా యువత పోరాటం చేయాలన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై లాటి ఛార్జ్ ప్రజాస్వామ్యంపై దాడి అని ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి యువకులపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలన్నారు. యువత తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చు అని జంతర్ మంతర్ వద్ద విద్యార్థి యువత ఆందోళన నిరూపించిందన్నారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులు యువత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యార్థి యువజన వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలని, సెప్టెంబర్ 8, 9 10 తేదీలలో విద్యా వైద్యం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే యువజన ప్రదర్శన బహిరంగ సభను, రాష్ట్ర 3వ మహాసభలను జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి అన్నేపు వెంకట్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మొగుళ్ల శేఖర్ రెడ్డి, సుద్దాల సాయికుమార్, సహాయ కార్యదర్శులు బద్దుల శ్రీనివాస్, కోశాధికారి గొట్టిపాముల సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య వేడుకలు

ప్రజాపక్షం/నారాయణపేట్ : 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నారాయణపేట్ జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రియాంక జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల వందనాన్ని స్వీకరించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్వో రాజేశ్వరి, డిప్యూటీ కలెక్టర్ ఫణికుమార్, ఏవో అనిల్‌కుమార్ డీపీఆర్వో రషీద్‌తో పాటు కలెక్టరేట్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయం, జెడ్పీ కార్యాలయంలోనూ

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక తొలుత తన క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా సమాఖ్య సంఘ భవనానికి భూమి విరాళం

ప్రజాపక్షం/మక్తల్ : నారాయణపేట జిల్లా మక్తల్ మండలం జక్లేర్ గ్రామంలో మహిళా సమాఖ్య సంఘం భవనానికి ప్రభాకర్ రెడ్డి భూమిని విరాళంగా అందజేయడం అభినందనీయమని గ్రామ సర్పంచు అన్నారు. స్వతంత్ర దినోత్సవ సందర్భంగా శనివారం గ్రామపంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జెండా కార్యక్రమానికి హాజరై జెండా ఆవిష్కరణ గావించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా సమైక్య సంఘం బిల్డింగ్ కోసం ప్రభాకర్ రెడ్డి వారి సొంత స్థలాన్ని దానంగా ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా స్థలాన్ని విరాళంగా ఇచ్చిన దాతను ఘనంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు వార్డు మెంబర్లు వివిధ సంఘాల మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు, అధికారులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు ప్రశంసాపత్రం

ప్రజాపక్షం/వీపనగండ్ల : వీపనగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, గ్రామాల్లో పారిశుద్ధం, వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మండలి వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్, స్టాఫ్ నర్సింగ్ అధికారి హనుమంత్ నాయక్ లకు ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్‌కు ఉత్తమ వైద్యాధికారిగా ఉత్తమ స్టాఫ్ నర్సింగ్ అధికారిగా హనుమంత్ నాయక్‌లకు ప్రశంసా పత్రాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రజా రోగ్య పరిరక్షణ, పారిశుద్ధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఈ గుర్తింపు లభించింది. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి పాల్గొన్నారు. వీరిని వైద్య సిబ్బంది, ప్రజలు అభినందించారు.

వీపనగండ్ల పోలీస్ స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సి.రాజేందర్‌కు ఉత్తమ సేవలను గుర్తింపుగా ప్రశంసా పత్రం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ సునీతారెడ్డి చేతుల మీదుగా రాజేందర్ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. కోర్టు కానిస్టేబుల్‌గా అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, విధుల్లో నిబద్ధతతో పని చేస్తున్నందుకు ఆయన సేవలను అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా రాజేందర్‌ను పోలీసు అధికారులు, సిబ్బంది అభినందించారు.

కార్యాలయాల్లో వేడుకలు

ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్ల నియోజకవర్గంలోని వివిధ మండలాలలో నియోజకవర్గంలోని వివిధ మండలాలలో నియోజకవర్గ కేంద్రంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శనివారం నాడు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గల ఆయా కార్యాలయాలు సంబంధిత అధికారులు జెండాలను ఎగురవేసి మిఠాయిలు పంచుకొని స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించారు. జడ్చర్ల పట్టణంలోని ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొని జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమాలలో ఎంఈఓ, మంజుల అధ్యాపకులు, విద్యార్థులు ,పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి జిల్లా అభివృద్ధి బాట

శాసన మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ డా.పట్నం

ప్రజాపక్షం/వనపర్తి : ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ డా.పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వనపర్తి ఐడీఓసీ ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఎస్పీ సునీతారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన 138 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

చిరుధాన్యాలతో మిల్లెట్ భారత్

ప్రజాపక్షం/జడ్చర్ల : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్చర్లలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో వినూత్నంగా మిల్లెట్ భారత్ చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల లో ఈ సంవత్సరం కొత్తగా ఏర్పాటు చేసిన ఎఇడిపి కోర్సు అయిన హార్టికల్చర్ విభాగం విద్యార్థులు వివిధ రకాల చిరుధాన్యాలను ఉపయోగించి భారతదేశ పటాన్ని ఆకర్షణీయంగా రూపొందించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ మిల్లెట్ భారత్ విద్యార్థులు, కళాశాల సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో హార్టికల్చర్ విద్యార్థులు, పరిశోధక విద్యార్థుల కృషి అమోఘమని డా.సదాశివయ్య అభినందించారు. ఇలాంటి వినూత్న కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య, సిబ్బంది అభినందించారు.

పేదల గడపకే నాణ్యమైన సన్నబియ్యం

ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోలు స్మార్ట్ కార్డులతో రేషన్ పంపిణీలో పారదర్శకత : మంత్రి వాకిటి శ్రీహరి

ప్రజాపక్షం/నారాయణపేట్ : పేద, ఒడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, పేదలకు గౌరవప్రదంగా నాణ్యమైన సన్నబియ్యం అందించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడల, యువజన సర్వీసులు శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణపేట్ జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఫుడ్ సెక్యూరిటీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో రేషన్ బియ్యంపై ఉన్న చిన్నచూపును తొలగించి పేదలు సైతం గౌరవంగా నాణ్యమైన సన్నబియ్యం తినేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రియాంకతో కలిసి మంత్రి వాకిటి శ్రీహరి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీవో రమేష్, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్‌పర్సన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కాంత్‌కుమార్, ఆర్డీఏ మెంబర్ పోషల్ రాజేష్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బాల్‌రాజ్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ సైదులు, అన్ని మండలాల తహీల్దార్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, రేషన్ షాప్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సమష్టి కృషి

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ : జిల్లా అభివృద్ధికి అధికారులందరూ సమిష్టిగా కృషి చేయాలని, అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలను అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శనివారం ఐడిఓసి ఆవరణలో జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ముందుగా కలెక్టర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి గాంధీజీ, అంబేద్కర చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా అభివృద్ధిలో పాలు పంచుకుంటున్న వారందరికీ, ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసురావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో మంజుల, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగాపూర్ అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయంలో ఎగరని జాతీయ జెండా

ప్రజాపక్షం/శ్రీరంగాపూర్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్ ఎఈ కార్యాలయంలో తీవ్ర నిర్లక్ష్యం వెలుగుచూసింది. ఆగస్టు 15న దేశవ్యాప్తంగా కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలు జరుపుకుంటుంటే ఈ కార్యాలయంలో మాత్రం కనీసం జెండా ఎగరేసే ప్రయత్నం కూడా చేయకపోవడం గమనార్హం కార్యాలయం మూసి ఉండి, ఎటువంటి వేడుకలు నిర్వహించకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వ పదవుల్లో ఉంటూ, జాతీయ పండుగ రోజున ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నాం

నారాయణపేట జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

ప్రజాపక్షం/నారాయణపేట : తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే కాకుండా ప్రపంచస్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ముందుకు సాగుతోందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తెలిపారు. పేదల సంక్షేమం, సమగ్ర విధానాల రూపకల్పన, ప్రపంచ స్థాయి మౌలికవసతుల అభివృద్ధి, పారదర్శక సుపరిపాలనకు ఈ విజన్‌లో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జిల్లా కలెక్టర్ ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్వో రాజేశ్వరి, శిక్షణ కలెక్టర్ ఫణి కుమార్ తో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా పోలీసుల గౌరవవందనాన్ని మంత్రి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పంద్రాగస్టు వేడుకల సందర్భంగా నారాయణపేట, మక్తల్ గురుకుల, కస్తూర్బా పాఠశాలలకు చెందిన విద్యార్థినులు, దేశభక్తి గీతాలకు నృత్యాలు, చేశారు. అనంతరం మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్, గ్రీన్ ఎనర్జీ, ఇన్‌ప్రాస్ట్రక్చర్ అండ్ ఇండస్ట్రీయల్, టూరిజం పాలసీలను ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట మున్సిపల్ చైర్ పర్సన కొండా శ్వేతా సత్యయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, ఎంపీపీ శివారెడ్డి, ఆర్డీవో రమేష్, జిల్లా అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పురప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం, సామాజిక న్యాయంతోనే సమగ్ర అభివృద్ధి

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : సమానత్వం, సామాజిక న్యాయంతోనే సమగ్ర అభివృద్ధి అని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ సినిమా శేఖరయ్య సతీమణి అంబటి లీలావతిని శాలువాతో సత్కరించారు. విద్యార్థుల దేశభక్తి, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకోగా ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమలో ఎంపీ మల్లురవి, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్, ఎమ్మెల్యేలు, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వేడుకగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ...

నాగర్‌కర్నూల్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.జిల్లెల చిన్నారెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి ఘనంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డులు అర్హులైన కుటుంబాలకు అందిస్తున్నామని చిన్నారెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20 మండలాల్లో 2,77,455 కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చిన్నారెడ్డి అన్నారు. సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తూ పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు. జిల్లాలో 552 రేషన్ దుకాణాల ద్వారా 5,99,238 మంది లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ సరుకులు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, డా.వంశీకృష్ణ తెలిపారు. కార్యక్రమానికి ముందు 11 మందికి కారుణ్య నియామక పత్రాలను ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రేషన్ డీలర్లు, 20 మండలాల లబ్దిదారులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

విడివిడిగా తెగిపడ్డ శరీర భాగాలు

ప్రజాపక్షం/దామరగిద్ద : మండల పరిధిలోని గడిమున్కన్ పల్లి గ్రామంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. గడిమున్కన్ పల్లి గ్రామానికి చెందిన ఉషంతమ్మ అనే మహిళ శనివారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఊరి చివర ఉన్న ముఖ్య రహదారి వద్దకు వెళ్లింది. ఆ సమయంలో రోడ్డుపై వేగంగా వచ్చిన లారీ ఆమెను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఉషంతమ్మ అక్కడికక్కడే మృతి చెందట్టంతో పాటు శరీర భాగాలు తెగి పడ్డాయి ఉదయాన్నే మృత దేహాన్ని గమనించిన స్థానికుల వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఘటన స్థలానికి చేరుకుని రోదనలు ప్రారంభించారు. నిత్యం కళ్ల ముందే తిరిగే ఉషంతమ్మ ఒకేసారిగా లేదనడంతో కుటుంబ సభ్యులు గుండెకోతకు గురయ్యారు. ఇదిలా ఉండగా, ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ వాహనంతో పరారైనట్లు తెలిసింది. అదే గ్రామానికి చెందిన నారాయణపేటలో 102 అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మహబూబ్ పాషా ఘటన గురించి తెలుసుకుని వెంటనే స్పందించారు. తెల్లవారుజామున నారాయణపేట్‌లోని సిమెంట్ దుకాణాల వద్దకు వచ్చిన లారీలను పరిశీలించిన ఆయన, ఒక లారీపై రక్తపు మరకలు, మాంసపు ఆనవాళ్లు గుర్తించారు. అనుమానం వచ్చిన మహబూబ్ పాషా వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పాటు ఆయన సమయస్ఫూర్తి అప్రమత్తతతో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించడం సాధ్యమైందని స్థానికులు ప్రశంసించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలి వివరాలు, ప్రమాదానికి గల కారణాలు, లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వంటి అంశాలపై విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సంపద ఫలాలు అందరికీ అందినపుడే నిజమైన స్వాతంత్ర్యం

సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు

ప్రజాపక్షం/గద్వాల రూరల్ : సంపద ఫలాలు అందరికీ అందినపుడే నిజమైన స్వాతంత్ర్యం అని సిపిఐ జోగులాంబ గద్వాల జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు తెలిపారు. నల్లకుంట హమాలీ కార్మిక సంఘం ఏఐటియూసీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు నగర్ దొడ్డి వెంకట్రాములు, జేఏసీ చైర్మన్ న్యాయవాది మధుసూదన్ బాబుతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి.ఆంజనేయులు, మధుసూదన్ బాబు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు మాట్లాడుతూ బ్రిటీష్ పరాయి పాలన అంతమైనప్పటికీ దేశంలో దోపిడీ వ్యవస్థ ఇంకా కొనసాగుతోందని అన్నారు. అంబేద్కర్ చౌరస్తాలో బండ్ల కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించారు. అలాగే పాత బస్టాండు బాల భవన్ మెయిన్ రోడ్డు దగ్గర ట్రాన్స్‌పోర్ట్ హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆంజనేయులు ఎగరవేసి 80వ స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షులు నారాయణ, రాజు, వెంకటేశు, రవి, బండ్ల కార్మిక సంఘం అధ్యక్షులు దవులు, ట్రాన్స్‌పోర్ట్ అమాలి సంఘం అధ్యక్షులు ముస్తాను, వెంకటరాములు, ఆటో కార్మికులు వెంకటేష్, ప్రకాష్ శాంతన్న, తదితర కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేడుకలు

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ : గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలని పురస్కరించుకుని శనివారం గద్వాల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి , వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

త్యాగమూర్తుల పుణ్యఫలమే స్వాతంత్ర్యం

ప్రజాపక్షం/మక్తల్ : ఎందరో మహానుభావులు త్యాగధనుల పోరాటాలు ఆత్మత్యాగాల ఫలితంగానే 1947 ఆగస్టు 15న భారతదేశం బ్రిటిష్ పాలన నుంచి విముక్తమై స్వతంత్ర దేశంగా అవతరించిందని వారి నిస్వార్థ సేవల వల్లనే మనం నేడు స్వచ్ఛవాయులు పీల్చుకుంటున్నామని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మక్తల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కమిషనర్ రాజయ్య, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జి.రాధాలక్ష్మారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/కల్వకుర్తి : కల్వకుర్తి పట్టణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ షేక్, ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా.శివరాం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కురుమూర్తి, ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ వెంకట్‌రెడ్డి తాహసీల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్ ఇబ్రహీం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో జనార్దన్ రెడ్డి, మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ చంద్రకళ, పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు పాఠశాలల్లోనూ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఆయా గ్రామపంచాయితీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి జ్ఞానాన్ని అందించే నిధి లాంటివి పాఠశాలలు అని విద్యతోనే దేశం అభివృద్ధి చెందుతుందని విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.మల్లయ్య అన్నారు. మండలంలోని చంద్రబండ తాండా ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రధాన ఉపాధ్యాయులు మల్లయ్య ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ యువకులు కుర్చీలను, ప్రభుత్వ పాఠశాలలకు బహుకరించారు. గ్రామ యువకులను ప్రధాన ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచు చిట్టి నాయక్, డిప్యూటీ సర్పంచు శంకర్ నాయక్ అభినందించారు. ఈ కార్యక్రమంలో యం.బాలునాయక్, వేణుగోపాల్, తారు నాయక్, రామ్‌లాల్ నాయక్, లక్ష్మణ్ నాయక్, గేమ్యా నాయక్, తిరుపతయ్య, హనుమంతు నాయక్, సోమ్లా నాయక్, భాస్కర్ నాయక్, నరేష్, రామశిలా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/పానుగల్ : పానుగల్ మండల పరిధిలోని గోప్లాపూర్, కిస్టాపూర్ గ్రామాలలో పాఠశాలల విద్యార్థులకు ప్రముఖ పారిశ్రామికవేత్త కిషన్ రావు విద్యార్థులకు బూట్లను వితరణ చేశారు. గోప్లాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు 30 వేల విలువగల బూట్లను అలాగే కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 20వేల విలువ గల బూట్లను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు రాజు గౌడ్, కిషోర్ నాయక్, హెచ్ ఎమ్ శ్రీనివాసులు, దంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లారావు, శ్రీనివాస్ రావు, ఎస్ఎమ్‌సి చైర్మన్ బాలకృష్ణ, విండో డైరెక్టర్ సాయి ప్రసాద్ గౌడ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/శ్రీరంగాపూర్ : 80 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పీఎం శ్రీరంగాపురం ప్రాథమిక పాఠశాలలో స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని తాసిల్దార్, పోలీస్ స్టేషన్, ఎంపిడిఓ కార్యాలయంలో గ్రామపంచాయతీ వివిధ పాఠశాలల్లో ఆయా గ్రామాలలో పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఆయా గ్రామాల సర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాపక్షం/అమరచింత : అమరచింత మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థి యువజన, పలు రాజకీయ పార్టీల నాయకులు ఘనంగా జరుపుకున్నారు. తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ రవికుమార్, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో చైర్ పర్సన్ జింక సువర్ణ రవికుమార్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని ఎంపీటీవో శ్రీనివాసులు, మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ జింక సువర్ణ రవికుమార్ యాదవ్, మండల వ్యవసాయ కార్యాలయంలో ఏఈఓ అరవింద్, పోలీస్ స్టేషన్లో, ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రైవేట్ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జాతీయ జెండాలను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో అధికారి, ప్రతిపక్ష పార్టీ నాయకులు, విద్యార్థులు యువజనులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు.

ప్రజాపక్షం/అయిజ : అయిజ చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత సహకార సంఘం అధ్యక్షులు డాన్ వీరన్న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ గీతాన్ని ఆలపించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పసలాది బసవరాజు, ఉపాధ్యక్షుడు షర్ఫుద్దీన కోశాధికారి కసా వెంకటేశ్, డైరెక్టర్లు రాజశేఖర్, కొండ, అబ్దుల్ రియాజ్, శైలజ, మద్రాస్ లక్ష్మి , చేనేత కళాకారులు, ఇస్మాయిల్, అజీజ్, సంఘ సభ్యులుపాల్గొన్నారు.

ప్రజాపక్షం/కొత్తకోట : కొత్తకోట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం నిర్మల దేవి మేడం ఆధ్వర్యంలో విద్యార్థులు ఇండిపెండెంట్ డే సందర్భంగా అద్భుత విన్యాసాలు చేయడం జరిగింది. విద్యార్థులు గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థినిలు శిక్షణ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు అద్భుత విన్యాసాలు చేసి అందర్నీ అబ్బురపరచారు. కరాటే కోచ్ అబ్దుల్ నబీ ని హెచ్ఎం నిర్మల దేవి, పిఈటీ ఉపాధ్యాయులందరూ విద్యార్థులు చేసి విన్యాసాలు తిలకించి విద్యార్థులను అభినందిస్తూ శిక్షణ ఇచ్చినటువంటి మాస్టర్‌ని కూడా అభినందించారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి

నందమూరి జానకిరామ్ ట్రస్ట్ చైర్మన్ నందమూరి దీపిక జానకిరామ్

ప్రజాపక్షం/శంకర్‌పల్లి: పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని నందమూరి జానకిరామ్ ట్రస్ట్ చైర్మన్ నందమూరి దీపిక జానకిరామ్ అన్నారు. శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శంకర్ పల్లి పట్టణ కేంద్రంలోని అయ్యప్ప రెడ్డి గూడా ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించారు. అయ్యప్ప రెడ్డి కూడా కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్‌లను, పండ్లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతాని కోసం తన వంతు సహాయ సహకారాలు నిరంతరం అందిస్తామని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే స్టేషనరీ, బ్యాగులు, నోటు పుస్తకాలు, పాఠశాలకు అవసరమయ్యే సామాగ్రిని త్వరలోనే అందించడం జరుగుతుందని తెలిపారు. కాగా చిన్నారులతో కలిసి స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా గర్వంగా ఉందని తెలిపారు . విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ స్ఫూర్తి, బాధ్యత భావాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సదాలక్ష్మి, సుల్తానా, ఉపాధ్యాయులు ఎండి తహర్ అలీ,హర్షియ,సునీత తదితరులు పాల్గొన్నారు.

పట్నం ఎసిపి, సిఐలకు ఉత్తమ సేవా అవార్డు

ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం : ఫ్యూచర్ సిటీ కమీషనర్ రేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం ఎసిపి రాజు, సిఐ మహేందర్ రెడ్డిలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం సమీపంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి,జిల్లా కలెక్టర్‌లు ఉత్తమ సేవా పురస్కార అవార్డు, ప్రసాంశ పత్రాలు అందచేశారు.ఈ సందర్భంగా ఏసిపి రాజు మాట్లాడుతూ 80వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ప్రభుత్వం అందచేసిన ఉత్తమ సేవా పురష్కార అవార్డులు,ప్రసాంశ పత్రాలు అందచేయటంతో బాధ్యత పెరిగింది కావున రానున్న కాలంలో ప్రజలతో మమేకమై శాంతి భద్రత చర్యలు కాపడటంతో పాటు అనేక కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో పట్టి పీడుస్తున్నా గంజాయిపై ఉక్కు పాదం మోపి శాశ్వతంగా నిర్మూలిస్తామన్నారు.ఈ అవార్డు అందచేసిన ప్రభుత్వానికి,ఫ్యూచర్ సిటీ పోలీస్ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ జెండాను మరిచి.. ఆకుపచ్చ రంగు జెండాతో ర్యాలీ

ప్రజాపక్షం/తుర్కయంజాల్: జాతీయ జెండాను మరిచి ఆకుపచ్చ రంగు జెండాతో ర్యాలీ నిర్వహించడంపై ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ బిజెపి శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తుర్కయంజాల్‌లోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో జాతీయ జెండాకు బదులుగా పాఠశాలకు సంబంధించిన ఆకుపచ్చ రంగు జెండాను విద్యార్థుల చేత ర్యాలీగా తీసుకెళ్లడంపై రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, జిహెచ్ఎంసి 53, 56 డివిజన్ల బిజెపి అధ్యక్షులు ఎలిమినేటి నరసింహ రెడ్డి స్థానిక బిజెపి నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాసంస్థలు, వివిధ సంఘాలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, దేశ ప్రజలు జాతీయ జెండాను గౌరవంగా ప్రదర్శిస్తూ వేడుకలు నిర్వహిస్తుండగా, తుర్కయంజాల్ మైనార్టీ గురుకుల విద్యాసంస్థలో జాతీయ జెండాకు బదులుగా ఆకుపచ్చ రంగు జెండాతో ర్యాలీ నిర్వహించడం ఏంటని ఎలిమినేటి నరసింహ రెడ్డి మండిపడ్డారు. ఈ ఘటనపై పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఎలిమినేటి నరసింహ రెడ్డి ప్రశ్నించగా, అక్కడ కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న సంబంధిత రీజినల్ అధికారి వెంటనే పాఠశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వారితో చర్చించిన అనంతరం భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు బచ్చిగళ్ళ రమేష్, గుండ కృష్ణ , నందగిరి సురేష్, దాసు, నాగరాజు, జంగమయ్య, అజయ్, పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు?

దేశ, విదేశీ పెట్టుబడుల ఆకర్షణలో రంగారెడ్డి జిల్లా ముందంజ

- ఫ్యూచర్‌సిటీ,రేడియల్ రోడ్లతో మారనున్న రూపురేఖలు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ప్రజాపక్షం/రంగారెడ్డి: దేశంలోనే స్వాతంత్ర దినోత్సవంతో పాటు ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఏకైక జిల్లా రంగారెడ్డి మాత్రమే.ఈ జిల్లా ఏర్పడి నేటికి 49 ఏండ్లు పూర్తయింది.పరిశ్రమల ఖిల్లాగా గుర్తింపు పొందిన ఈ జిల్లా దేశ,విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో ముందు వరుసలో ఉంది.అంతే కాకుండా రూ. 11.29 లక్షల తలసరి ఆదాయంతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.అభివృద్ధి,ప్రభుత్వ సంక్షేమ పథకాల్లోనూ జిల్లా ముందుకు దూసుకుపోతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ,జిల్లా ఇంఛార్జీ మంత్రి,దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం కొంగర్ కలాన్‌లోని రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం సముదాయంలో 80వ స్వాతంత్ర దినోత్స వాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసు గౌరవవందనం స్వీకరించిన తర్వాత జిల్లా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని పట్టిపీడిస్తున్న అంతర్గతత శత్రువులైన పేదరికం,అసమానతలు,అస్పృశ్యత, నిరక్షరాశ్యత వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు నడుంబిగించాం.మనం సాధించుకున్న స్వాతంత్రానికి సంపూర్ణ అర్థాన్ని,సార్థకతను చేకూరుస్తూ,ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదులు వేసుకున్నాం.అమరుల త్యాగాల స్ఫూర్తితో రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో ముందుకు దూసుకుపోతోందని చెప్పారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండున్నరేళ్ల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను చేపట్టిందని,సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇస్తు,పరిశ్రమల ఖిల్లాగా, ఉపాధి,పర్యాటక గమ్యస్థానంగా పేరొందిన జిల్లా అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల అమలులో ముందు ఉండి,ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు.

రేడియల్ రోడ్లతో జిల్లా రూపురేఖలే మారబోతున్నాయి

హైదరాబాద్, సికింద్రాబాద్,సైబరాబాద్‌లకు ధీటుగా ఫ్యూచర్‌సిటీ రూపుదిద్దుకోబోతోంది. ఇది పూర్తిగా నెట్ జీరో సిటీగా అవతరించబోతోంది.రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా ఆకుతోటపల్లి వరకు 41 కిలోమీటర్ల 300 ఫీట్ల రేడియల్ రోడ్డు సహా, బుద్వేల్ నుంచి నాచారం వరకు 81 కిలోమీటర్ల దూరం నిర్మిస్తున్న మరో రేడియల్ రోడ్డుతో జిల్లా రూపురేఖలే పూర్తిగా మారబోతున్నాయి.

ఆకట్టుకున్న ఫైర్ ఫైటర్ రోబో'ప్రదర్శన

స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాళ్లు,శకటాల ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ముందు వరుసలో పరేడ్ చేస్తూ ముందుకు సాగుతుండగా, వారి వెనుకాలే శకటాలు వరుసగా దూసుకొచ్చాయి.అయితే అగ్నిమాపక శాఖ ప్రదర్శించిన ఫైర్ ఫైటర్ రోడో' వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.ఎల్‌నినో ముప్పు,ప్రత్యామ్నాయ పంటల ఆవిశ్యక తను వివరిస్తూ జిల్లా వ్యవ సాయశాఖ రూపొందించిన శకటం, హెఫపివి వాక్సిన్,ఇతర ఆరోగ్య పరీక్షలను వివరిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ప్రదర్శించిన శకటం,విద్యాశాఖ,గృహనిర్మాణ సంస్థ,గ్రామీణాభివృద్ధిశాఖల శకటాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి.అంతేకాదు ఆయా శాఖల ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి శ్రీధర్‌బాబు తిలకించారు.

కనువిందు చేసిన చిన్నారుల నృత్యాలు

సంఘటన ఒక యజ్ఞం...భరత మాత పాదాలకు మువ్వలం' అంటూ కందుకూరు కెజిబివి చిన్నారులు ప్రదర్శించిన నృత్యం సహా 'దిస్ ఈజ్ మై స్టోరీ..దిస్ ఈజ్ మై హార్ట్‌బీట్' అంటూ ఎవిఎన్ ఇంటర్నేషనల్ స్కూలు చిన్నారుల నృత్యం,టంగుటుయ్యాల్లో..టంగుటుయ్యాలో.. కొమ్మల పూలు కోసి ఇయ్యాలో..'అంటూ నేదునూరు టీఎస్ మోడల్ స్కూలు విద్యార్థునులు ప్రదర్శించిన బతుకమ్మ నృత్య ప్రదర్శన,మహేశ్వరం కెజిబివి విద్యార్థులు ప్రదర్శించిన బోనాలు ఆహ్వతులను తన్మయత్వంలో ముంచేశాయి. పాడుదామా స్వేచ్ఛాగీతం..ఎగరేద్దాం జాతీ పతాకం..'అంటూ ఆమనగల్ వివేకవర్ధిని విద్యార్థుల జాతీ గీతం,ప్రకృతిని ఆరా తీస్తూ.. బంజారాల సంృతి, సంప్రదాయాలను చాటి చెప్పుతు తుక్కుగూడ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన బంజారాల నృత్యం కనువిందు చేశాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి,ఎమ్మెల్సీ ఎవిఎన్‌రెడ్డి,జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి,అదనపు కలెక్టర్లు డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి,చంద్రారెడ్డి,డిఆర్ఒ శారదాదేవి,జిల్లా గ్రంధాలయా సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి,తది తరులు పాల్గొన్నారు.విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులకు ప్రశంసా పత్రాలను మంత్రి శ్రీధర్‌బాబు అందజేశారు.

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో స్వాతంత్ర్య వేడుకలు

ప్రజాపక్షం/రంగారెడ్డి: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ హాజరయ్యారు. ముందుగా సిపి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయ హే తెలంగా ఆలపించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సాధించి 80 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని సిపి అన్నారు. అనేక దేశాలు స్వాతంత్య్తం పొందినప్పటికీ రాజ్యాంగ వ్యవస్థ, ప్రజాస్వామ్య విలువలు, చట్టాల అమలులో సమస్యల కారణంగా స్థిరత్వాన్ని సాధించలేకపోయాయని, భారతదేశం మాత్రం బలమైన ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థతో 80 ఏళ్లుగా స్థిరంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఆర్థిక, భౌగోళిక, వాణిజ్య, సాంకేతిక మార్పులు, అంతర్జాతీయ సవాళ్లను భారత్ సమర్థంగా ఎదుర్కొంటూ స్వయం సమృద్ధి దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోందని సిపి తెలిపారు. హైదరాబాద్, తెలంగాణ శాస్త్ర, సాంకేతిక, ఫార్మా రంగాల్లో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయని సిపి తెలిపారు. హైదరాబాద్‌లో పరిశ్రమలు, ఐటీ సంస్థలు, ఇతర పెట్టుబడులు పెరగాలంటే శాంతిభద్రతలు కీలకమని, ఈ విషయంలో పోలీసుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని సిపి పేర్కొన్నారు. ప్రజా కేంద్రిత పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు, పరిశ్రమలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు సైబరాబాద్ పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. శాంతిభద్రతలను సమర్థంగా నిర్వహించడం ద్వారా హైదరాబాద్ అభివృద్ధికి, మరిన్ని పెట్టుబడులు రావడానికి పోలీసులు తమ వంతు సహకారం అందిస్తున్నారని చెప్పారు.

ఉత్తమసేవా పతకాలు

విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన నలుగురు పోలీసు సిబ్బందికి ఉత్తమ సేవా పతకాలు, మరో 15 మంది పోలీసు సిబ్బందికి సేవా పతకాలను సిపి అందజేశారు. పతకాలు అందుకున్న వారిని అభినందించి, ఇదే అంకిత భావంతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బంది కుటుంబాలకు చెందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. చిన్నారులతో ముచ్చటించి వారికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సిపి(ట్రాఫిక్) సన్ ప్రీత్ సింగ్,అడ్మిన్ డిసిపిలు టి.అన్నపూర్ణ, రితిరాజ్, ఎన్. కోటి రెడ్డి,సిహెచ్. శ్రీనివాస్, వై.వి.ఎస్.సుధీంద్ర, శోభన్ కుమార్, సంజీవ్ ఎడిసిపిలు, ఏసిపిలు,పోలీస్ ఉన్నతాధికారులు,సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యం వారసత్వ హక్కు మాత్రమే కాదు...

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి

ప్రజాపక్షం/రంగారెడ్డి: స్వాతంత్ర్యం అనేది కేవలం మనకు వారసత్వంగా లభించిన హక్కు మాత్రమే కాదని, ప్రతి తరం దానిని కాపాడి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత కూడా అని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. శనివారం ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని ప్రధాన కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి భావంతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, సీనియర్ పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది సమక్షంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపి డా.తరుణ్ జోషి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అనేది కేవలం మనకు వారసత్వంగా లభించిన హక్కు మాత్రమే కాదని, ప్రతి తరం దానిని కాపాడి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు భయరహితంగా జీవించే స్వేచ్ఛే స్వాతంత్ర్యానికి మొదటి, అత్యంత ప్రాథమిక వ్యక్తీకరణ అని తెలిపారు."ఫ్యూచర్ సిటీని ఆధునిక, సాంకేతికత ఆధారిత, సుస్థిరమైన, అనేక అవకాశాలతో కూడిన భవిష్యత్ నగరంగా నిర్మిస్తున్నారు. ఈ నగరానికి పోలీసింగ్ వ్యవస్థను మొదటి నుంచి నిర్మించే అవకాశం మనకు లభించింది.పాత విధానాలను అనుసరించాల్సిన అవసరం లేకుండా, కొత్త ఆలోచనలు, ఆధునిక విధానాలతో సమర్థవంతమైన పోలీసింగ్ వ్యవస్థను రూపొందించే అవకాశం మన ముందుంది,"అని తెలిపారు.

స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారీ

ప్రజాపక్షం/తుర్కయంజాల్ : బ్రిటిష్ పాలకుల ఆధిపత్యం నుండి భారత దేశ పౌరులకి స్వేచ్ఛ కోసం సాగిన స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో దేశంలో ప్రజాస్వామ్యం పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు పోరాటం చేయాలనీ భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ అన్నారు. 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన స్వాతంత్ర దినోత్సవనికి రవీంద్ర చారీ, యాదిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రశాంగించారు. భారత రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాల్సిన ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని ఖూని చేస్తూ సొంత ఎజెండాని అమలు చేసుకుంటున్నాయని అన్నారు. స్వాతంత్ర పోరాట అమరుల ఆశయాలను సాకారం కాలేదని వారి ఆశయ సాధన కొరకు పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, చిరా శేఖర్,కాటి అరుణ,వట్టి నవనీత,పేరాల గోపి, ఆవుల యాదగిరి,వినోద్ నాయక్, దూపం నిరంజన్, మంగలి మహేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

22-ఎ జాబితా పరిశీలనకు సెలవు రోజుల్లోనూ విధులు

రికార్డుల ఆధారంగా పారదర్శకమైన జాబితా రూపొందించేందుకు చర్యలు : నారాయణ రెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి: జిల్లాలో 22–ఎ నిషేధిత జాబితా పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులు, సిబ్బంది సాధారణ పని దినాల్లోనే కాకుండా సెలవు రోజుల్లో కూడా ప్రత్యేకంగా విధులు నిర్వహిస్తున్నారని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. 22–ఎ నిషేధిత జాబితాలోని సర్వే నంబర్లకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, నిషేధిత జాబితాలో పొరపాటుగా నమోదైన పట్టా సర్వే నంబర్లను గుర్తించి, నిబంధనల ప్రకారం తొలగించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన పాత రికార్డులు, ప్రభుత్వ రికార్డులు, రిజిస్టర్లు, అందుబాటులో ఉన్న ధ్రువపత్రాలను పరిశీలించి, రికార్డుల ప్రకారం పారదర్శకమైన స్పష్టమైన, వాస్తవ వివరాలతో కూడిన జాబితాను రూపొందించేలా అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆర్డీఓలు, తహసీల్దార్ల ఆధ్వర్యంలో సంబంధిత అధికారు లు, సిబ్బంది పని దినాలతో పాటు సెలవు రోజుల్లో కూడా పని చేస్తూ రికార్డుల పరిశీలన, క్రాస్ వెరిఫికేషన్, జాబితా తయారీ ప్రక్రియను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆదివారం (16.8.2026) సెలవు రోజున కూడా కలెక్టరేట్ లోని రెవెన్యూ విభాగానికి చెందిన అధికారులు,సిబ్బంది ప్రత్యేకంగా విధులకు హాజరై 22–ఎ జాబితాకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. రికార్డుల ఆధారంగా వాస్తవ పరిస్థితులను నిర్ధారించి, పారదర్శకమైన జాబితాను రూపొందించే ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. 22–ఎ జాబితాలో నిషేధిత భూములు మాత్రమే ఉండేలా, పొరపాటుగా నమోదైన పట్టా సర్వే నంబర్లు తొలగించబడేలా పూర్తి స్థాయిలో రికార్డుల పరిశీలన నిర్వహించాలని కలెక్టర్ అధికారుల ను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ప్రభుత్వ రికార్డులు, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకమైన, వాస్తవ వివరాలతో కూడిన జాబితాను సిద్ధం చేయాలని సూచించారు.

రెపరెపలాడిన మువన్నెల జెండా

ప్రజాపక్షం/షాబాద్: రెపరెపలాడిన మువెన్నల జాతీయ జెండా పండగను షాబాద్ మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా కార్యాలయంలో జాతీయ జెండా ఎగరవేసి భారతమాతకు వందనం చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సిఐ లక్ష్మీ రెడ్డి, తహశీల్దార్ కార్యాలయంలో అన్వర్, మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపిడిఒ అపర్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, ప్రై వేటు పాఠశాలు, పంచాయతీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు ఘనంగా జెండా పండగ జరుపుకున్నారు. అనంతరం షాబాద్ పోలీస్ స్టేషన్‌లో నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి షాబాద్ సిఐ రివార్డులు అందజేశారు.

అవార్డు రావడంతో బాధ్యత పెరిగింది !



షాబాద్ మండలంలో విధులు నిర్వహిస్తున్న తహశీల్దార్ అన్వర్‌కు, మండల వ్యవసాయ శాఖ అధికారి దండెం విజయచంద్రకు తెలంగాణ ప్రభుత్వం ఉత్త మ అధికారులుగా అవార్డును జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్ నారాయణ రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకున్నా రు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ఇవ్వడంతో మాకు మరింత బాధ్యత పెరిగిందని అధికారులు సంతోషం వ్య క్తం చేశారు. పని చేస్తున్న అధికారులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్‌బినగర్‌లో....



80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఎల్.బి నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో మాజీ కార్పొరేటర్లు,కొప్పుల విఠల్ రెడ్డి,సాగర్ రెడ్డి,సీనియర్ నాయకులు పట్నాల విశ్వేశ్వర్ రెడ్డి మహేష్ రెడ్డి, ఏర్పుల గాలయ్య కార్యకర్తలు,పార్టీ అభిమానులు, మహిళలు, విద్యార్థులు కాలనీవాసులచే కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేసి నియోజక ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మన్సూరాబాద్ : స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా టిపిసిసి అధికార ప్రతినిది జక్కిడి ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కల్సి జాతీయ పతాకాన్ని ఎగురవేసి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమములో కాంగ్రెస్ నాయకులు జక్కిడి సత్యతేజ్ రెడ్డి

,విట్టల్ రెడ్డి ,శ్యామల్ రెడ్డి,వెంకటస్వామి,జాకిర్, తదితరులు పాల్గొన్నారు .

సిపిఐ రాజేంద్రనగర్ కార్యాలయంలో

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యాలయం ఏఆర్ దేవరాజ్ భవన్ దగ్గర సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి,కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాలు నర్సింగరావు చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరించారు. దుర్గా నగర్ లో నిర్వహించిన కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి జె విజయ ఆనంద్ గౌడ్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఏ రియాజ్ ,జిల్లా కౌన్సిల్ సభ్యులు జే ఆనంద్ గౌడ్,మహిళా సమాఖ్య మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మి, మునేశ్వరి మండల సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో...

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకోని శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ప్రజా భవన్‌లో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథి హజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మండల పరిధిలో వినోభా నగర్‌లో ఫ్యూచర్ సిటీ కమీషనర్ రేట్ నూతన భవనంలో ఫ్యూచర్ సిటీ కమీషనర్ డాక్టర్ తరణ్ జోషీ, న్యాయ స్థానం పరిధిలో న్యాయమూర్తులు,తహసీల్దార్, ఎంపిడిఓ,పోలీస్ స్టేషన్,మున్సిపల్,గ్రామ పంచాయతీ, వివిధ రాజకీయ పార్టీ కార్యాలయలు,ప్రభుత్వ,ప్రయివేట్ విద్య సంస్థలు,ప్రజా సంఘాలు ఘనంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు.

యాచారంలో.....

యాచారం మండలంలో వివిధ గ్రామాల్లో మువ్వన్నేల జెండా రేపరేపలాడింది. యాచారం మండల పరిషత్ కార్యాలయంపై మండల ప్రత్యేకాధికారి మాధవరావు, తహశీల్దారు కార్యాలయంపై అయ్యప్ప. ఐకెపి కార్యాలయంపై ఎపిఎం రవిందర్, సహకారసంఘం కార్యాలయంపై చైర్మెన్ రాజేంధర్‌రెడ్డి, పోలీస్ స్టేసన్‌పై సిఐ నందిశ్వర్‌రెడ్డి, వ్యవసాయ కార్యాలయంపై ఎఒ రవినాథ్, ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలపై అయా శాఖలకు చేందిన జాతీయ జెండాను అవిష్కరించారు.ఈకార్యక్రమలో అయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతికార్యదర్శులు, సహకారసంఘం వైస్ చైర్మెన్ కారింగ్ యాదయ్య, డైరెక్టర్లు తదితరులు పాల్గోన్నారు.

శేలింగంపల్లి నియోజకవర్గంలో

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్, శేరిలింగంపల్లి, మియాపూర్, హఫిజ్‌పేట్, మాదాపూర్, గచ్చిబౌలి డివిజన్‌లలో 80వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాక అవిష్కరణ వేడుకలలో ప్రజా ప్రతినిధులు, నాయకలు విచ్చేసి జెండా ఏగురవేసి వందన స్వీకారం చేశారు. మాదాపూర్‌లోని ఇజ్జత్ నగర్‌లో 80వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను ఘనంగా పిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు రామకృష్ణ, శేరిలింగంపల్లి కార్యదర్శి చందుయాదవ్‌లు విచ్చేసి చెండా ఏగురవేసి వందన స్వీకారం చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చందుయాదవ్, కాసిం, వెంకటస్వామి, ,జెట్టి శ్రీనివాస్, కొండలయ్య, సుధాకర్, రామస్వామి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

నిస్సహాయతకు నిదర్శనం

మోదీ 'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యలపై విపక్షాలు మండిపాటు

మోదీ 'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యలపై విపక్షాలు మండిపాటు

న్యూఢిల్లీ : స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన 'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యపై ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోశాయి. ఆయన నిస్సహాయతకు నిదర్శనంగా అభివర్ణించాయి. అసమ్మతిని లక్ష్యంగా చేసుకోవడానికి ఆయన ముద్రలు వేస్తున్నారని ఆరోపించాయి. మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని పార్టీలకు ఆయన చేసిన విజ్ఞప్తిని, దానిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని కూడా తీవ్రంగా విమర్శించాయి. ప్రధాని మొదట తన ప్రత్యర్థులను 'అర్బన్ నక్సల్స్' అని విమర్శించారని, ఇప్పుడు వారిని 'దిమాగీ నక్సల్స్' అని పిలుస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. రాజకీయాల్లోనే అత్యున్నత స్థాయి దూషణలకు పాల్పడే వ్యక్తి మోదీ అని పేర్కొన్నారు. ప్రధాని మొత్తం రాజకీయ శాస్త్రంలోనే 'ప్రధాన నిందకుడు' కాబట్టి, ఆయనకు ఎంఎ డిగ్రీ ఉండటంలో ఆశ్చర్యం లేదు' అని రమేష్ ఎక్స్‌లో ఎద్దేవా చేశారు. తరువాత, కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, రెండు మూడు సంవత్సరాల క్రితం ప్రధానమంత్రి తన రాజకీయ ప్రత్యర్థులను 'అర్బన్ నక్సల్స్' అని పిలిచారన్నారు. అప్పుడు పార్లమెంటులో అర్బన్ నక్సల్స్ నిర్వచనంపై ఒక ప్రశ్న అడగ్గా, అర్బన్ నక్సల్స్‌కు నిర్వచనం లేదని, అలాంటిదేమీ లేదని హోం మంత్రి అన్నారు. మళ్లీ నేడు ప్రధానమంత్రి ఎర్రకోట నుంచి తన రాజకీయ ప్రత్యర్థులను 'దిమాగీ నక్సల్స్' అని పిలుస్తున్నారని, వాస్తవం ఏమిటంటే, ప్రధానమంత్రి అర్బన్ నక్సల్స్ లేవనెత్తిన డిమాండ్లను అంగీకరిస్తున్నారన్నారు. రెండు సంవత్సరాల క్రితం, కుల గణన డిమాండ్ అర్బన్ నక్సల్స్ ఆలోచన అని ఆయన అన్నారని, ఒక సంవత్సరం తరువాత, మోదీ ప్రభుత్వం కుల గణనను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. '12 ఏళ్ల తర్వాత ప్రధానమంత్రి రాజకీయ ప్రసంగంలో కొత్తదనం ఏమీ లేదు, మొదటి నుండి చేస్తున్న అవే వాదనలు ఇందులోనూ ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రశ్నించే వారిపై కళంకం వేయడానికే... : డి.రాజా

స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా మోదీ అసమ్మతివాదులను లక్ష్యంగా చేసుకుంటున్నారని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కళంకం వేయడానికి 'దిమాగీ నక్సల్' అనే పదాన్ని మరో మార్గంగా ఆయన అభివర్ణించారు. 'భారత ప్రజలు తనను, తన ప్రభుత్వాన్ని ఏమి కోరుకుంటున్నారో తెలుసుకోకుండా స్వాతంత్ర్య దినోత్సవం వంటి పవిత్రమైన జాతీయ సందర్భంలో కూడా అసమ్మతివాదులను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రధాని మోదీ సమయాన్ని, అవకాశాన్ని వెతుక్కుంటున్నారు' అని రాజా దుయ్యబట్టారు. అతివాదులు పదేపదే ప్రచారం చేస్తున్న 'దేశద్రోహులు', 'తుక్డేతుక్డే గ్యాంగ్' వంటి నిరాధారమైన ముద్రలకు, మోదీ ఇప్పుడు 'దిమాగీ నక్సల్' అనే మరో అసంబద్ధమైన ముద్రను వేశారు. ఇది అసమ్మతిని అప్రతిష్టపాలు చేయడానికి, ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిని భయపెట్టడానికి చేస్తున్న ప్రయత్నం తప్ప మరేమీ కాదు' అని ఆయన అన్నారు. విద్య, ఉపాధికి సంబంధించి విద్యార్థులు, యువత లేవనెత్తిన ఆందోళనలను పరిష్కరించాలని రాజా ప్రధానమంత్రిని కోరారు. 'భారత యువత, విద్యార్థులు విద్యా, ఉపాధి సంస్కరణల కోసం వీధుల్లోకి వచ్చారు. మీరు వారి ప్రశ్నలకు సమాధానం ఇచ్చారా? దాదాపు లక్ష ప్రభుత్వ పాఠశాలలను ఎందుకు మూసివేశారు? ప్రభుత్వ విద్య ఇంత దారుణంగా దిగజారడానికి ఎందుకు అనుమతించారు? లక్షలాది మంది యువత సురక్షితమైన ఉపాధి కోసం ఎందుకు పోరాడుతున్నారు?' అని ఆయన ప్రశ్నించారు. అదే విధంగా అన్ని పార్టీలు ఈ చట్టానికి మద్దతు ఇస్తున్నప్పుడు, మహిళా కోటాను ఆలస్యం చేయడానికి ప్రభుత్వానికి ఎలాంటి సమర్థన లేదని సిపిఐ రాజ్యసభ ఎంపి పి. సంతోష్ కుమార్ స్పష్టం చేశారు. 'అన్ని పార్టీలు ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాయి, అలాంటప్పుడు మహిళలకు రిజర్వేషన్ అమలు చేయకుండా ప్రధానమంత్రిని, ఆయన సహచరులను ఏది అడ్డుకుంటోంది? దీనికి సమాధానం చాలా సులభం. మా వైఖరి చాలా స్పష్టం: 543 సీట్లలో, ఎలాంటి జాప్యం లేకుండా 181 సీట్లను మహిళలకు రిజర్వ్ చేయాలి' అని కుమార్ అన్నారు. బిజెపి ఉద్దేశపూర్వకంగా మహిళా రిజర్వేషన్‌ను డీలిమిటేషన్‌తో ముడిపెట్టిందని, ఆ ప్రక్రియ కోసం వేచి చూడకుండా కోటాను స్వతంత్రంగా అమలు చేయాలని ఆయన ఆరోపించారు. వీరికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఇది కేవలం మాటలు కాకపోతే, వీలైనంత త్వరగా మహిళలకు మూడో వంతు రిజర్వేషన్‌ను అమలు చేయాలని సందోష్ కుమార్ డిమాండ్ చేశారు.

ఎప్పుడూ ప్రతిపక్షాలను నిందించే యోచనే : ఎం.ఎ. బేబీ

తమ పార్టీ నక్సలిజాన్ని వ్యతిరేకిస్తున్నప్పటికీ, మావోయిస్టుల విషయంలో ప్రభుత్వం చట్టాన్ని, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోందని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ ఆరోపించారు. 'నక్సల్ మనస్తత్వం' ఉన్న వ్యక్తుల గురించి ప్రధానమంత్రి ప్రస్తావించడం ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకునే ప్రయత్నమని ఆయన అభివర్ణించారు. 'నక్సలిజం అనేది ఒక రాజకీయ దృక్పథం, విధానం. దానితో మేమందరం పూర్తిగా విభేదిస్తాము. మావోయిస్టులు లేదా నక్సల్స్ అనుసరించే పద్ధతిని సమర్థించము. వారు ఆయుధాలు చేపడతారు కానీ సాధారణ ప్రజాస్వామ్య రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనరు' బేబీ పిటిఐ వీడియోస్‌తో అన్నారు. పట్టణ నక్సల్స్ ఉన్నారని మోదీ వాదిస్తున్నారు; కానీ ఇప్పుడు 'నక్సల్ మనస్తత్వం ఉన్నవాళ్లు' అని అంటున్నారు... వారు ఎప్పుడూ ప్రతిపక్షంలోని వారిని దేశద్రోహులుగా, పాకిస్థాన్‌కు వెళ్ళిపోయే వారిగా నిందించాలని చూస్తుంటారు. వారి మనసులో మావోయిస్టులు ఉన్నారనేది చాలా సౌకర్యవంతమైన ఆరోపణ. ఇది ఒక దారుణమైన ఆరోపణ' అని ఆయన అన్నారు. అరెస్ట్ అయిన మావోయిస్టుల విషయంలో మోదీ ప్రభుత్వం రాష్ట్ర ఉగ్రవాదానికి పాల్పడుతోందని బేబీ ఆరోపించారు. కొందరిపై చట్టపరమైన విచారణ జరపకుండా, కస్టడీలో ఉండగానే కాల్చి చంపారని ఆయన ఆరోపించారు.

చౌకబారు విమర్శలు చేయడం సిగ్గుచేటు : టిఎంసి. సాకేత్ గోఖలే

టిఎంసి నాయకుడు, మాజీ రాజ్యసభ ఎంపి సాకేత్ గోఖలే కూడా మోదీ వ్యాఖ్యలపై మండిపడ్డారు. తన విమర్శకులను లక్ష్యంగా చేసుకోవడానికి ఆయన స్వాతంత్ర్య దినోత్సవ వేదికను వాడుకుంటున్నారని ఆరోపించారు. 'స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మోదీ తన ప్రత్యర్థులను 'దిమాగీ నక్సల్స్' అని పిలుస్తూ చౌకబారు విమర్శలు చేయడం సిగ్గుచేటు' అని గోఖలే ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. 'యువతపై హింస, పెల్లెట్ గన్‌లు ప్రయోగించినందుకు క్షమాపణ చెప్పడానికి బదులుగా, మోదీ తన మామూలు అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారు. అహంకారాన్ని వదిలేయండి, ప్రధాని గారూ. అది ఏమాత్రం సహాయపడటం లేదు' అని ఆయన అన్నారు. వరుస స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాలలో ధరలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణాన్ని ఉదహరిస్తూ మోదీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని టిఎంసి లోక్‌సభ ఎంపి కీర్తి ఆజాద్ విమర్శించారు.

తొలిసారి 6 చరణాలతో వందేమాతరం గీతాలాపన ఘట్టం ఆవిష్కృతం

న్యూఢిల్లీ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల చరిత్రలోనే తొలిసారిగా ఎర్రకోట ప్రాంగణంలో ఆరు చరణాలతో వందేమాతర గీతాన్ని ఆలపించిన అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. శనివారం 79వ వార్షికోత్సవంలో ఈ చరిత్రాత్మక సందర్భం చోటుచేసుకుంది. అనంతరం ఆ మహోత్సవంలో జాతీయ గీతాన్ని కూడా పఠించారు. 'వందేమాతరం' జాతీయ గీతం 150సంవత్సరాల శాశ్వత వారసత్వానికి గుర్తుగా ఈ భారీ కార్యక్రమం జరిగింది. కోట గోడలపై పూల అలంకరణ మధ్యలో జాతీయ జెండా, దానికి ఇరువైపులా హిందీలో 'వందేమాతరం' గీతాన్ని పొందుపరిచారు. ప్రధానమంత్రి ఎర్రకోట ప్రాకారాలపైకి వచ్చిన వెంటనే, అక్కడకు వచ్చిన వారు జాతీయ గీతాన్ని ఆలపిస్తుండగా, ఆర్మీ బ్యాండ్ 'వందేమాతరం' రాగాన్ని వాయించింది. అనంతరం ప్రధానమంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆపై జాతీయగీతాన్ని ఆలపించారు. అతిథుల కోసం జారీచేసిన కార్యక్రమం బుక్‌లెట్లలో కార్యక్రమ వివరాలతోపాటు వందేమాతరం పూర్తి ఆరుచరణాలు ప్రచురితమయ్యాయి. జెండా ఆవిష్కరణ తర్వాత, ఆ త్రివర్ణపతాకానికి రాష్ట్రీయ సెల్యూట్ (జాతీయ వందనం) సమర్పించారు. అనంతరం, భారత వైమానిక దళానికి చెందిన రెండు ఎంఐ–హెలికాప్టర్లు ఆ ప్రాంగణంపై పూల రేకులను కురిపించాయి. వాటిలో ఒకటి జాతీయ జెండాను ప్రదర్శిస్తుండగా, మరొకటి 'వందేమాతరం' అని రాసి ఉన్న జెండాను మోసుకొచ్చింది. 1875లో బంకించంద్ర ఛటర్జీ రచించిన వందే మాతరం స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ఒక ఐక్యతా నినాదంగా మారింది. దీనిని 1950లో రాజ్యాంగ పరిషత్ భారతదేశ జాతీయగీతంగా స్వీకరించింది. వందేమాతరం 150ఏళ్ల ఉత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం గత నవంబరులో ఏడాది పొడవునా జరిగే వేడుకలను ప్రారంభించింది.

'విండ్‌ఫాల్‌గెయిన్ ట్యాక్స్' తగ్గింపు

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్, ఎటిఎఫ్ ఎగుమతులపై విధిస్తున్న విండ్‌ఫాల్ గెయిన్ ట్యాక్స్‌ను కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. ఆగస్టు 14 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త రేట్ల ప్రకారం డీజిల్‌పై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం లీటరుకు రూ.25.50 నుంచి రూ.24కు, ఎటిఎఫ్‌పై రూ.22 నుంచి రూ.19.50కి తగ్గింది. పెట్రోల్ ఎగుమతులపై సుంకాన్ని పూర్తిగా ఎత్తివేసింది. గతంలో లీటరుకు రూ.3.50 సుంకం ఉండేది. దేశీయ మార్కెట్‌కు విక్రయించే పెట్రోల్, డీజిల్‌పై సుంకాల్లో ఎలాంటి మార్పు లేదు. యుద్ధ పరిస్థితుల్లో దేశీయంగా ఇంధన లభ్యతను పెంచేందుకు, అంతర్జాతీయ ధరల వ్యత్యాసాన్ని ఉపయోగించుకుని అధిక లాభాలు పొందే ఎగుమతులను నిరుత్సాహపరిచేందుకు ప్రభుత్వం ఈ పన్నును విధించింది.

దేశ భవిష్యత్తు బాధ్యతలు స్వీకరించేందుకు..

యువ న్యాయ పట్టభద్రులు, న్యాయవాదులు సిద్ధంగా ఉండాలి

- సిజెఐ సూర్యకాంత్ పిలుపు

న్యూఢిల్లీ : గత ఎనిమిది దశాబ్దాలలో దేశం అనేక కఠినమైన సవాళ్లను అధిగమించిందని, అయితే, ఇంకా చేయాల్సింది చాలా ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ అన్నారు. భవిష్యత్తు బాధ్యతలను స్వీకరించడానికి యువ న్యాయ పట్టభద్రులు, న్యాయవాదులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇక్కడి సుప్రీంకోర్టు ప్రాంగణంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి సిజెఐ సూర్యకాంత్ ముఖ్యఅతిథిగాహాజరయ్యారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పతాక ఆవిష్కరణ అనంతరం ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ మాట్లాడుతూ దేశ ప్రస్థానం, అది సాధించిన విజయాలతో ముగిసిపోదని, మన ముందున్న ప్రయాణంలో ఇంకా ఎన్నో మైళ్లు ప్రయాణించాల్సి ఉందన్నారు. పలువురు సీనియర్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆయన యువ న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాట రోజుల నుంచి బార్ అసోసియేషన్ మోస్తున్న బాధ్యత ఇక యువ న్యాయ పట్టభద్రులు, యువ న్యాయవాదుల భుజస్కంధాలపై త్వరలోనే పడనుందన్నారు.ముందుతరాలవారు నిర్మించి, బలోపేతం చేసిన న్యాయ సంస్థలను ఇప్పుడు మీరే రక్షించి,ముందుకు తీసుకెళ్లాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. న్యాయమూర్తులు,న్యాయవాదులు మీ ఎదుగుదలకు కట్టుబడి ఉన్నారనే విషయాన్ని దయచేసి తెలుసుకోవాలన్నారు.'మార్గదర్శకత్వం అందించడం ద్వారా, అర్థవంతమైన అవకాశాలను కల్పించడం ద్వారా, మీపై నమ్మకం ఉంచడం ద్వారా మేమంతా మీకు అండగా ఉంటాం' అని సిజెఐ ఉద్ఘాటించారు.అయితే, మిగిలిన దూరాన్ని మీరే నడవాలని, మేము మీతో కలిసి నడుస్తామని ఆయన భరోసా ఇచ్చారు.స్వాతంత్ర్య పోరాటానికి చట్టంతో లోతైన, శాశ్వతమైన సంబంధం ఉందని, అది కొందరి దార్శనికత, కృషి వల్లే సాధ్యమైందని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ వివరించారు.ఆధునిక భారతదేశపు గొప్ప శిల్పులలో ఇద్దరైన మహాత్మాగాంధీ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్, అలాగే సర్దార్ వల్లభాయ్‌పటేల్, మోతీలాల్ నెహ్రూ, బాల గంగాధర్ తిలక్, లాలా లజపతి రాయ్ అందరూ న్యాయవాదులేనని, ఇది భారత స్వాతంత్ర్య పోరాటానికి న్యాయవాద వృత్తి కేవలం ప్రేక్షకపాత్ర కాదని, దానిలో అంతర్భాగమనే వాస్తవాన్ని చూపిస్తున్నదన్నారు. గడిచిన దశాబ్దాల కాలంలో భారతదేశం తీవ్రమైన సవాళ్లను అధిగమించి, ఎంతో సాధించిందన్నారు. అదే సమయంలో, గణతంత్రంతో పాటు, దాని చట్టపరమైన, న్యాయసంస్థలు కూడా గణనీయంగా ఎదిగి పరిణతి సాధించాయని, దేశ మనస్సాక్షిని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాయని సిజెఐ చెప్పారు. యువ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ఆయన మాట్లాడుతూ, ఈ వృత్తిలో నేడు పోటీ పెరిగిందని, నేర్చుకోవాల్సిన విషయాలు అధికమయ్యాయన్నారు. అయినప్పటికీ, 'మన యువ సహోద్యోగులలో నేను చూసిన అద్భుతమైన స్థైర్యం, పదునైన మేధస్సు, న్యాయం పట్ల నిజమైన నిబద్ధత ఈ వృత్తి భవిష్యత్తుపైన నాకు గొప్ప విశ్వాసాన్ని కలిగిస్తున్నాయి' అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్, పలువురు బార్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రసంగించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో

ఇబ్బందుల్లో పేద విద్యార్థులు

- ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి
- 'కాక్రోచ్ జనతా పార్టీ' కన్వీనర్ అభిజీత్ దీప్కే
- 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారం ప్రారంభం

హింగోలీ : ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) కన్వీనర్ అభిజీత్ దీప్కే ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. శనివారం హింగోలి జిల్లాలోని తన స్వగ్రామం నుండి 'స్కూల్ ఠీక్ కరో' (పాఠశాలలను బాగుచేయండి) ఉద్యమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రులలోని అధ్వాన్నమైన ఆరోగ్య సేవలపై కూడా సిజెపి ఇదే తరహా ఉద్యమాన్ని చేపట్టనుంది. దీప్కే తన స్వగ్రామమైన సంతుక్ పింప్రికి వెళ్లి, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి కనీస సౌకర్యాలను పరిశీలించగా, మరుగుదొడ్లకు నీటి సరఫరా లేదని ఆయన గుర్తించారు. 'భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వ పాఠశాలల్లో నీటి వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోతే దేశం ఎలా అభివృద్ధి చెందుతుంది?' అని దీప్కే విలేకరులతో అన్నారు. పాఠశాల కిటికీలు విరిగిపోవడం, విద్యార్థులకు సరిపడా బెంచీలు లేకపోవడం వంటి సమస్యలను ప్రస్తావిస్తూ, ఆ పాఠశాల దుస్థితిని ఆయన ఎత్తిచూపారు. 'పాఠశాలలో కనీస సౌకర్యాలు ఉన్నాయో లేదో నమోదు చేయడానికి వీలుగా ఒక చెక్‌లిస్ట్ ఫారమ్‌ను మేము రూపొందించాము. మహారాష్ట్ర, దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుండి మేము సమాచారాన్ని సేకరించి, ఆపై దానిని క్రోడీకరిస్తాము' అని ఆయన చెప్పారు. 'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమంలో భాగంగా తదుపరి దశలో, విద్యార్థులకు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించడానికి మహారాష్ట్రలోని ఇతర తాలూకాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తానని సిజెపి కన్వీనర్ తెలిపారు. విద్య కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించే బడ్జెట్‌ను తగ్గించారని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలలకు లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తున్నారని దీప్కే ఆరోపించారు.

గత పదేళ్లలో భారతదేశంలో 94,000కు పైగా ప్రభుత్వ పాఠశాలలు మూసివేయబడటం చూశామని, మరిన్ని పాఠశాలలను తెరవాల్సిన తరుణంలో, ఉన్నవాటిని మూసివేయడం ద్వారా దేశం ఎలా బలపడుతుంది? అని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై పరిమితి విధించాలని ఆయన డిమాండ్ చేశారు. 'ప్రజలు ఫీజుల రూపంలో రూ. 11.5 లక్షలు చెల్లిస్తున్నారు. పేద పిల్లలకు విద్య ఎలా అందుతుంది? అందుకే ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై పరిమితి విధించాలి అని దీప్కే అన్నారు.

జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదా, రాష్ట్ర హోదా పునరుద్ధరించాలి

ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఉద్ఘాటన

శ్రీనగర్ : భారతదేశంలో విలీనం కావడానికి 80 ఏళ్ల క్రితం నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం సరైనదే అని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. దేశ సమాఖ్య నిర్మాణాన్ని నిలబెట్టడానికి ఇది అత్యవసరం అని పేర్కొంటూ, ఈ ప్రాంతానికి ప్రత్యేక హోదా, రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. శనివారం శ్రీనగర్‌లోని బక్షి స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తూ, 2019లో ఆర్టికల్ 370 కింద జమ్ముకశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక హోదాను రద్దు చేయకపోయి ఉంటే, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె) ప్రజలు నేడు జమ్ము కశ్మీర్‌తో తిరిగి కలవాలని నిరసనలు చేస్తూ ఉండేవారని అబ్దుల్లా పేర్కొన్నారు. 1947లో సరిహద్దు దాటి వచ్చిన దురాక్రమణదారులను ఎదిరించిన నేషనల్ కాన్ఫరెన్స్ వ్యవస్థాపకుడు షేక్ మహమ్మద్ అబ్దుల్లాకు, స్థానిక వలంటీర్లకు నివాళులర్పిస్తూ, భారత సైన్యం రాకముందు ఈ భూభాగాన్ని కాపాడటానికి వేలాది మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని ముఖ్యమంత్రి అన్నారు. 'సరిహద్దు, నియంత్రణ రేఖకు ఆవలి వైపు పరిస్థితిని చూసినప్పుడు, 'హమ్లావార్ ఖబర్దార్, హమ్ కశ్మీరీ హై తయ్యార్' (దాడి చేసేవారికి జాగ్రత్త, కాశ్మీరీలు సిద్ధంగా ఉన్నారు) అని చెప్పిన మన పూర్వీకులు చెప్పింది నిజమేనని నాకు అర్థమవుతోంది. 80 ఏళ్ల క్రితం, మన నాయకులు మన కోసం తీసుకున్న (భారతదేశంలో చేరడంపై) నిర్ణయం సరైన నిర్ణయమని నాకు బోధపడుతోంది' అని పాకిస్థాన్ సైన్యం మద్దతుతో జరుగుతున్న గిరిజన దండయాత్రను ఆపే ప్రయత్నంలో ముజఫరాబాద్‌లో హత్యకు గురైన ఎన్‌సి నాయకుడు మాస్టర్ అబ్దుల్ అజీజ్‌ను గుర్తుచేసుకుంటూ అబ్దుల్లా అన్నారు. పిఒకె నివాసితుల ప్రస్తుత దుస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ, భారతదేశం వారిని తన సొంత ప్రజలుగానే పరిగణిస్తుందని అబ్దుల్లా పునరుద్ఘాటించారు. వారు ఎప్పటికైనా ఆ సీట్లను భర్తీ చేస్తారనే ఆశతో జమ్ముకశ్మీర్ శాసనసభలో పిఒకె ప్రతినిధుల కోసం సీట్లు రిజర్వ్ చేయబడి ఉన్నాయని ఆయన నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం దేశానికి రెండు గొప్ప స్తంభాలని ముఖ్యమంత్రి అభివర్ణించారు. 'మన దేశం రాష్ట్రాల సమాఖ్య. సమాఖ్యవాదాన్ని కాపాడి, బలోపేతం చేయాలంటే, మనం జమ్మూ కాశ్మీర్‌తోనే ప్రారంభించాలి. మన నుండి లాక్కున్నదంతా తిరిగి ఇవ్వాలి, అప్పుడే మన గుర్తింపు కేవలం మాటలకే పరిమితం కాకుండా, ఆచరణలోకి వస్తుంది' అని ఆయన అన్నారు. 'రాష్ట్రాల అధికారాలు బలహీనపడినప్పుడు, దాని పర్యవసానాలు వీధుల్లో కనిపిస్తాయి' అని ఢిల్లీ, జమ్ము కశ్మీర్‌లలో ఇటీవల జరిగిన ప్రజా అశాంతి, విద్యార్థుల నిరసనలను వ్యవస్థాగత అతిక్రమణకు ముడిపెడుతూ ఆయన అన్నారు.

రాంచీలో 22వ రోజు నిరసనలు

వేలాదిమంది ప్రదర్శకుల తిరంగా యాత్ర

దేవేంద్ర మహతాను అడ్డుకున్న పోలీసులు
సోషల్ మీడియాలో వీడియో వైరల్

రాంచీ: ఉద్యోగ నియామక ప్రభుత్వ పరీక్షల్లో సంస్కరణలు కోరుతూ జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసన ప్రదర్శనలు శనివారంనాటికి 22వ రోజుకు చేరాయి. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిరసన ప్రదర్శకులు వేలాదిమంది తిరంగా యాత్ర (త్రివర్ణ పతాక యాత్ర) నిర్వహించారు. రాంచీలోని జైపాల్‌సింగ్ ముండా స్టేడియం నుండి ఆల్బర్ట్ ఎక్కా చౌక్ వరకూ ఈ యాత్ర నిర్వహించారు.నియామకాలకోసం ప్రభుత్వం నిర్వహించే పరీక్షలలో ఇకమీదట ఎలాంటి అవకతవకలు జరగకుండా సంస్కరణలు తీసుకురావాలని ప్రదర్శకులు కోరుతున్నారు. ఐతే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రదర్శకులు భారత్ మాతాకీ జై...,వందేమాతరం అంటూ నినాదాలు చేశారు.

రాంచీలో గడచిన 14 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జార్ఖండ్ లోక్‌తాంత్రిక్ క్రాంతికారి మోర్చా నాయకుడు దేవేంద్ర మహతా మాట్లాడుతూ, సాదర్ ఆసుపత్రి నుండి బయటకు వచ్చి తిరంగా యాత్రలో పాల్గొనకుండా పోలీసులు తనను అడ్డుకున్నారని, యాత్రలో పాల్గొనేందుకు అనుమతించలేదని విమర్శించారు. ఆసుపత్రి నుండి బయటకు వచ్చేందుకు ఆయన ప్రయత్నం చేసిన సందర్భంగా పోలీసులతో జరిగిన తోపులాటకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. ఈ వీడియోలు చాలా ఎక్కువమంది తిలకించారు. జెపిఎస్‌సి–జెఎస్ఎస్‌సి సంస్కరణకు సంబంధించిన నిరసన ప్రదర్శకులు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ప్రభుత్వ పరీక్షలలో పూర్తి బాహాటత్వం ఉండాలని డిమాండ్ చేశారు. ఎక్కడా రహస్యాలు లేకుండా న్యాయబద్ధంగా పరీక్షలు,నియామకాలు జరిగేవిధంగా సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రద్దుచేసిన అనేక పరీక్షలపై సిబిఐ ద్వారా స్వతంత్ర విచారణ జరిపించాలని లేకపోతే పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి నాయకత్వంలో విచారణ జరిపించాలని కోరారు. ఐతే ఈ న్యాయమూర్తి కూడా జార్ఖండ్ రాష్ట్రానికి చెందినవారై ఉండకూడదని కూడా విద్యార్థులు డిమాండ్ చేశారు.

''స్వాతంత్ర్యం అంటే బ్రిటన్ వలసపాలకుల నుండి మాత్రమే విముక్తి పొందడంకాదు,సమాన అవకాశాలు అందరికీ లభించే స్వాతంత్ర్యం కూడా దేశ పౌరులకు లభించాలి, అవినీతి,అన్యాయాల నుండి కూడా దేశంలో ప్రజలకు విముక్తి లభించాలి, దేశంలో యువకులు అధ్యయనం చేయాల్సి ఉంది,పని చేయాల్సి ఉంది, వారు గొంతెత్తి ప్రశ్నించాల్సి ఉంది, వారి హక్కులకోసం వారు నినదిస్తారు,అదే ప్రజాస్వామ్యానికి నిజమైన బలం, అదే అసలైన స్వాతంత్ర్యం. దేశ భవిష్యత్తు కోసం పోరాటం చేస్తున్న ఈ యువకులందరికీ స్వాతంత్ర్య దినోత్సవనాడు వందనం చేస్తున్నాం,యువకుల స్వరం,నిలదీసి ప్రశ్నించే వారి సత్తా దేశ భవిష్యత్తు,జైహింద్'' అని జెపిఎస్‌సి–జెఎస్ఎస్‌సి సంస్కరణల పాదయాత్ర ప్రకటించింది. అంతకుముందు జార్ఖండ్ రాష్ట్రముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మాట్లాడుతూ, ఎంతో కష్టపడి ఉద్యోగాలకోసం ప్రయత్నం చేసే యువకులు,విద్యార్థులను పేపర్ లీకేజీల అవినీతిపరుల దయాదాక్షిణ్యాలకు ప్రభుత్వం వదిలివేయబోదని, వారికి న్యాయం జరుగుతుందని చెప్పారు.అవినీతి,అక్రమాలు,పేపర్ లీకేజీలకు దూరంగా విద్యార్థులు,యుతరానికి భారీ ఎత్తున ఉద్యోగావకాశాలు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. వివిధ ప్రభుత్వ ఎంపికల సంస్థల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగావకాశాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

జార్ఖండ్‌లో లక్షలమంది యువకులు రాత్రీపగలూ తమ కలలు సాకారం చేసుకోవడానికి ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని, వారి తల్లితండ్రులు ఎన్నో త్యాగాలు చేసి వారిని పెంచి పెద్దచేసి చదివిస్తున్నారని, అందువల్ల తల్లితండ్రుల కష్టానికి తగిన ఫలితాన్ని ప్రభుత్వం చూపిస్తుందని, విద్యార్థుల నైపుణ్యాలకు అనుగుణంగా అవకాశాలు లభిస్తాయన్నారు.

ఢిల్లీ హై అలర్ట్

25 వేలమంది మోహరింపు

- ఎర్రకోట చుట్టూ బహుళవలయ భద్రత
- వెయ్యి సిసి కెమెరాలతో నిఘా

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఢిల్లీలో హై అలర్ట్ పాటించారు. 25,000 మంది పోలీసులు,అర్థ సైనిక బలగాలను రాజధాని నగరమంతటా మోహరించారు. శాంతిభద్రతల పరిస్థితులు చేజారకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఎర్రకోట చుట్టూ బహుళ వలయాలతో కూడిన భద్రత ఏర్పాటు చేసినట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. 1000 సి.సి.కెమెరాలు,ఎ.ఐ ఆధారిత వీడియో విశ్లేషణలు ఎర్ర కోట చుట్టూ నిరంతరం పనిచేస్తున్నాయి. గత ఏడాది రాజధాని మెట్రోస్టేషన్ సమీపంలో బాంబు ఘటనను దృష్టిలో పెట్టుకుని విస్తారమైన ఏర్పాట్లు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(నార్త్) రాజా భాటియా పిటిఐ వార్తా సంస్థకు చెప్పారు. ప్రతి వ్యక్తినీ బహుముఖ వలయాలు తనిఖీలు చేశాయని, ఎర్రకోట ప్రవేశద్వారం వద్ద అత్యంత కఠినమైన నిబంధనలు అమలు చేశామని చెప్పారు. చిత్తశుద్ధి,అంకితభావంగల ఉగ్రవాద వ్యతిరేక సత్వర ప్రతిస్పందనా యంత్రాంగాన్ని నగరం అంతటా మోహరించామని,అనేక సున్నితమైన ప్రాంతాల వద్ద చాలా ఎక్కువ జాగ్రత్తలు పాటించామని చెప్పారు. నగరవ్యాప్తంగా 25,000 మంది కంటే ఎక్కువమంది బలగాలను మోహరించారు.ఏవైనా అవాంఛనీయమైన సంఘటనలు తలెత్తితే వెంటనే స్పందించేందుకు వీలుగా ముందస్తు అనుసంధానంతోపాటు సామూహిక విన్యాసాలు నిర్వహించడం ద్వారా అన్ని ఏజన్సీలు సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించే ఏర్పాట్లు చేశామన్నారు.ఎ.ఐ ద్వారా వాటంతటవే విశ్లేషణ చేసే కెమెరాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎర్రకోట లోపలా,వెలుపలా 1000 కు పైగా కెమెరాలు ఏర్పాటు చేశామని, వీటిని ఎ.ఐకి అనుసంధానం చేయడం ద్వారా స్వయం చలిత విశ్లేషణలు సమకూరుతాయన్నారు.ఈ గస్తీ వల్ల అనుమానాస్పద కదలికలను తక్షణం కనిపెట్టేందుకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. జనం గుంపులు గుంపులుగా ఉన్నప్పటి సమస్యలను ఇతర శాంతి భద్రతల పరిస్థితులను సత్వర ప్రతిస్పందన బృందాలు చూసుకున్నాయన్నారు. ఒకవేళ శాంతి భద్రతల పరిస్థితి తలెత్తితే, తక్షణం స్పందిస్తామని, సత్వర స్పందన బృందాలు వ్యూహాత్మక ప్రదేశాలలో అందుకోసం సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.ప్రజలు,వాహనాల కదలికలను భద్రతాసిబ్బంది కనిపెట్టుకుని ఉన్నారని,ఆహ్వానితులు,అక్కడికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూశామన్నారు. కీలక ప్రాంతాలలో గస్తీని ముమ్మరంగా కొనసాగిస్తున్నామని,బహిరంగ ప్రదేశాలు,మార్కెటులు,రవాణా కేంద్రాలు, ఇతర సున్నిత ప్రాంతాలలో గట్టి నిఘా అమలు చేసినట్లు చెప్పారు.

హోర్ముజ్‌ను అమెరికా భూభాగంగా ప్రకటిస్తాం

- సెంట్‌కామ్ దిగ్బంధనం ఉక్కుగోడ: వాళ్ళేం చేయలేరు
- ఇరాన్ ఓటమి కోసం పెట్రోలు ధర పెరగడం సబబే
- న్యూయార్క్ ర్యాలీలో ట్రంప్ ప్రకటన
- దుస్సాహసం చేస్తే నాశనం చేస్తాం: ఘోలమ్ హొస్సేన్



వాషింగ్టన్: ఇరాన్‌పై యుద్ధంలో గెలిచిన తర్వాత హోర్ముజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తామని ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం, న్యూయార్క్‌లోని ఒక పోలీస్ అకాడమీలో జరిగిన ర్యాలీలో ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్ ఘోరంగా ఓడిపోతోందని అన్నారు.''ఇరాన్‌ను ఓడించడం పూర్తి చేసిన తర్వాత నేను హోర్ముజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తాను, ఈ జలసంధి ఇప్పటికీ మన ఆధీనంలోనే ఉంది'' అని చెప్పారు. ఈ ప్రకటన చేస్తున్నప్పుడు ఆయన చిరునవ్వులు చిందించారు.''ఇరాన్ ఒక దుష్ట దేశం, ఆ దేశం దగ్గర అణ్వాయుధం ఉంది, దానిని లేకుండా చెయ్యాలి, ఇరాన్‌ను ఓడించడంకోసం మీరు పెట్రోలుకు కొంచెం ఎక్కువ ధర చెల్లించడం సబబే'' అన్నారు. అమెరికా అబ్రహం లింకన్ యుద్ధ విమాన వాహక నౌకలో సిబ్బంది నాలుగు నెలలుగా సముద్రంలోనే ఉండిపోయి అనారోగ్యానికి హోం సిక్‌కు గురయ్యారన్న విషయాన్ని ట్రంప్ కొట్టిపారేశారు. ఐతే ఆ తర్వాత పేరు చెప్పడానికి ఇష్టపడని వైట్‌హౌస్ ఉన్నతాధికారి ఒకరు హోర్ముజ్‌ను భూభాగంగా ప్రకటించడంపై మాట్లాడుతూ, ట్రంప్ పరిహాసం చేశారని వ్యాఖ్యానించారు. హోర్ముజ్ జలసంధి ఇంకా ఇప్పటికీ పూర్తిగా అమెరికా దళాల ఆధీనంలోనే ఉందని గడచిన బుధవారం ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా ప్రకటించారు. మా నావికా దిగ్బంధనాన్ని అందరూ ఉక్కుగోడ అని పిలుస్తారు, ఈ విషయంలో ఇరాన్ ఏమీ చేయలేదు'' అని న్యూయార్క్ ర్యాలీలో ట్రంప్ అన్నారు. ఇరాన్ యుద్ధం కారణంగా ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగి అమెరికాలో చమురు ధరలు పెరిగాయి. దీంతో ట్రంప్ రేటింగ్ క్షీణించింది. ప్రజలు 36 శాతం మంది కూడా ట్రంప్‌ను విశ్వసించడంలేదు. ఇదిలా ఉండగా, అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ స్పందిస్తూ, ఇప్పుడు అమెరికా ప్రధాన లక్ష్యం చమురు ధరలు తగ్గించడం, ఇరాన్ దగ్గర అణ్వాయుధం లేకుండా చేయడమేనని అన్నారు. ఇదిలా ఉండగా హోర్ముజ్ జలసంధిలో కొత్తగా మళ్ళీ అబుదాభికి చెందిన మరో చమురుకంపెనీ నౌకపై దాడి జరిగింది. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో హోర్ముజ్ జలసంధి స్వాధీనంపై ట్రంప్ ఈ ప్రకటన చేసిన వెంటనే ఇరాన్ తీవ్రస్థాయిలో స్పందించింది. హోర్ముజ్ జలసంధికికి అధిపతి, యజమాని ఎప్పటికీ ఇరాన్ దేశమేనని ఆ దేశ న్యాయశాఖ అధిపతి ఘోలమ్ హొస్సేన్ మొహ్సెన్ ఎజాయి ఉద్ఘాటించారు. శనివారం ఎక్స్‌వేదికగా ఆయన ఒక పోస్టింగ్ పెడుతూ, ఈ జలసంధి పాలకుడు, యజమాని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ దేశం మాత్రమే అని నొక్కి చెబుతూ, ట్రంప్ వాదనను తిరస్కరించారు. ఇరాన్‌పై యుద్ధంలో గెలిచిన తర్వాత జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తామని ట్రంప్ చేసే వాదన భ్రమల నుండి పుట్టిందని విమర్శించారు. సైనికరంగంలో ఈ జలసంధి ఇరాన్ ప్రాదేశిక అధికారం నుండి సార్వభౌమాధికారం నుండి విడదీసి చూడలేని భూభాగమని ఇప్పటికే తమ సైన్యం నిరూపించిందని గుర్తుచేశారు. ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా శత్రువును నాశనం చేస్తామన్నారు.కాగా ఇరాన్ కేంద్ర సైనిక కమాండ్ ''ఖతమ్ అల్‌-అన్బియా'' ప్రతినిధి ఇబ్రహీం జోల్ఫఘరి ప్రభుత్వ టీవీలో మాట్లాడుతూ, హోర్ముజ్ జలసంధిలో నౌకలు సాధారణ రాకపోకలు సాగిస్తున్నాయన్న ట్రంప్ వ్యాఖ్యలను ఖండించారు. జలసంధి పూర్తిగా ఇరాన్ అధీనంలోనే ఉందని, అమెరికా ఆటలు సాగబోవని, ఇరాన్ విధించిన షరతులు ఒప్పుకునే వరకూ జలసంధి తెరచుకోబోదని స్పష్టం చేశారు. శక్తిమంతమైన మా సాయుధబలగాల అనుమతి లేకుండి ఓ ఒక్క నౌకా ఈ జలసంధి దాటి వెళ్ళదు, దాటి లోపలికి రాబోదని, వర్తమానంలోనూ,భవిష్యత్తులోనూ ఇదే జరుగుతుందన్నారు. ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీ మాట్లాడుతూ, ఈ జలమార్గం విషయం లో అమెరికా తప్పుడు అంచనాలు వేస్తోందన్నారు.

హోర్ముజ్ ఎప్పటికీ ఇరాన్ సొంతమే

భ్రమలతో వాదించినంతకాలం
జలసంధి తెరచుకోదు : ఘరి బాబదీ

టెహ్రాన్: హోర్ముజ్ ఎప్పటికీ తమ దేశ అంతర్భాగంగా ఉంటుందని ఇరాన్ విదేశీ వ్యవహారాలు, న్యాయ విభాగం ఉపమంత్రి కాజెం ఘరిబాబదీ శనివారం ఎక్స్ వేదిక (ట్విట్టర్) ద్వారా స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధి పూర్తిగా తమ అధీనంలోనే ఉందని, యుద్ధంలో గెలిచిన తర్వాత ఈ జలసంధిని తమ భూభాగంగా ప్రకటిస్తామని ట్రంప్ చేసిన ప్రకటనను ఆయన తిరస్కరించారు. ఎప్పటికీ జలసంధి అమెరికా సొంతం చేసుకోలేదన్నారు. ఈ జలసంధిని మూసివేయడం లేదా తెరిచి ఉంచడం వంటి చర్యలన్నీ ఇరాన్ సైనిక కమాండర్ ఆదేశాల మేరకే జరుగుతుందితప్ప అమెరికా వల్ల కాదని చెప్పారు.

ఈ వ్యూహాత్మక జలమార్గంపై ఇరాన్‌కే సంపూర్ణాధికారాలున్నాయన్నారు. సోషల్ మీడియా పోస్టుల ద్వారానో, అధికారిక ఆదేశాల ద్వారానో, విమాన వాహక యుద్ధ నౌకలు ప్రయోగించడం ద్వారానో ఈ జలసంధిని స్వాధీనం చేసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. బెదిరింపులకు, సైనికశక్తిని ప్రదర్శించే విన్యాసాలను చూసి ఇరాన్ భయపడి వెనక్కి తగ్గబోదని హెచ్చరించారు. అమెరికా ఇప్పటివరకూ ఎన్నో ఓటములను చవిచూసిందని, తన వ్యూహాత్మక వైఫల్యాలను అంగీకరించకుండా, భ్రమ పడుతూ, ఆ భ్రమల్లోనే ఉంటూ వాదనలు చేసినంతకాలం హోర్ముజ్ జలసంధి తెరచుకోదని, మూసే ఉంటుందని ఘరిబాబది స్పష్టం చేశారు. ఇరాన్ విధించిన ఆరు షరతులనూ అమెరికా అంగీకరించాలని, అప్పటివకూ జలసంధిలో నౌకల రాకపోకలపై నిషేధం,దిగ్బంధనం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇరాన్‌కు యుద్ధ నష్టపరిహారం చెల్లించాలని, ఎప్పటికీ ఇరాన్‌ను బెదిరించకూడదని, ఇరాన్ ఆస్తులను షరతులు లేకుండా విడుదల చేయాలని, ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం ఎత్తివేయాలని, షరతులు అంగీకరించి పశ్చిమాసియాను అమెరికా సైన్యాలు ఖాళీ చేసి వెళ్ళిపోవాలని ఇరాన్ తాజా షరతులు విధించింది.

విద్వేష వ్యాప్తి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఒకరోజు ఆయన మన జాతీయ జెండాను కూడా దించేందుకు ప్రయత్నించవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం కేవలం స్వాతంత్ర్య పోరాటాన్ని స్మరించుకునే రోజు మాత్రమే కాదని, మన స్వాతంత్ర్య సమరయోధుల కలలను భారతదేశం ఏ మేరకు సాకారం చేసిందనే దానిపై ఆత్మపరిశీలన చేసుకునేందుకు ఇది ఒక అవకాశమని ఆయన అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్‌లతో సహా కాంగ్రెస్ ప్రధానమంత్రులందరూ తమ కాలంలోని సవాళ్లకు అనుగుణంగా భారతదేశాన్ని ముందుకు నడిపించి, భవిష్యత్ భారతదేశానికి పునాది వేశారనేది కాంగ్రెస్ సంప్రదాయమని ఖర్గే అన్నారు. కానీ 21వ శతాబ్దంలో గర్వంగా నిలబడాలనే కలను మనం చూపిన ఆ యువతకు ఏమి జరుగుతోంది? అనేది నేడు మనముందున్న ప్రశ్న అని అన్నారు. నేడు యువత కలలు నలిగిపోతున్నాయని, ప్రభుత్వ తప్పుడు విధానాలు వారిని ఎంతటి చీకటి సందులోకి నెట్టాయో దేశవ్యాప్తంగా జరుగుతున్న యువ ఆందోళనలే అందుకు నిదర్శనమన్నారు. యువతకు తమ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతుందని, యువతను, పేదలను, అణగారిన వర్గాలను ముందుకు తీసుకెళ్లడమే తమ కర్తవ్యమన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం పౌరులకు ఇచ్చిందని, తమ హక్కుల కోసం వీధుల్లోకి రావడం దేశద్రోహం కాదని ఆయన అన్నారు. 'తమ హక్కుల కోసం గళం విప్పుతున్న జెన్ జీ తరం దేశద్రోహులు కాదు. బ్రిటిష్ పాలనలో ఏ హక్కుల కోసం మన యువత ఉరిశిక్షలు అనుభవించిందో, వాటిని మనం ఈనాటికీ కాపాడుకోవాలి. అది మన బాధ్యత' అని ఖర్గే అన్నారు. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపిన వారిపై ద్వేషపూరిత ప్రచారాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. దేశంలో శాంతి, ఐక్యత ఉండాలని కాంగ్రెస్ కోరుకుంటోందని ఖర్గే అన్నారు. స్వాతంత్ర్యానికి ముందే దేశానికి వ్యతిరేకంగా బిజెపి పనిచేసిందని, ఇప్పటికీ అలాగే వ్యవహరిస్తుందన్నారు. హిందువులు-ముస్లింల మధ్య విభజన సృష్టించడం, అంటరానివారిని దూరం పెట్టడం, పేదలను అణచివేయడం ద్వారా వారు దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తూనే ఉన్నారని దుయ్యబట్టారు. ధనికులను మరింత ధనికులుగా, పేదలను మరింత పేదలుగా మార్చడమే వారి విధానమన్నారు. ప్రధాని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై స్పందిస్తూ, వాస్తవానికి కాంగ్రెస్ అన్నీ చేసిందని, కానీ నేడు ఎర్రకోట సాక్షిగా మోదీ తామే అన్నీ చేశామని చెప్పుకుంటున్నారని ఖర్గే ఆరోపించారు. 'అదృష్టవశాత్తూ, ప్రపంచాన్ని తానే సృష్టించానని ఆయన చెప్పుకోలేదు. ఎవరైనా సలహా ఇచ్చి ఉంటే లేదా ఆయన ప్రసంగంలో రాసి ఉంటే, తన వల్లే ప్రపంచం రక్షించబడిందని కూడా ఆయన చెప్పేవారు' అని ఖర్గే ఎద్దేవా చేశారు. రామమందిర విరాళాల చోరీ వివాదంపై మాట్లాడుతూ, ట్రస్ట్ ఏర్పాటు నుండి విగ్రహ ప్రతిష్ఠాపన వరకు అన్నీ మోదీ స్వయంగా చేసుకోవడంతో, ఇప్పుడు ఆలయాలతో సహా ఆయా విశ్వాస కేంద్రాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఆయన అన్నారు. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, విశ్వవిద్యాలయాలు, దర్యాప్తు, మీడియా వ్యవహారాల్లో జోక్యం జరుగుతోందని, అందుకే ప్రజల్లో వ్యవస్థలపై నమ్మకం సన్నగిల్లిందని ఖర్గే ఆరోపించారు. ఆయా సంస్థల్లో తమ భావజాలానికి అనుకూలంగా ఉన్నవారిని నియమించుకోవాలని బిజెపి భావిస్తుండటంతో, ఇస్రో, డిఆర్‌డిఒ వంటి శాస్త్రీయ సంస్థలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు, నిపుణులు రాజీనామా చేసేలా ఒత్తిడికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

అబద్ధాల కోరు అమెరికా: బఖాయి

టెహ్రాన్: అమెరికా పెద్ద అబద్ధాలకోరు అని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయి విమర్శించారు. అమెరికా విదేశాంగ విధానమంతా అసత్యాల పునాదులపైనే ఆధారడి ఉందని, అసత్యాలను నమ్ముకునే అమెరికా విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. శనివారం ఆయన ఎక్స్ బ్లాగు వేదికగా స్పందిస్తూ, ఇరాన్, పశ్చిమాసియా ప్రాం తంపై అసత్యాల ఆధారంగా అమెరికా విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తోందన్నారు. తన వాదనను బలంగా వివరించేందుకు వీలుగా ఫ్యోడర్ దోస్తోవయెస్కీ రచించిన ''ద బ్రదర్స్ కరమజోవ్'' పుస్తకంలో కొన్ని భాగాలను బఖాయి ఉటంకించారు. దోస్తోవయెస్కీ చెప్పిన ప్రకారం, ఒక వ్యక్తి అసత్యాలనే నమ్ముతాడనీ, తనకు తానే అసత్యాన్ని చెప్పుకుని, తనలో తనే దానిని బలంగా నమ్ముతాడని, తన చుట్టూ వ్యాపించి ఉన్న సత్యా న్ని అతగాడు గుర్తించలేడని, అలాంటి వ్యక్తి సమా జ గౌరవాన్ని, సమాజ విశ్వసనీయతను కోల్పోతాడని చెబుతూ, అమెరికా నాయకులకు ఇదే వర్తిస్తుందని హెచ్చరించారు. ఇలాంటి అసత్యాలపైనే అమెరికా ఎక్కువగా ఆధారపడటంవల్ల ఇరాన్, పశ్చిమాసియా ప్రాంతానికి సంబంధించిన అమెరికా పాలనావ్యవస్థ తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నదని బఖాయి విమర్శించారు.

'మినాబ్' నేరంపై ఎందుకు నోరెత్తడంలేదు?

రష్యాలో ఇరాన్ దూత జలాలీ

మాస్కో: మినాబ్ పాఠశాలపై అమెరికా సాగించిన దుర్మార్గంపై అంతర్జాతీయ సంస్థలు 168 రోజులుగా నోరు మెదపకుండా మౌనం పాటిస్తున్నాయని రష్యాలో ఇరాన్ రాయబారి కాజెమ్ జలాలీ విమర్శించారు. ఈ దుర్మార్గ చర్యను ఎందుకు నోరు మెదపడంలేదని ప్రశ్నించారు. ఇరాన్‌లోని హోర్ముజ్‌గాన్ రాష్ట్రంలో ఉన్న మినాబ్ పాఠశాలపై అమెరికా బాంబుల వర్షం కురిపించింది. ఈ దుర్మార్గ చర్యలో 168 మంది విద్యార్థులు,ఉపాధ్యాయులు హతులయ్యారు. ఈ ఘటన ఐదునెలల క్రితం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. దీనిపై అంతర్జాతీయ సంస్థలు నేటికి 168 రోజులుగా మౌనం పాటిస్తున్నాయని, నోరు మెదపడంలేదని జలాలీ విమర్శించారు. చిన్న పిల్లల భవిష్యత్తును అమెరికా చిదిమేసింది, ఈ దుర్మార్గపు రక్తసిక్త ఘటన ప్రతిరోజూ ఒక కొత్త గాయంలా మిగిలిపోతోందని విమర్శించారు.

60,000 దరఖాస్తులు

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇవి సెప్టెంబరు 3 వరకు మీసేవా కేంద్రాలు, వెబ్‌సైట్, వాట్సాప్ ద్వారా అందుబాటులో ఉంటాయి. 528 చదరపు అడుగుల ఫ్లాట్లను స్టిల్ట్ ప్లస్ 10 అంతస్తుల్లో నిర్మిస్తుండగా, భూమిని ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడంతోపాటు రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తోంది. దరఖాస్తుతోపాటు రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందని, లాటరీలో ఇల్లు దక్కని వారికి ఈ మొత్తం తిరిగి చెల్లిస్తామని గౌతం స్పష్టం చేశారు. ఇల్లు లభించిన వారు రూ.6 లక్షలను నాలుగు విడతల్లో చెల్లించవచ్చని, కేటాయింపు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా లాటరీ ద్వారానే జరుగుతుందన్నారు. వివరాలకు కాల్ సెంటర్ నెంబర్ 04024603572లో సంప్రదించాలని ఆయన కోరారు.

రాచబాట

(మొదటి పేజీ తరువాయి)

పంచాయతీలకు 934 కిలోమీటర్ల మేర కొత్తగా బిటి రోడ్లను నిర్మించనున్నారు. దెబ్బతిన్న 5,490 కిలోమీటర్ల పాత బిటి రహదారులను పూర్తిస్థాయిలో ఆధునీకరించి బలోపేతం చేస్తారు. అధిక రద్దీ ఉన్న 1,024 కిలోమీటర్ల సింగిల్ లేన్ రోడ్లను ఇంటర్‌మీడియట్ లేన్‌లుగా విస్తరిస్తారు. ఈ మొదటి విడత పనుల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 3,036 గ్రామ పంచాయతీలు నేరుగా రవాణా లబ్ధి పొందనున్నాయి.

మూడు దశల్లో 18,472 కిలోమీటర్లు

రాష్ట్రంలోని పంచాయతీరాజ్ రహదారుల వ్యవస్థను పునర్నిర్మించేందుకు ప్రభుత్వం సమగ్ర లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. మొత్తం 18,472 కిలోమీటర్ల రహదారులను మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. మొదటి దశ: 7,448 కిలోమీటర్లు, 2.ఈ విధానంలో రోడ్డు నిర్మాణ బాధ్యతతో పాటు, తదుపరి 15 ఏళ్ల పాటు రహదారుల నిర్వహణ, నాణ్యతా పరిరక్షణ బాధ్యతను కాంట్రాక్టు సంస్థలకే అప్పగిస్తారు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 40 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే, మిగిలిన 60 శాతాన్ని కన్‌సెస్నర్ సమకూరుస్తారు. ప్రభుత్వం తన వాటాను 15 ఏళ్లలో 30 వాయిదాల రూపంలో చెల్లిస్తుంది. పనులన్నింటిని నెలల కాలమితిలోనే పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది.

పల్లె ప్రగతికి సరికొత్త భరోసా..

తెలంగాణలోని మొత్తం 69,318 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రహదారుల నెట్‌వర్క్‌లో సుమారు 45 శాతం వరకు మట్టి రోడ్లే ఉన్నాయి. రాబోయే మార్చి 2027 నాటికి రాష్ట్రంలో రహదారి సౌకర్యం లేని గ్రామం ఒక్కటి కూడా ఉండకూడదనే స్పష్టమైన ప్రణాళికతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రోడ్డు సౌకర్యం పెరిగితే గ్రామీణ ప్రాంతాలకు విద్యా, వైద్య సేవలు త్వరితగతిన అందడమే కాక, రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించడానికి, పరిశ్రమలు వచ్చి యువతకు ఉపాధి అవకాశాలు పెరగడానికి మార్గం సుగమం అవుతుంది.

ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శం
మంత్రి సీతక్క

'గ్రామానికి రహదారి అనేది కేవలం ప్రయాణ సాధనం మాత్రమే కాదు, అది ఆ పల్లె సమగ్ర వికాసానికి, భవిష్యత్ తరాల పురోగతికి బాటలు వేసే అభివృద్ధి రహదారి. దేశంలోనే తొలిసారిగా పంచాయతీరాజ్ శాఖలో హ్యామ్ మోడల్‌ను ప్రవేశపెట్టి నిర్మించడమే కాకుండా, 15 ఏళ్ల పాటు నాణ్యమైన, చేస్తున్నాం.' అని మంత్రి సీతక్క అన్నారు.

సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

ఆన్‌లైన్ కోచింగ్, కోటి మంది యువతకు ఏఐ శిక్షణ, క్రీడా ప్రతిభాన్వేషణ, శక్తివంతమైన పౌర రక్షణ వ్యవస్థ వంటి పలు ప్రకటనలు చేశారు. తయారీ, అంతరిక్షం, అణుశక్తి, సెమీకండక్టర్ల వంటి వివిధ రంగాలలో వారికి ఉన్న అవకాశాలను కూడా ఆయన ప్రస్తావించారు. తన 75 నిమిషాల ప్రసంగంలో ఆయన 50 సార్లకు పైగా యువత గురించి ప్రస్తావించారు. వ్యూహాత్మక సముద్ర మార్గాల వంటి వనరులను ఆయుధాలుగా మార్చే ప్రయత్నాలపై ప్రపంచ సమాజాన్ని ప్రధానమంత్రి హెచ్చరించారు. దేశీయంగా, సరిహద్దులకు ఆవల, వ్యూహాత్మక జాతీయ వనరుల కోసం ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాల గురించి ఆయన ప్రస్తావిస్తూ, గతంలోని పాతబడిన వ్యవస్థల స్థానంలో శక్తివంతమైన పౌర రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. భారతీయ కంపెనీలను ప్రపంచ ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలన్న తన పిలుపును మోదీ పునరుద్ఘాటించారు. ప్రపంచంలోని అతిపెద్ద కార్పొరేషన్ల ఫార్చ్యూన్ 500 జాబితాలో కనీసం 50 భారతీయ సంస్థలు ఉండాలని, అలాగే బ్యాంకులు, ఫార్మా వంటి అన్ని రంగాలలోనూ దేశం అగ్ర ఐదు జాబితాలలో స్థానం సంపాదించుకోవాలని ఆయన అన్నారు.

లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలును నిర్ధారించడానికి రాజకీయ కలహాలను పక్కన పెట్టాలని ప్రధాని పిలుపునిచ్చారు. మహిళా శక్తిని అందరూ గౌరవించాలన్నారు. 'మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేసేందుకు ముందుకు రావాలని, మహిళలకు తగిన గౌరవాన్ని కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరుతున్నాను. దీని ఆమోదానికి సంబంధించిన ఘనతను వారు కూడా తీసుకోవాలి. ఇందులో తమవంతు సహకారం అందించాలి, కానీ ఆ హక్కును మాత్రం మన మహిళలకు అప్పగించాలి' అని ఆయన అన్నారు. ఇది ప్రస్తుత తరుణంలో అత్యంత ఆవశ్యకమమని మోదీ చెప్పారు. అదే విధంగా భారతదేశాన్ని ముందుకు నడిపించడానికి, ఉన్నత శిఖరాలకు చేర్చడానికి ఏడు అంశాలను (సప్తధారలు) తయారీ రంగం, విద్యుత్, వ్యవసాయం, ఆహార శుద్ధి, సాంకేతికత, ఆవిష్కరణలు, గతిశక్తి, రక్షణ శక్తి, హరిత, నీలి ఆర్థిక వ్యవస్థలు, సాఫ్ట్ పవర్ వంటి అంశాలను ఈ సందర్భంగా మోదీ ప్రకటించారు. వివరించారు.

హైపర్‌సోనిక్ సాంకేతికత, డ్రోన్ వ్యవస్థల వంటి అధునాతన సామర్థ్యాలలో స్వయం సమృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, భారతదేశాన్ని రక్షణ పరికరాల తయారీలో ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. విద్యా రంగానికి సంబంధించి, కోచింగ్ తరగతులు పేద , మధ్యతరగతి వర్గాలకు ఏ విధంగా భారంగా మారాయో ప్రస్తావిస్తూ ఆయన భావోద్వేగంతో మాట్లాడారు. పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌ను ప్రకటిస్తూ 'పేద, మధ్యతరగతి కుటుంబాల ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని, కోచింగ్ కోసం వారు ఖర్చు చేసే వేల కోట్ల రూపాయలను ఆదా చేయడంలో వారికి సహాయపడాలని మేము కోరుకుంటున్నాము. మన యువత తమ కుటుంబాలకు దగ్గరగా ఉంటూ, వారి సంరక్షణను పొందుతూనే, వారిపై అదనపు ఆర్థిక భారాన్ని మోపకుండా ఉండేలా చూడాలి' అని అన్నారు. నక్సల్స్‌పై ప్రభుత్వం జరిపిన పోరాటంలో సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, మావోయిస్టు భావజాలం కలిగిన వ్యక్తులు సంవత్సరాలుగా దేశంలోని అధికార వర్గాలలో, ప్రభుత్వ కమిటీలలో సలహాదారులుగా తమ పాత్రల ద్వారా పాతుకుపోయారని మోదీ అన్నారు. ఈ 'మావోయిస్టు మన స్వత్వం' విధాన రూపకల్పనను ప్రభావితం చేసిందని ఆయన అన్నారు. 'అడవుల నుండి సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించి, ఆ సంక్షోభం నుండి దేశాన్ని విముక్తి చేయడంలో మనం విజయం సాధించాం. అయితే, సాయుధ నక్సల్స్ పోయినప్పటికీ, 'దిమాగీ' (మేధావి) నక్సల్స్ ఇంకా పొంచి ఉన్నారు' అని ఆయన అన్నారు.

'ఇంధన భద్రత నేటి అవసరం, అందుకే మేము ఇప్పటికే ఈ దిశగా చర్యలు తీసుకున్నాము. పార్లమెంటులో శాంతి చట్టాన్ని ఆమోదించి, 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్‌ను సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాము' అని ఆయన అన్నారు. పశ్చిమ ఆసియా యుద్ధం, రష్యా-ఉక్రెయిన్ వివాదం, కొవిడ్ 19 మహమ్మారి మధ్యలో తమ ఆధిపత్యాన్ని చాటుకోవడానికి కొందరు వనరులను, వ్యూహాత్మక సముద్ర మార్గాలను ఆయుధాలుగా వాడుకోవడానికి ప్రయత్నించారని ప్రధానమంత్రి ఆరోపించారు. 'కొందరు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి వనరులను ఆయుధాలుగా వాడుకునే ఆట ఆడారు... పెట్రోల్, డీజిల్, ఎరువులు, మందులు, టెక్ చిప్‌లు, చివరికి భౌగోళిక ప్రాంతాన్ని కూడా ఆయుధాలుగా మార్చారు. గత పదేళ్లుగా మనం ఆత్మనిర్భరత అనే మంత్రాన్ని సరైన దిశలో అనుసరించకపోయి ఉంటే, ఇలాంటి సవాళ్లను ఎంత దృఢంగా ఎదుర్కొని ఉండేవాళ్లమో ఊహించండి. మా సన్నాహాలు పెరుగుతూనే ఉన్నాయి' అని ఆయన అన్నారు.

ప్రస్తుతం జరుగుతున్న 2027 జనాభా లెక్కల ప్రక్రియలో యువత చురుకైన పాత్ర పోషించాలని, తమ కుటుంబాలకు డిజిటల్‌గా కచ్చితమైన సమాచారాన్ని నింపడంలో సహాయపడాలని ప్రధానమంత్రి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఐదు దేశాల జాబితా నుండి ఆర్థిక వ్యవస్థను బయటకు తీసుకురావడానికి తమ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను హైలైట్ చేస్తూ, 2014 నుండి భారతదేశం సుమారు 40 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను (ఎఫ్‌టిఏలు) ఖరారు చేసిందని, ఇది దేశంలోని ఎంఎస్‌ఎంఇలకు అపారమైన అవకాశాన్ని కల్పిస్తోందని మోదీ అన్నారు. చిన్న తరహా సంస్థలు ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని, చేజార్చుకోవద్దని ఆయన కోరారు. దేశంలోని రిఫైనరీలు, బ్యాంకులు, డేటా సెంటర్లు, ఇతర కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరగగల ఈ తరుణంలో, గతంలో జరిగిన సంప్రదాయ యుద్ధాలకు ప్రతిస్పందనగా అభివృద్ధి చేసిన వ్యవస్థ ఇకపై సరిపోదని పేర్కొంటూ, పౌర రక్షణ స్వచ్ఛంద దళాన్ని ఆధునీకరించే ప్రణాళికలను కూడా ప్రధానమంత్రి ప్రకటించారు.

కొన్ని వివాదాలకు వేదికైన స్వాతంత్ర్య దినోత్సవం

ప్రధానమంత్రి జేబులో పెట్టుకున్న రుమాలు (పాకెట్ స్క్వేర్)లో త్రివర్ణ క్రమం తారుమారైందని ప్రతిపక్షాలు విమర్శించగా, కాంగ్రెస్ పార్టీ తన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలోనే 'వందే మాతరం' గీతాన్ని అవమానించిందని, ఆ పార్టీ అగ్రనేతలు హాజరుకాలేదని బిజెపి ఎదురుదాడికి దిగింది. ఎర్రకోట వద్ద జరిగిన వేడుకల్లో తొలిసారిగా జాతీయ గీతం (వందేమాతరం)లోని మొత్తం ఆరు చరణాలను ఆలపించారు. అక్కడ హాజరైన అతిథులు జాతీయ గీతాన్ని పాడుతుండగా ఆర్మీ బ్యాండ 'వందేమాతరం' బాణీని వాయించింది. ఆ తర్వాత ప్రధానమంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించారు, అనంతరం జాతీయ గీతాలాపన జరిగింది. ప్రధానమంత్రి త్రివిధ దళాల సిబ్బంది నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. తన ప్రసంగంలో మోదీ స్వాతంత్ర్య సమరయోధులందరికీ నివాళులర్పించారు. మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో సహా కొందరి పేర్లను ప్రస్తావిస్తూ వారి త్యాగాలను స్మరించుకున్నారు. అంతకుముందు ఉదయం, ఆయన రాజ్ ఘాట్‌లోని మహాత్మా గాంధీ స్మారక స్థలం వద్ద పుష్పాంజలి ఘటించారు.

రాజీ పడబోం

(మొదటి పేజీ తరువాయి)

మొక్కుబడి హామీలుగానో చూడటంలేదని, ప్రతి పథకంలో శాస్త్రీయ దృక్పథం ఉన్నదన్నారు. త్వరలో జరిగే 'ఖేలో ఇండియా' పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తుందన్నారు. విద్య, వైద్య రంగాలు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అంశాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఒత్తిడి వల్లనే కేంద్రప్రభుత్వం జనగణనలో కుల గణన చేర్చిందన్నారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో కుల గణన పూర్తయిందని, కేంద్రం కూడా తెలంగాణను ఆదర్శంగా తీసుకుందన్నారు. దేశంలోనే తొలిసారిగా గిగ్ కార్మికుల సంక్షేమం కోసం చట్టం చేశామని, సినీ కార్మికుల సంక్షేమం కోసం కూడా త్వరలో బోర్డు ఏర్పాటు చేస్తామని సిఎం ప్రకటించారు. రానున్న 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉక్కు సంకల్పంతో ఉన్నామన్నారు. విద్యా సూచీలో 21వ స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం 14కు చేరుకుందని సిఎం చెప్పారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించామని, 11 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం ద్వారా వారికి అండగా నిలుస్తున్నామని, యాజమాన్యాలతో సంబంధం లేకుండా విద్యా సంవత్సరంలో నేరుగా విద్యార్థుల ఖాతాల్లో స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను జమ చేస్తామన్నారు. త్వరలో సనత్ నగర్ టిమ్స్‌ను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

వ్యవసాయానికి రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు

తమ 32 నెలలో పాలనలో వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని సిఎం చెప్పారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు రైతులకు అందించామని గుర్తు చేశారు. ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం సరికొత్త రికార్డులను అధిగమించిందన్నారు. యాసంగిలో 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి కొత్త రికార్డును సృష్టించామన్నారు.

రూ. 1.95 లక్షల కోట్ల పెట్టుబడులు...

టిఎస్ ఐపాస్ ద్వారా రూ.1.95 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని, తద్వారా 78 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు రానున్నాయని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను ఐటి ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయని, ప్రత్యక్ష ఐటి ఉద్యోగాలు 12.14 లక్షలకు పెరిగాయని వివరించారు. హైదరాబాద్‌లో ఇప్పుడు 355కి పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు పనిచేస్తున్నాయని 2026లో కొత్తగా 40 కెపాబిలిటీ సెంటర్లు వచ్చాయన్నారు. అమెజాన్ సంస్థ రాష్ట్రంలో 7 బిలియన్ డాలర్లు పెట్టుబడిని ప్రకటించిందన్నారు. డేటా సెంటర్లు, క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో తెలంగాణ దేశంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న గమ్య స్థానాల్లో ఒకటిగా ఉన్నదన్నారు.

రాష్ట్ర ఆదాయం పెంచేందుకు సహకరించండి

ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో ఉద్యోగుల కృషి ఎంతో ఉందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఉద్యోగులు సహకరించాలని సూచించారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లిస్తామని ఇచ్చిన మాట ప్రకారం వంద రోజుల్లో రూ.6 వేల కోట్లను విడుదల చేశామని, మిగిలిన పెండింగ్ బిల్లులను దశల వారీగా పరిష్కరిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పక్కదారి పట్టకుండా, పన్నులు, రుసుముల ఎగవేతను అరికట్టేందుకు విజిలెన్స్, పౌర సరఫరాల శాఖల్లో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలను ఏర్పాటు చేశామన్నారు. డ్రగ్స్ ముప్పు, ఆహార కల్తీని ఎదుర్కొనేందుకు కొత్తగా టిజి సేఫ్ ఏర్పాటు చేశామని, డ్రగ్స్, ఆహార కల్తీ ఏ మాత్రం జరిగినా ప్రభుత్వం చూస్తూ ఉండబోదని, అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని సిఎం హెచ్చరించారు.

'మూసీ'కి సహకరించండి..నిర్వాసితులకు అండగా ఉంటాం'

మూసీ పునర్జీవన ప్రాజెక్ట్‌కు నిర్వాసితులు ప్రభుత్వానికి సహకరించాలని, వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని సిఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. మూసీ ప్రక్షాళనతోనే హైదరాబాద్ ముందుకెళ్తుందన్నారు. 55 కిలోమీటర్ల సమగ్ర అభివృద్ధి చేస్తున్నామని, 39 కొత్త ఎస్‌టిపిలను నిర్మిస్తున్నామని, గోదావరి నుంచి 2.5 టిఎంసిల స్వచ్ఛమైన నీటిని మూసీకి తరలించే ప్రణాళికతో ముందుకెళ్తున్నామని వివరించారు. దాదాపు 30 వేల ఎకరాల్లో ప్రపంచ స్థాయి గొప్ప నగరంగా భారత ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్నారు. ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానం ఫ్యూచర్ సిటీ కానుందని, ఫ్యూచర్ సిటీకి భూములు అందించిన రైతులను అభినందిస్తున్నామని, వారికి సరైన పరిహారం అందించి ఆదుకుంటామని సిఎం హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం సాధించిన ప్రతి విజయంలో ప్రజల భాగస్వామ్యం, వారి విశ్వాసం, సహకారం, ఓర్పు, కష్టానికి ప్రభుత్వం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధమవ్వండి..ఇతర వ్యాపాకాల్లోకి పోవద్దు

నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, ఇతర వ్యాపకాలలోకి పోవద్దని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. తొలి రెండేళ్ల కాలంలోనే 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పూర్తి చేశామన్నారు. టిజిపిఎస్‌సి ద్వారా 456 పోస్టులు, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 7,437 పోస్టుల నియామకానికి నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో 1,190 మంది శిక్షణ పొందగా, 838 మంది ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారని, జాబ్ మేళాలో 5700 మంది ఉద్యోగాలు సాధించారని వివరించారు. త్వరలో 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లుగా చేస్తున్నామని సిఎం వివరించారు.

త్వరలో 'ఆన్‌లైన్ ప్రజావాణి'

త్వరలోనే ఆన్‌లైన్ ప్రజావాణి నిర్వహిస్తామని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆన్‌లైన్‌లో ప్రజలు ఎక్కడి నుంచైనా ఫిర్యాదులు, దరఖాస్తులు చేయవచ్చన్నారు. చెరువులు, ప్రభుత్వ భూములు రక్షించేందుకు హైడ్రాను ఏర్పాటు చేశామని, చెరువులను ప్రక్షాళన చేసి నైట్ ఎకానమీని అభివృద్ధి చేస్తామన్నారు.

పెను భూకంపం

(మొదటి పేజీ తరువాయి)

నమోదైంది. చాలా నష్టం జరిగినట్లు ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయి.ఫ్లోరెన్స్ ప్రాంతంలో స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 5.58 గంటలకు భూకంపం వచ్చిన తర్వాత మరో 37 సార్లు పలు ప్రాంతాలలో భూమి కంపించింది. దీంతో ప్రాణాంతక భూకంపాలకు అలవాటు పడిన ఈ ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఏడాది జనవరి,ఫిబ్రవరి,మార్చి నెలల్లో కూడా ఇండోనేసియాలో భూకంపం వచ్చింది. అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ప్రాణాంతకమైనస్థాయిలో సముద్ర అలలు ఎగసి పడటంలేదని శాస్త్రవేత్తలు చెప్పడంతో ఈ ఆదేశాలను తర్వాత ఉపసంహరించుకున్నారు. నానాగ్బాలోని ఈస్టు నునాటెంగ్గారాలో కొండచరియలు విరిగి పడటంతో ఈ ప్రాంతంలోకి ప్రవేశించేందుకు దారులు మూసుకుపోయాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు గల్లంతుకాగా, మరో ఆరుగురు గాయపడ్డారు. ఎండే రీజెన్స్‌లో లాబువాన్ బాజో-లారాంటుకా వరకూ ఫ్లోరెస్ ద్వీపాన్ని కలిపే జాతీయ రహదారితో సంబంధాలు తెగిపోయాయి. 17,000 కంటే ఎక్కువగా ఉన్న ద్వీపాల సమూహ దేశం ఇండోనేసియా. పసిఫిక్ బేసిన్‌లోని అగ్నిపర్వతాలు,రింగ్ ఆఫ్ ఫైర్ ఈ ప్రాంతంలోనే ఉన్నందువల్ల ఇది భూకంపాల నిలయ ప్రాంతంగా ప్రసిద్ధి చెందింది. 1992లో వచ్చిన శక్తిమంతమైన సునామీ కారణంగా 2,500 మంది ఈ దేశంలో మరణించారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం అంచనావేస్తుండగా,సహాయ బృందాలు రంగంలోకి దిగి శిథిలాలను తొలగిస్తూ సజీవులకోసం వెతుకుతున్నాయి.తూర్పు నుసా తెంగారాలో పలు భవనాలు కూలిపోయినట్లు ఈ ప్రాంత పోలీసు అధికారి రూడీ డార్మోకో చెప్పారు.

మరోవైపు భూకంప భయంతో పెరూ దేశం ముందుగానే ప్రజలను అప్రమత్తం చేసి ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో, ఎలా సహాయ చర్యలు చేపట్టాలో నమూనా విన్యాసాలు చేస్తోంది. కొలంబియాలోని సాన్‌జోస్ డెల్ పాల్మార్‌లో 7.4 తీవ్రతతో ఆగస్టు 10వ తేదీన భారీ భూకంపం సంభవించింది. తర్వాత నాలుగు రోజులకే ఇండోనేసియాలో కూడా తీవ్ర భూకంపం సంభవించింది. నాలుగు రోజులుగా కొలంబియా శిథిలాల్లో కూరుకుపోయి ఒక వ్యక్తిని సహాయబృందాలు సజీవంగా వెలికి తీయడంతో ఆ ప్రాంతంలో కేరింతలు మిన్నుముట్టాయి.ఇప్పటివరకూ కొలంబియాలో భూకంప మృతులసంఖ్య 281కి చేరుకుంది. రెండు రోజుల క్రితం ఆగస్టు 13న కాలిఫోర్నియా అల్మెడా కౌంటీ సాన్ లియాండ్రోలో కూడా భూకంపం సంభవించింది. అలాస్కా స్కెంట్‌నా ప్రాంతంలో ఆగస్టునెలలోనే ఎనిమిదో తేదీన భూకంపం వచ్చింది. దానికి మూడు రోజుల ముందు ఆగస్టు ఐదో తేదీన న్యూజిలాండ్ కెర్మడెక్ దీవుల్లో, ఫిలిప్పీన్స్ సారంగణి ప్రాంతంలో 6.3 తీవ్రతతో భూకంపం వచ్చింది. ఈ ఏడాది జనవరిలో ఫిలిప్పీన్స్‌లో రెండుసార్లు, మొరాకాలో ఒకసారి భూకంపం వచ్చింది.చైనా, చిలీ, అలాస్కా, ఫిజి, నెబ్రాస్కేలలో భూకంపాలు వచ్చాయి. ఏప్రిల్,మే నెలల్లో రెండుసార్లు జపాన్‌లో భూకంపాలు వచ్చాయి. ఇక వెనిజులాలో వచ్చిన భూకంపంలో వేలాదిమంది ఇంకా శిథిలాల్లోనే ఉండిపోయారు. చిలీ, ఇటలీ, క్యూబా, హవాయ్, మేరీల్యాండ్ ప్రాంతాల్లోనూ భూకంపాలు వచ్చాయి.

గాలే టెస్టులో తొలిరోజు టీమిండియాదే

గాలే టెస్టులో తొలిరోజే భారత జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది. శ్రీలంక స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొన్న దేవ్‌దత్ పడిక్కల్(131 నాటౌట్) తొలి శతకంతో చెలరేగి భారీ స్కోరం దించాడు. కేఎల్ రాహుల్(77 రిటైర్డ్ హర్ట్) అర్ధ శతకంతో మెరవగా.. ఇద్దరూ 150 ప్లస్ భాగ స్వామ్యం నెలకొల్పారు. టీ బ్రేక్ అనంతరం వర్షం అంతరాయం కలిగించినా.. రిషభ్ పంత్(27 నాటౌట్)తో పడిక్కల్ యాభై రన్స్ జోడించాడు. దాంతో, టీమిండియా 288/2తో సంతృప్తిగా తొలి రోజును ముగించింది. తొమ్మి దేళ్ల తర్వాత శ్రీలంకలో తొలి టెస్టు ఆడుతున్న భారత జట్టు అదరగొట్టింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆరొందల మ్యాచ్.. పైగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం రోజున దేవ్‌దత్ పడిక్కల్(131 నాటౌట్) సెంచరీతో గర్జించాడు. లంకపై మంచి రికార్డున్న కేఎల్ రాహుల్‌తో(77 రిటైర్డ్ హర్ట్) సైతం అర్ధ శతకంతో మెరిశాడు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్(32) రనౌటయ్యాక లంచ్ సెషన్ ఆసాంతం క్రీజులో నిలిచిన రాహుల్ టీమిండియా స్కోర్ రెండొందలు దాటించాడు. ఓపెనర్‌గా వచ్చి లంక బౌలర్ల సహనాన్ని పరీక్షించిన రాహుల్ టీ బ్రేక్ తర్వాత బ్యాటింగ్‌కు రాలేదు. కండరాల నొప్పితో విలవిలలాడిన అతడు రిటైర్డ్ హర్ట్‌గా క్రీజును వదిలాడు. దాంతో.. ఆ తర్వాత వచ్చిన శుభ్‌మన్ గిల్(16) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగాడు. ప్రభాత జయసూర్య ఓవర్లో గిల్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. వర్షం అంతరాయ కలిగించే సమయానికి శతక వీరుడు పడిక్కల్ జతగా రిషభ్ పంత్(27 నాటౌట్) నిలబడ్డాడు. అయితే.. వర్షం అంతరాయంతో 63 ఓవర్ పూర్తయ్యాక కాసేపు ఆటను నిలిపివేశారు అంపైర్లు. అప్పుడు టీమిండియా స్కోర్.. 239/2. వాన తగ్గాక పంత్ ఫోర్లు, సిక్సర్లతో అలరించాడు. దాంతో, తొలి రోజు ఆట ముగిసే సరికి రెండు వికెట్ల నష్టానికి భారత జట్టు 288 పరుగులు చేసింది.

ఆరంభ పోరులో వేల్స్‌ను చిత్తు చేసిన భారత్..!

ఎఫ్ఐహెచ్ పురుషుల హాకీ వరల్డ్‌కప్‌లో భారత జట్టు అదిరే బోణీ కొట్టింది. కొత్త జెర్సీ(కాషాయం రంగు)తో తొలిసారి మెగా టోర్నీలో ఆడుతున్న టీమిండియా శనివారం వేల్స్ జట్టును చిత్తుగా ఓడించింది. తొలి అర్ధ భాగంలోనే రెండు గోల్స్‌తో స్పష్టమైన ఆధిపత్యం చెలాయించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ఏకంగా రెండు గోల్స్ సాధించగా 3–1తో జయభేరి మోగించింది భారత్. ఆరంభం నుంచి గోల్ కోసం ముమ్మరంగా ప్రయత్నించిన వేల్స్ ఆఖరి నిమిషంలో సఫలమై పరువు కాపాడుకుంది. పురుషుల హాకీ ప్రపంచకప్‌ను భారత జట్టు విజయంతో ఆరంభించింది. గ్రూప్ డీ లీగ్ దశ తొలి మ్యాచ్‌లో వేల్స్‌పై సునీల్ తొలి గోల్ అందించాడు. పెనాల్టీ కార్నర్‌ను అతడు సూపర్‌గా డ్రాగ్ ఫ్లిక్ చేశాడు. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కూడా డ్రాగ్ ఫ్లిక్‌తో గోల్ అందించగా తొలి అర్ధ భాగంలోనే 2–0తో టీమిండియా స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధ భాగంలోనూ వేల్స్ ఆటగాళ్లను సమర్థంగా నిలువరించారు భారత డిఫెండర్లు. పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ 43వ నిమిషంలో డ్రాగ్ ఫ్లిక్ ద్వారా బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. అంతే.. ఆధిక్యం 3–0కు చేరింది. బంతిపై పూర్తి నియంత్రణతో మన డిఫెండర్లు ప్రత్యర్థి ఆటగాళ్లను అడ్డుకున్నారు. అయితే.. 56వ నిమిషంలో సామ్ వేల్స్ గోల్ చేయడంతో వేల్స్ ఖాతా తెరిచింది. అప్పటికే సమయం మించిపోవడంతో, హర్మన్‌ప్రీత్ సేన వేల్స్‌పై అలవోక విజయ సాధించింది. గ్రూప్ డీ నుంచి రెండు పాయింట్లు సొంతం చేసుకుంది.

చరిత్రాత్మక విజయానికి చేరువైన బంగ్లాదేశ్

ఇరవై మూడేళ్ల తర్వాత ఆస్ట్రేలియాలో తొలి టెస్టు ఆడుతున్న బంగ్లాదేశ్ గెలుపు వాకిట నిలిచింది. గతంలో పలుమార్లు ఆసీస్ చేతిలో ఓడిన బంగ్లా చరిత్రాత్మక విజయానికి చేరువైంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లతో ఆతిథ్య జట్టు నడ్డి విరిచిన హసన్ మహమూద్(6–55).. రెండో ఇన్నింగ్స్‌లోనూ దెబ్బకొట్టాడు. ఫలితంగా.. నాలుగు వికెట్లు కోల్పోయిన కంగారూ టీమ్ ఓటమి అంచున నిలిచింది. చేతిలో ఆరు వికెట్లున్నా.. జోరుమీదున్న బంగ్లా పేసర్లను కాచుకొని మ్యాచ్ కాపాడుకోవడం కమిన్స్ బృందానికి కష్టమైన పనే. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియాకు చుక్కలు చూపిస్తోంది బంగ్లాదేశ్. స్వదేశంలో ప్రత్యర్థులను భయపెట్టే ఆసీస్‌ను ఓటమి అంచున నిలిపింది బంగ్లా. డార్విన్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 198కే ఆలౌటైన ఆసీస్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆరు వికెట్లతో మొదటి ఇన్నింగ్స్‌లోనే ఆతిథ్య జట్టును పడగొట్టిన హసన్ మహమూద్(2–33).. మరోసారి చెలరేగగా ఓపెనర్లు జేక్ వెథెరాల్డ్ 0), ట్రావిస్ హెడ్(17)లు డగౌట్ చేరారు. క్రీజులో కుదురుకున్నట్టే అనిపించిన మార్నస్ లబూషేన్(31)ను తైజుల్ ఇస్లాం బౌల్డ్ చేయగా.. ఫామ్‌లో ఉన్న స్టీవ్ స్మిత్(44)ను మిరాజ్ వెనక్కి పంపాడు. ఇంకేముంది.. చూస్తుండగానే 122 వద్ద కంగారూ టీమ్ నాలుగో వికెట్ కోల్పోయింది. ఆఖర్లో కామెరూన్ గ్రీన్(43 నాటౌట్), అలెక్స్ క్యారీ(19 నాటౌట్) కాస్త పట్టుదల ప్రదర్శించి వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. దాంతో, మూడో రోజు ఆట ముగిసేసరికి తో ఉన్న ఆసీస్ ఇంకా 67 పరుగులు వెనకే ఉంది. టీ సెషన్ తర్వాత లిటన్ దాస్(0)ను స్టార్క్, ముష్ఫికర్ రహీం(36)ను కమిన్స్ పెవిలియన్ పంపారు. వెంటవెంటనే రెండు వికెట్లు పడినా.. మెహిదీ హసన్ మిరాజ్(65), హసన్ మహమూద్(14)లు పట్టుదలగా ఆడారు. దాంతో, మూడో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 351/6తో ఆట కొనసాగించిన బంగ్లాదేశ్.. 426 పరుగులకు ఆలౌటైంది. పర్యాటక జట్టుకు 226 రన్స్ ఆధిక్యం లభించగా.. ఆసీస్ పేసర్ హేజిల్‌వుడ్ ఆరు వికెట్లతో రాణించాడు.

బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)
24 క్యారెట్లు: రూ. 1,52,890
22 క్యారెట్లు: రూ. 1,40,150
18 క్యారెట్లు: రూ. 1,14,670
(బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు పెరుగుతునే ఉన్నాయి. సీజన్‌తో సంబంధం లేకుండా పసిడి ధరలు పెరగడానికి అంతర్జాతీయ ఉద్రిక్తతలను కారణంగా పేర్కొంటున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇతరత్రా పెట్టుబడుల వల్ల నష్టాల ప్రమాదం ఉంటుందనే అనుమానంతో, బంగారంపై భారీగా పెట్టుబడులకు మదుపరులు ఆసక్తి చూపుతున్నారు. బంగారంపై ప్రజల్లో ఉన్న మక్కువ, సాంప్రదాయాలు, ఆచారాలు కూడా బంగారం ధర పెరగడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి).

ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బిఎస్ఇ)లో సెన్సెక్స్: ప్రారంభం 78,499.17 పాయింట్లు. ముగింపు 78,009.25 పాయింట్లు. నష్టం 489.92పాయింట్లు.
జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ: ప్రారంభం 24,570.65 పాయింట్లు. ముగింపు 24,366.00 పాయింట్లు. నష్టం 204.65 పాయింట్లు.

(స్టాక్ మార్కెట్లలో ఈవారం 'బుల్ రన్'కు బ్రేక్ పడింది. 'బేర్' జోరు కొనసాగింది. జాతీయంగానేకాక, అంతర్జాతీయంగానూ నెలకొన్న అనిశ్చితి కారణాల నేపథ్యంలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీ ప్రభావితమయ్యాయి. వచ్చే వారం కూడా ఇదే పరిస్థితి కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు ప్రపంచ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. భారత మార్కెట్లు ఎంత వరకు కోలుకుంటాయో చూడాలి)

31 లక్షల క్రియాశీలక కంపెనీలు

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తాజా గణాంకాల ప్రకారం, దేశంలో నమోదైన కంపెనీల సంఖ్య 31 లక్షలు దాటింది. వీటిలో ప్రస్తుతం సుమారు 21.17 లక్షల కంపెనీలు క్రియాశీలంగా ఉన్నాయి. 2015–16లో క్రియాశీల కంపెనీల సంఖ్య 6,78,768 ఉండగా, దశాబ్ద కాలంలో అది మూడు రెట్లకు పైగా పెరిగింది. కంపెనీల నమోదులో పెరుగుదలతో పాటు, కంపెనీలను రిజిస్టర్ నుంచి తొలగించే ప్రక్రియ కూడా కొనసాగుతోంది. కేంద్రం అందించిన వివరాల ప్రకారం, కొవిడ్ కాలాన్ని మినహాయిస్తే, దేశంలో ప్రతి ఏడాది సగటున 20,000 నుంచి 22,000 కంపెనీలు మూతపడుతున్నాయి. అయితే వీటిలో 76 శాతం కంపెనీలు వాస్తవంగా వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించని లేదా చాలాకాలంగా పనిచేయని 'డిఫంక్ట్' సంస్థలే. మరో 12 శాతం కంపెనీలు విలీనం కారణంగా రద్దయ్యాయి. సుమారు 2 శాతం సంస్థలు చట్టపరమైన ప్రక్రియ ద్వారా రద్దయ్యాయి. 2019–20లో కంపెనీల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా చేపట్టిన చర్యల్లో దాదాపు 6 లక్షల క్రియాశీలేతర కంపెనీలను రిజిస్టర్ నుంచి తొలగించింది. దేశం లో ప్రతి ఏడాది సుమారు లక్ష కొత్త కంపెనీలు నమోదవుతున్నాయి. 2025–26లో అత్యధికంగా మహారాష్ట్రలో 41,525 కొత్త కంపెనీలు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో 27,494, ఢిల్లీలో 20,272, కర్ణాటకలో 17,857, తెలంగాణలో 17,300, తమిళనాడులో 17,024, గుజరాత్‌లో 14,666, పశ్చిమ బెంగాల్‌లో 10,598 కంపెనీలు నమోదయ్యాయి. క్రియాశీల కంపెనీల సంఖ్యలోనూ మహారాష్ట్ర 3,96,211 సంస్థలతో ముందంజలో ఉంది. ఢిల్లీలో 2,72,342, ఉత్తరప్రదేశ్‌లో 1,85,982 క్రియాశీల కంపెనీలు ఉన్నాయి.



డబ్ల్యుపిఐలో స్వల్ప తగ్గుదల

టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యుపిఐ) జులై మాసంలో స్వల్పంగా తగ్గింది. తాజా గణాంకాలను అనుసరించి, జూన్‌లో 9.87 శాతంగా ఉన్న డబ్ల్యుపిఐ ద్రవ్యోల్బణం జులైలో 9.78 శాతానికి చేరింది. గత తొమ్మిది నెలల్లో నెలవారీ ప్రాతిపదికన డబ్ల్యుపిఐ తగ్గడం ఇదే తొలిసారి. ఇంధనం, విద్యుత్ ధరల పెరుగుదల తగ్గడం దీనికి ప్రధాన కారణం. ఇంధనం, విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం జూన్‌లో 27.41 శాతం ఉండగా, జులైలో 20.05 శాతానికి తగ్గింది. ఆహార వస్తువుల ద్రవ్యోల్బణం కూడా 5.49 శాతం నుంచి 5.44 శాతానికి స్వల్పంగా తగ్గింది. అయితే తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 7.48 శాతం నుంచి 8.29 శాతానికి పెరిగింది. ఖనిజ నూనెలు, ఆహార పదార్థాలు, ప్రాథమిక లోహాలు, రసాయన ఉత్పత్తులు తదితరాలు డబ్ల్యుపిఐ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. ప్రపంచ కమోడిటీ ధరలు, ముఖ్యంగా ముడిచమురు ధరలు గరిష్ఠ స్థాయిని దాటిన నేపథ్యంలో రానున్న నెలల్లో డబ్ల్యుపిఐ మరింత తగ్గవచ్చని బార్క్‌లేస్ అంచనా వేసింది. అయితే జులైలో నమోదైన తగ్గుదల విస్తృతంగా కనిపించలేదని ఐసిఆర్ఎ అభిప్రాయపడింది. కాగా, రిటైల్ ద్రవ్యోల్బణానికి ఈ ధోరణి భిన్నంగా ఉంది. ఆహార ధరల ఒత్తిడితో జులైలో వినియోగదారుల ద్రవ్యోల్బణం 4.45 శాతానికి పెరిగింది. వచ్చే నెలల్లో డబ్ల్యుపిఐ 9.5 శాతం దిగువకు రావచ్చని ఐసిఆర్ఎ అంచనా వేసింది.

విదేశీ ఆస్తులు వెల్లడించాల్సిందే..

ఆదాయపు పన్ను శాఖ చిన్న పన్ను చెల్లింపుదారుల కోసం ఎఫ్ఎఎస్‌టిడిఎస్ అనే స్వచ్ఛంద విదేశీ ఆస్తుల వెల్లడి పథకాన్ని తీసుకొచ్చింది. ఆగస్టు 16 నుంచి డిసెంబర్ 31, 2026 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో వెల్లడించని విదేశీ ఆస్తులు లేదా ఆదాయంపై 30 శాతం పన్నుతో పాటు అంతే మొత్తాన్ని అదనంగా చెల్లించాలి. అంటే మొత్తం భారం 60 శాతంగా ఉంటుంది. రూ.1 కోటి వరకు విలువైన వెల్లడించని ఆస్తులు లేదా ఆదాయానికి ఈ పథకం వర్తిస్తుంది. ఇప్పటికే పన్ను చెల్లించినా రిటర్న్‌లో చూపించని, లేదా ప్రవాసిగా ఉన్నప్పుడు సంపాదించిన ఆస్తులకు రూ.5 కోట్ల వరకు అవకాశం ఉంది. చెల్లుబాటయ్యే ప్రకటనలకు తదుపరి పన్ను, జరిమానా, క్రిమినల్ చర్యల నుంచి మినహాయింపు లభిస్తుంది.

లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

హనుమకొండలో...

నస్పూర్ పట్టణ షిర్కే సెంటర్‌లో..

నల్లగొండలో..

కరీంనగర్‌లో..

స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టులది మహత్తర పాత్ర : తక్కళ్లపల్లి
సిపిఐ కార్యాలయాల్లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/ విలేకరుల బృందం

దేశ స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల మహత్తర పాత్ర ఉందని, అందరి త్యాగాలతో సిద్ధించిన స్వాతంత్ర్య భారతంలో లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం లో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపి ఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ జెం డాను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది మహనీయుల త్యాగం వల్లే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, భారతదేశ స్వాతంత్ర్య పోరాటా న్ని, చరిత్రను దొంగలించేందుకు ఆర్ఎస్ఎస్, బిజెపి లు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టులు మహత్తర పాత్ర పోషించారని,ఆ పోరాటంలో అమరులైన మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లే ష్, జిల్లా నాయకులు ఎస్ఎ స్టాలిన్, మునిగాల బిక్షపతి, ఎదునూరి వెంకట్రా జం, బాషబోయిన సంతోష్, మాలోత్ శంకర్ నాయక్, శ నిగరపు రాజు కుమార్, గుంటీ రాజేందర్, ఉట్కూ రి ప్రణీ త్ గౌడ్, అలువాల రాజు, పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, కోడెపాక బాబు, మామునూరి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల సంక్షేమంలో ప్రభుత్వాల వైఫల్యం : కలవేన

దేశంలోని అట్టడుగు, బడుగు బలహీన వర్గాలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ విమర్శించారు. శనివారం నస్పూర్ పట్టణ షిర్కే సెంటర్‌లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మిర్యాల రాజేశ్వరరావు, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, నాయకులు లింగం రవి, మేకల దాను, రేగుంట చంద్రశేఖర్, కొట్టే కిషన్ రావు, దొడ్డిపట్ల రవీందర్, జోగులాంజనేయులు, కోడి వెంకటేష్, అల్లా లచ్చిరెడ్డి, కంచపోషం, గుడెల్లి రాజయ్య, ఎండి రషీ ద్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం: నెల్లికంటి

ప్రజాస్వామ్య, లౌకిక భారతదేశాన్ని పరిరక్షించేందుకు ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు, కమ్యూనిస్టులు ఐక్యంగా మరో పోరాటానికి సిద్ధం కావాలని నల్లగొండ సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లగొండలోని సిపిఐ జిల్లా కార్యాలయం మగ్ధుమ్ భవన్‌లో శనివారం సిపిఐ సినియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ప ల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్,జిల్లా కార్యవర్గ స భ్యులు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి కర సైదిరెడ్డి, శాంతి సంఘం జిల్లా అధ్యక్షుడు జిల్లా యాదయ్య,నాయకులు ముండ్ల ముత్యాలు,కోమటిరెడ్డి ప్రద్యుమ్నారెడ్డి, ఎం.డి. యూసుఫ్, బరిగెల వెంకటేష్, రెవల్లి యాదయ్య, గుండె రవి, వెంకన్న, నరేందర్, యాదగిరి, సుజాత, ధనలక్ష్మి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల బతుకులు మారడం లేదు : పంజాల

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 79 సంవత్సరాలు గడిచి 80వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నా దేశంలో పేదల బ్రతుకులు మారడం లేదని,పాలకులు అందించే సం క్షే మ పథకాలు అందరికీ అందడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను శ్రీనివాస్ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కే దారి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ స భ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,బండ రాజిరెడ్డి,పైడిపల్లి రాజు, కొట్టె అంజలి, మచ్చ రమేష్,బూడిద సదాశివ, శాఖ కార్యదర్శులు చెంచల మురళి,కసిబొజుల సంతోష్ చారి, చిందం మల్లయ్య,నునావత్ శ్రీనివాస్,మామిడిపల్లి హేమంత్ కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందినప్పుడు నిజమైన స్వాతంత్ర్యం : సిహెచ్ రాజారెడ్డి

స్వాతంత్ర్య ఫలాలు అందరికి అందినప్పుడు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని జనగామ మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి అన్నారు. 80వ స్వా తంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శనివారం జనగామలోని సిపిఐ కార్యాలయంలో జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, జనగామ పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, జిల్లా నాయకులు మోటే శ్రీశైలం, చామకూర యాకూబ్; యాదలక్ష్మి, భూమళ్ల ఐలయ్య, ఐలయ్య, సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

బిజెపి పాలన నుంచి విముక్తి పొందినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం : బెజవాడ వెంకటేశ్వర్లు

బిజెపి పాలన నుంచి విముక్తి పొందినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని సూర్యపేట సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవనంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సం దర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, కార్యవర్గ స భ్యులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, అనంతుల మల్లేశ్వరి, రేగటి లింగయ్య, దీకొండ శ్రీనివాస్, ఎడెల్లి శ్రీకాంత్, బూర సైదులు, కప్పల రాము, మల్లికార్జున్ రెడ్డి, నరేష్ యాదవ్, ఐతరాజు లింగయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఆటో యూనియన్ ఆధ్వర్యంలో

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భువనగిరిలోని సిపిఐ జిల్లా కార్యాలయం వద్ద ఎఐటియుసి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో స్వర్ణగిరి (ఎల్లమ్మ గుడి) వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్ యేశాల అశోక్, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు భూషిపాక నరసింహ, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, మండల కార్యదర్శి దాసరి లక్ష్మ య్య, చిక్క నరసయ్య, స్వర్ణగిరి ఆటో యూనియన్ అధ్యక్షులు నీరుడు శేఖర్, చింతల మల్లేష్, ఎండి షరీఫ్, సాయి, అశోక్, మల్లేష్, రవి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతను కాపాడేందుకు యువత ముందుకు రావాలి : చెన్న విశ్వనాథం

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సిపిఐ భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫీస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, సిపిఐ సీనియర్ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి సుతారి రాములు, సిపిఐ నాయకులు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

రాజ్యాంగ పరిరక్షణ, ప్రజా హక్కుల సాధనకు కదలాలి : రామడుగు లక్ష్మణ్

రాజ్యాంగ పరిరక్షణ, అణగారిన వర్గాల ప్రజాస్వామిక హక్కుల సాధన కోసం శ్రామిక వర్గం ఐక్య పోరాటాలు నిర్మించాలని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు.
80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా పార్టీ కార్యాలయం వద్ద ఆయ న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవెన శంకర్, రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు, పార్టీ ప్రజాసంఘాల నాయకులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనగామలో..

సూర్యపేటలో..

యాదాద్రి భువనగిరిలో..

జగిత్యాలలో..

మంచిర్యాలలో..

కొత్త కోర్టుల నిర్మాణానికి చర్యలు

కోర్టు సేవల్లో సాంకేతికతకు పెద్ద పేట
గత ఏడాది 88.5 శాతం కేసుల పరిష్కారం
స్వాతంత్ర్య వేడుకల్లో హైకోర్టు సిజె జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజలకు నాణ్యమైన, సత్వర న్యాయం అందించడంతోపాటు కేసుల పెండెన్సీని తగ్గించేందుకు న్యాయవ్యవస్థ నిరంతరం కృషి చేస్తున్నదని హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదుల సమిష్టి కృషితోనే వేగవంతమైన, నాణ్యమైన న్యాయం సాధ్యమవుతుందన్నారు. గత ఏడాది హైకోర్టులో 90,357 కేసులు దాఖలు కాగా, 80,020 కేసులను పరిష్కరించామని, పరిష్కార రేటు 88.5 శాతంగా ఉందని వెల్లడించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం హైకోర్టులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో సీజే మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను దేశ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకోవాలని, స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. న్యాయవ్యవస్థలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని సీజే తెలిపారు. రాజేంద్రనగర్‌లో నిర్మిస్తున్న కొత్త హైకోర్టు సముదాయంలోని జోన్–2కు ఏప్రిల్ 5న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి శంకుస్థాపన చేశారని, ప్రస్తుతం నిర్మాణ పనులు 20.25 శాతం పూర్తయ్యాయని చెప్పారు. అశోక్‌విహార్ సమీపంలోని హైకోర్టు గెస్ట్ హౌస్‌లో సాంస్కృతిక కేంద్రం నిర్మాణం తుది దశకు చేరుకుందని, సీనియర్ న్యాయవాదులు, ఇతర న్యాయవాదుల కోసం 32 లా ఛాంబర్లను కేటాయించామని తెలిపారు. ప్రాధాన్యమిచ్చిన 13 జిల్లా కోర్టు సముదాయాల్లో 11 చోట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో కోర్టు భవనాలు, న్యాయాధికారుల నివాసాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.751.45 కోట్లు కేటాయించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూ.26.31 కోట్లను మంజూరు చేసిందన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకం కింద 43 కోర్టు హాళ్లు, 37 నివాస క్వార్టర్లతో కూడిన 18 ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర పథకం కింద ఎనిమిది కొత్త కోర్టులను ప్రారంభించినట్లు వెల్లడించారు. కోర్టు సేవల్లో సాంకేతికత వినియోగాన్ని విస్తరిస్తున్నామని జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ తెలిపారు. హైకోర్టు, జిల్లా కోర్టుల్లో ఈఫైలింగ్‌తోపాటు ఇతర డిజిటల్ సేవలను విస్తరించామని చెప్పారు. ఎం స్టెప్ పోర్టల్‌ను ఐసీజేఎస్‌తో అనుసంధానించి క్రిమినల్ ప్రాసెస్‌లు, సమన్లను పోలీసులకు ఎలక్ట్రానిక్ విధానంలో తక్షణమే పంపించే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. సిఐఎస్ 4.0ను ఈప్రిజన్స్, తెలంగాణ పోలీస్ సీసీటీఎన్ఎస్‌తో అనుసంధానించే ప్రక్రియ కొనసాగుతున్నదన్నారు. ఈకోర్టు ప్రాజెక్టు మూడో దశలో రూ.87.50 కోట్ల బడ్జెట్‌కు గాను రూ.63.86 కోట్లు వినియోగించినట్లు వివరించారు.

పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

రంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/రంగారెడ్డి: ప్రజలకు నిత్యావసర సరుకులను పారదర్శకంగా,సులభంగా అందించడంతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పటిష్టం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ప్రమిద కన్వెన్షన్‌లో నిర్వహించిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా నూతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.కార్డులో క్యూఆర్ కోడ్‌తో పాటు ఆధార్ ఆధారిత వివరాలు,కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను డిజిటల్ విధానంలో పొందుపరుస్తున్నట్లు చెప్పారు.రేషన్ సరుకులను లబ్ధిదారులు ఎప్పుడు, ఎంత పరిమాణంలో తీసుకున్నారనే వివరాలు కూడా డిజిటల్‌గా నమోదు కావడంతో పంపిణీ ప్రక్రియలో పారదర్శకత మరింత పెరుగుతుందని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలు, అవకతవకలకు తావులేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.కొత్తగా రేషన్ కార్డులు పొందిన కుటుంబాలతో పాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో అర్హులైన కుటుంబ సభ్యుల పేర్లను చేర్చుకునే అవకాశం కల్పిస్తూ ప్రతి అర్హుడికి ఆహార భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు

అనంతరం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా చర్యలు రంగారెడ్డి జిల్లాలో సుమారు 6.75 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. వీటి పరిధిలో సుమారు 1.12 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారని పేర్కొన్నారు. కొత్తగా కుటుంబ సభ్యుల వివరాలను రేషన్ కార్డుల్లో నమోదు చేయడం, అర్హులైన కుటుంబాలను చేర్చడం ద్వారా జిల్లాలో సుమారు 1.06 లక్షల మంది కొత్త లబ్ధిదారులు చేరారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, అరికెపూడి గాంధీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి,ప్రజా ప్రతినిధులు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు వనజాత, హరీష్, సంబంధిత శాఖల అధికారులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు

ప్రజలు తిప్పికొట్టాలి : మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: స్వాతంత్ర్య చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం వంటి విలువలను పరిరక్షించుకోవాలని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లో శనివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.జితేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురువేశారు. అనంతరం ఆయన స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం ఒక్కరోజులో రాలేదని, మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్‌లాంటి మహనీయులతో పాటు లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛ అని అన్నారు. బిజెపి తన రాజకీయ లబ్ధి కోసం స్వాతంత్ర్య సమర చరిత్రను వక్రీకరించడం సరికాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. మతం, కులం, ప్రాంతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించే రాజకీయాలకు కాంగ్రెస్ వ్యతిరేకమని స్పష్టం చేశారు. దేశ ప్రజలందరినీ కలుపుకుని ముందుకు సాగడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ పోషించిన చారిత్రక పాత్రను యువతకు వివరించాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సేవాదళ్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

ప్రజాపక్షం/హైదరాబాద్:కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే బహిరంగంగా వెల్లడిస్తున్నారన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ ప్రాంగణంలో జాతీయజెండాను కెటిఆర్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీని రాహుల్ గాంధీ, ఏఐసీసీకి ఏటీఎంగా మార్చుకున్నారని ఆరోపించారు. తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా తెలంగాణ రాష్ట్రం ఎఐసీసీకి ఏటీఎంగా మారిందని ఆరోపిస్తున్నప్పటికీ, దీనికి సంబంధించిన విచారణను ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ప్రధాని ఆరోపణల్లో వాస్తవం ఉంటే కేంద్ర దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, నిజాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు నిర్వహించిందని, కానీ ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని పదేపదే చెప్పుకుంటున్నారని, కానీ ఆయన తెలంగాణ రాష్ట్రం కోసం పని చేయడం లేదని, తమ కుటుంబ సభ్యులు, కాంట్రాక్టులు, నిధులు దోచిపెట్టేందుకే పని చేస్తున్నారని కెటిఆర్ ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో అవమానం జరిగినా, ఆత్మగౌరవంపై దాడి జరిగితే యువత సహజంగానే తిరగబడుతుందని, తమ హక్కులు, గౌరవం కోసం ధైర్యంగా నిలబడిన నల్సర్ విద్యార్థులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

మత్స్యకార సహకార సంఘాలకు
త్వరగా ఎన్నికలు నిర్వహించాలి : హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రాథమిక, జిల్లా మత్స్యకార సహకార సంఘాలకు వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. సహకార సంఘాల చట్ట నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి నూతన పాలక మండళ్లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. ఈ సంఘాలకు పర్సన్ ఇన్‌ఛార్జిలను లేదా నామినేటెడ్ బాడీలను నియమించకూడదని పేర్కొంది. మత్స్యకార సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలంటూ జులైలో సమర్పించిన వినతిపత్రంపై అధికారులు చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ ములుగు జిల్లాకు చెందిన ఎస్.రఘుతో పాటు పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నంద ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్లు సమర్పించిన వినతిపత్రాలను పరిగణనలోకి తీసుకుని సహకార సంఘాల చట్టం ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తదుపరి పిటిషన్‌పై విచారణ అవసరం లేదని పేర్కొంటూ కేసును ముగించారు.

కెసిఆర్ కంటే ఎక్కువ రైతుబంధు ఇస్తే రాజీనామా చేస్తా

మాజీ మంత్రి హరీష్‌రావు

ప్రజాపక్షం/ సిద్దిపేట : స్వాతంత్ర్యదినోత్సవం రోజున సైతం పచ్చి అబద్ధాలను సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని.. దేవుడి మీద ఒట్టేసి అబద్దాలు చెపుతున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు ఫైర్ అయ్యారు. కెసిఆర్ కంటే రైతుబంధును పెంచి ఇచ్చినట్లు సంగారెడ్డి సభలో చెప్పారని, దేవుడిమీద ఒట్టేసి రైతులను సిఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని విమర్శించారు. కెసిఆర్ కంటే రైతుబంధు ఎక్కువ ఇస్తే తాను రాజీనామా చేస్తానని, లేకుంటే సిఎం రేవంత్‌రెడ్డి రాజీనామాకు సిద్ధమా అన్ని సవాల్ చేశారు. సిద్ధిపేట జిల్లా కేంద్రంలో క్యాంపు కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు సిఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 420 హామీలు ఇచ్చారని సంగారెడ్డి సభలో సిఎం రేవంత్‌రెడ్డి 4.20 నిమిషాలకు ప్రసంగం ప్రారంభించి పూర్తిగా 420 మాటాలే మాట్లాడరన్నారు. కెసిఆర్ ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సాగునీరు, విద్యుత్ గురించి మాట్లాడేవారని, కాని రేవంత్‌రెడ్డి ఒక్క అభివృద్ధి గురించి మాట్లాడలేదన్నారు. అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 6.47.479 లక్షల కార్డులు ఇచ్చినట్లు అసెంబ్లీగా సాక్షిగా చెప్పారని, ఇప్పుడు పబ్లిక్ మీటింగ్‌లో బిఆర్ఎస్ ఒక్క కార్డు ఇవ్వలేదని పచ్చి అబద్దాలు చెపుతున్నారని విమర్శించారు. అసెంబ్లీలో తానే అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం 16వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పారని, ఇప్పుడేమో 70వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు అబద్దాలు చెపుతున్నారన్నారు. నిరుద్యోగులను మోసం చేసినందుకు సిఎం రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత రెండున్నర ఏళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండ 30 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసినట్లు తెలిపారు. కెసిఆర్ 2022–23లో 14.743 కోట్లు ఇస్తే, 2425లో సిఎం రేవంత్‌రెడ్డి 5557 కోట్లు ,2526లో 11వేల కోట్లు మాత్రమే ఇచ్చినట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డి రెండు అర్థిక సంవత్సరాల్లో 15వేల కోట్లు ఎగ్గొట్టారన్నారు. అసెంబ్లీలో 35వేల కోట్లు రుణమాఫీ చేస్తానని చెప్పి కేవలం 20వేల కోట్లు మాత్రమే మాఫీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏ గ్రామంలో పూర్తిగా రుణమాఫీ జరిగితే తాను రాజీనామా చేస్తానని లేకుంటే సిఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏక్కడ కూడ 24 గంటల ఉచిత విద్యుత్ రావటం లేదని తాను సబ్‌స్టేషన్లు పరిశీలిస్తే ఎక్కడ కూడ 10 నుండి 11 గంటలు రావటం లేదన్నారు. రేవంత్‌రెడ్డికి ధైర్యం ఉంటే అసెంబ్లీ సమావేశాలు పెట్టాలని, అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు సిఎం భయపడుతున్నారని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డికి ప్రజలు సరైన సమయంలో గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి హరీష్‌రావు జోస్యం చెప్పారు. ఈసమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, బిఆర్ఎస్ నేతల ఎల్లారెడ్డి,భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక భారతానికి పునాదులు వేసింది కాంగ్రెస్ పార్టీ

ప్రజాపక్షం/హైదరాబాద్: స్వాతంత్ర్యం అనంతరం కాంగ్రెస్ పార్టీయే ఆధునిక భారతదేశ నిర్మాణానికి పునాదులు వేసిందని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపి డాక్టర్ జి. సంజీవరెడ్డి అన్నారు. ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య వ్యవస్థలను బలహీనపరుస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందని విమర్శించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నారాయణగూడలోని ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యాలయంలో సంజీవరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో పారిశ్రామిక, ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుతో పాటు రాజ్యాంగ ప్రజాస్వామ్యం, అలీన విదేశాంగ విధానానికి కాంగ్రెస్ ప్రభుత్వాలు పునాదులు వేశాయని తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లక్డీకాపూల్‌లోని డిజిపి కార్యాలయంలో షానవాజ్ ఖాసిం, ఐజి మల్టీ జోన్2 జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐజి రమణ కుమార్, జె.అన్యోన్య, ఎఐజి (అడ్మిన్), ఎస్‌పి (లీగల్) సతీష్, సిఎస్‌ఓ యోగేశ్వర్ రావు సిబ్బంది పాల్గొన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పేట్ల బురుజులోని సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. చంచల్ గూడలో జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా జాతీయ జెండాను ఎగురవేశారు. రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ వేడుకల్లో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, దక్షిణ మధ్య రైల్వే ఇన్‌స్పెక్టర్ జనరల్ కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్‌లు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ సివిల్ డిఫెన్స్ శాఖ ప్రధాన కార్యాలయంలో, అలాగే వట్టినాగులపల్లిలోని రాష్ట్ర శిక్షణా అకాడమీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జి.వి.నారాయణ రావు ప్రధాన కార్యాలయంలో, రాష్ట్ర శిక్షణా అకాడమీలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

వచ్చే వారం తేలికపాటి వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా వచ్చే వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆదివారం నుంచి శనివారం వరకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు. వచ్చే మంగళవారం నుంచి శనివారం వరకు కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆటో యూనియన్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఉమర్ ఖాన్

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆటో యూనియన్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఉమర్ ఖాన్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరింత ఐక్యంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. డ్రైవర్ల హక్కులు, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని వివిధ ఆటో స్టాండ్‌లలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమర్ ఖాన్ మాట్లాడుతూ తెలంగాణలో ఆటో డ్రైవర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరుగుతున్న ఇంధన ధరలు, ఆర్థిక భారం, ట్రాఫిక్ పోలీసుల తనిఖీల పేరుతో ఎదురవుతున్న ఇబ్బందులు, పెరిగిన జీవన వ్యయంతో ఆటో డ్రైవర్లు తమ కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వారికి ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఉమర్ ఖాన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎండి ఆరిఫ్, ఎస్‌కె లతీఫ్, నరసింహ, అబ్బు బాయ్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుల స్వేచ్ఛా ఫలమే స్వాతంత్ర్యం

వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి

ప్రజాపక్షం/హైదరాబాద్ : స్వాతంత్ర్య సమరయోధులు తమ త్యాగాలు, పోరాటాల ద్వారా వారు సాధించిన స్వేచ్ఛా ఫలమే మన దేశ స్వాతంత్ర్యమని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి అన్నారు. శనివారం వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం వ్యవసాయ రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించామన్నారు. ఆధునిక సాగు సాంకేతికతను వ్యవసాయంలో అనుసంధానం చేస్తూ, రైతుల పెట్టుబడి ఖర్చులను తగ్గించడం, ఉత్పాదకతను పెంచడం, రైతుల ఆదాయాన్ని పెంపొందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా నిరంతరం సేవలందిస్తున్న వ్యవసాయ శాఖలో విధి నిర్వహణలో నిబద్ధత, ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా ప్రశంసించారు. విశేష సేవలందించిన సంబంధిత జిల్లాలు, విభాగాలకు, అధికారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేసి అభినందించారు.వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పని చేస్తూ రైతుల సంక్షేమానికి మరింతగా కృషి చేయాలని వ్యవసాయ సంచాలకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిషనరేట్ కార్యాయం అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గవర్నర్ తేనీటి విందు

ప్రజాపక్షం/హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో శనివారం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తేనీటి విందునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార సింగ్, మంత్రులు , ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు. గవర్నర్ పలువురి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలుకరించారు.

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఎమ్మెల్సీ కోదండరామ్

ప్రజాపక్షం/హైదరాబాద్: స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిజెఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని టిజెఎస్ రాష్ట్ర కార్యాలయ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు ఎం.నర్సయ్యగౌడ్, నిజ్జన రమేష్ ముదిరాజ్, హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రిటన్ రాజు బహిరంగ క్షమాపణ చెప్పాలి : కల్వకుంట్ల కవిత

ప్రజాపక్షం/హైదరాబాద్: రెండు వందల ఏళ్ల పాటు భారతీయులపై చేసిన అఘాయిత్యాలకు బ్రిటన్ రాజు బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని టిఆర్ఎస్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆమె శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఎంతో మంది పూర్వీకులు స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో జరిగిన పోరాటాన్ని పిల్లలకు వివరించాలని సూచించారు.

దేశభక్తి, జాతీయ సమైక్యతను కాపాడాలి

ఎన్. రాంచందర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిజెపి రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, ఎంపి ఈటల రాజేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఆర్థిక, మౌలిక వసతులు, రక్షణ, అంతరిక్ష రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు పలు అభివృద్ధి ప్రాజెక్టులు అందించిందని తెలిపారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను ప్రతి పౌరుడు కాపాడాలని పిలుపునిస్తూ, రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

ప్రజాపక్షం/నవాబుపేట : నవాబుపేట్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సామ వెంకట్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు జెండా వందనం నిర్వహించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన పోరాటం, త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని నాయకులు పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, యూత్ ప్రెసిడెంట్ తలారి శేఖర్,మండల సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, కుమ్మరిగూడెం సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, యావాపూర్ లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యూఐ నాయకులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కీసరలో : కీసర సర్కిల్ ఆఫీస్ నందు 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూ టీ కమిషనర్ రామలింగం జాతీయ జెండాను ఆవిష్కరించి, సిబ్బందికి ప్రజలకు స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో డి.ఇ. సంతోష్,లు చంద్రశేఖర్, గంగన్నలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డ్ ఆఫీసర్లు, ఆపరేటర్లు, సర్కిల్ సిబ్బంది విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..

ప్రజాపక్షం/జవహర్ నగర్ : జవహర్ నగర్ పరిధిలోని మల్కారం కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మహమ్మద్ నూరుద్దీన్ ఫారూఖ్ జాతీయ జెండాను ఆవిష్కరించి, త్రివర్ణ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం చైర్మన్ మహమ్మద్ నూరుద్దీన్ ఫారూఖ్ మాట్లాడుతూ, ఎందరో మహానుభావుల త్యాగాలు, అభంగ పోరాటాల ఫలితమే మనకి లభించిన ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని కొనియాడారు. స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టతను దేశంకోసం ప్రాణాలర్పించిన అమరవీరుల చరిత్రను నేటి తరం పిల్లలకు, వారి తల్లిదండ్రులకందరికీ తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవర్చుకుని, నిబద్ధతతో, శ్రద్ధగా చదువుకుని సమాజంలో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ ఎండి షహబాజ్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో ప్రముఖులు అబ్బు బాయ్, రమేష్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు స్థానిక పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

లక్ష్మి అంబులెన్స్ సేవలు ఆదర్శనీయం

అడిషనల్ డిసిపి వెంకటరమణ

ప్రజాపక్షం/చర్లపల్లి: ఎలాంటి లాభాపేక్ష లేకుండా మృత దేహాలను తరలిస్తూ కమిషనరేట్ పరిధిలో సేవలందిస్తున్న లక్ష్మి అంబులెన్స్ సేవలు ఆదర్శనీయమని ఉప్పల్ అడిషనల్ డిసిపి వెంకటరమణ అన్నారు. క్షత్రియ సేవా సమితి వారు సమకూర్చిన నూతన అంబులెన్స్‌ను శనివారం కాప్రా తహసీల్దార్ మతిన్, కుషాయిగూడ సిఐ భాస్కర్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. అనాథల మృతదేహాలను తన అంబులెన్స్‌లో ఉచితంగా తరలిస్తూ మానవతా దృక్పథాన్ని చాటుతున్న సునీల్ వర్మ సంకల్పం గొప్పదని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపాలిటీలలో

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

ప్రజాపక్షం/శామీర్‌పేట: ఉమ్మడి శామీర్‌పేట మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించి సంబరాలు జరుపుకున్నారు. శామీర్‌పేటలోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద జిల్లా అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణి చేశారు. మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ జాం రవి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంసిపల్లి తహాశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహ్మద్ గులాం ఇద్రిస్ జెండాను ఆవిష్కరించారు. అలియాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడిడ త్రివర్ణ పతకాన్ని ఆవిష్కరించారు. శామీర్‌పేట తహాసీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. శామీర్‌పేటలో సిపిఐ మండల కార్యద ర్శి డిజి నరేంద్ర ప్రసాద్ జాతీయ జెండాను ఎగురవేశారు. మండల వ్యవసాయ కార్యాలయంలో ఎఒ రమేష్, వివిధ కార్యాలయాల వద్ద వేడుకలను జరుపుకుని స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలపై చర్చ జరగాలి

స్పీకర్ ప్రసాద్‌కుమార్

ప్రజాపక్షం /వికారాబాద్ : తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై మీరందరూ చర్చించుకోవలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం నాడు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిజిటల్ రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ హాజరై మాట్లాడుతూ ల్యామినేటేడ్, స్మార్ట్ కార్డు ఇస్తే లబ్దిదారులకు లాభం చేకూరుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. స్మార్ట్ కార్డు వల్ల లబ్దిదారులు ఎక్కడ ఉన్న రేషన్ షాపు ద్వారా సన్న బియ్యం తీసుకోవచ్చున్నారు. కడుపులో ఉన్న పిల్ల పుట్టి వరకు తిండి, బట్టలు, స్కూల్ ఇస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలకు భారీగా నిధులను మంజూరు చేస్తుందన్నారు. నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిదులు మంజూరు అవుతున్నాయన్నారు. 20మండలాలల్లో 400మందికి కి రేషన్ కార్డులు పంపిణీ చేయ డం జరుగుతుందన్నా రు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి , మనోహర్ రెడ్డి , ఇల్లా కలెక్టర్ దీపక్‌తివారి , జిల్లా ఎస్‌పిస్నేహమెహ్రా, అదనపు కలెక్టర్లు ఉమా శంకర్‌ప్రసాద్, వెంకటచారి, జెడ్పి సిఈఓ సుధీ ర్, ఎస్ఎప్‌సి రంగరాజు, మున్సిపల్ చైర్మన్ సుదాకర్ రెడ్డి ఆర్‌డిఓ వాసుచంద్ర ,తదితరులు పాల్గొన్నారు.

త్రివర్ణ పతాకం ఆవిష్కరణ

కలెక్టర్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడు కలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్పీకర్ ప్రసాద్‌కుమార్, జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి, జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రాతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను సాకా రం చేయాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో జిల్లా లో మొత్తం 2లక్షల 65 వేల ప్రజాపాలనద రఖాస్తులు అంద గా, ఇప్పటివరకు 2లక్షల 51వేల దరఖాస్తులు సర్వే పూర్తి యింది. మంజూరైన ఇండ్లలో 9వేల 101 ఇండ్లకు వేయగా 7వేల 869ఇందిరమ్మ వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. ఇప్పటివరకు 2వేల 97 ఇండ్లు నిర్మాణం పూర్తయింది. మహిలక్ష్మి పథకం ద్వారా మహిళలకు కోట్ల రూపాయల మేర లబ్దిచేకురింది. జిల్లా వ్యప్తంగా నూతనంగా 43వేల 589 కొత్త రేషన్ కార్డులు జారీ చేసి 1లక్షా62వేల యూనిట్లకు అదనపు రేషన్ మంజురు చేయడం జరిగిందన్నా రు. మహిళల ఆర్థిక సాధికారత కోసం 19మండల మహిళా సమఖ్యల ద్వారా 19 బస్సులు కొనుగోలు చేసి ఆర్టిసికి అద్దెకు ఇవ్వడం జరిగిందని, కోటొపల్లిమండలం బర్వద్ గ్రామంలో 10ఎకరాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ నిర్మాణం పూర్తిచేయడం జరిగిందన్నారు. జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.

ప్రగతిపథంలో మేడ్చల్ జిల్లా

స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు

కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ

ప్రజాపక్షం/మేడ్చల్‌మల్కాజిగిరి/మల్కాజిగిరి/ఉప్పల్: 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్, ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రాజకీయ పార్టీ కార్యాలయాలు, సంఘసేవా సంస్థలు, కార్మిక సంఘాలు, బస్తీ, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, ప్రజా కూడళ్లు, కమ్యూనిటీ హాళ్లల్లో అధికారులు,ప్రజా ప్రతినిధులు, నేతలు పతాకావిష్కరణ గావించి స్వతంత్ర సమర యోధులను స్మరించుకొన్నారు. కలెక్టరేట్‌లో... జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పబ్లిక్ అఫైర్స్) డా.కె. కేశవరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేసి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా ప్రగతిని వివరించారు. అనంతరం స్వాతంత్ర సమర యోధులైన జానాబాయ్, రాజారెడ్డిలను శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో కీసర ఎంజిపిటిబిసి, శామీర్‌పేట, మేడిపల్లి జడ్‌పిహెచ్ఎస్, ఉప్పల్ టిజిఎంఆర్ పాఠశాలలు, గిరిజన హాస్టళ్లకు చెందిన విద్యార్థినీ విద్యార్థినులు వివిధ అలంకరణలతో చేసిన నృత్యాలు, వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకొన్నాయి.

సిపిఐ కార్యాలయంలో... ఈసిఐఎల్‌లోని సిపిఐ కార్యాలయం నీలం రాజశేఖరరెడ్డి భవన్ వద్ద పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వివిఎస్ బోస్ జాతీయ పతాకాన్ని ఎగురవేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు, సుభాష్ చంద్రబోస్,అల్లూరి సీతారామరాజులాంటి స్వతంత్ర సమర యోధుల త్యాగాల స్ఫూర్తితో వారు కలలు కన్న సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య లౌకికతతో కూడిన భారతదేశ నిర్మాణానికి పునరంకితం కావాలని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు నారా నర్సింహ, ఏఐవైఎఫ్ కార్యదర్శి సత్యప్రసాద్, ఏఐటియుసికి చెందిన మోహన్, బాలమురుగన్, గిరిబాబు, రాజ్‌కుమార్, సుదర్శన్, ప్రతాప్, మోసిన్, శ్రీనివాస్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సిపిఐ ఆధ్వర్యంలో జగద్గిరి గుట్ట, ఐడిపిఎల్, రాజీవ్ గృహకల్ప, మగ్ధూం నగర్, లెనిన్ నగర్, షాపూర్ నగర్ తదితర ప్రాంతాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శులు హరినాథ్‌రావు, రాములు, ఎఐటియుసి కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్య మండలి గౌరవ అధ్యక్షులు ప్రవీణ్, సిపిఐ నాయకులు సదానంద్, సహదేవ్‌రెడ్డి, సామేల్, రవి, రాములు, చందు, కుమార్, తదితరులు పాల్గొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, సమానత్వంకోసం ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.

జవహర్ నగర్‌లో: జవహర్ నగర్ మున్సిపల్ ఆఫీస్ పక్కన ఉన్న సిపిఐ స్థలంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగరేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజల హక్కుల సాధనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నర్సింలు, ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి వి.వెంకటాచారి, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, ఏఐటియుసి మండల అధ్యక్షులు ఏ.ఎల్లయ్య, పార్టీ నాయకులు వి.రవి నాయక్, భాస్కరరావు, కే.జయమ్మ, సిహెచ్.మాధవి,డి.మల్లిక తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో : స్వాతంత్ర్య దినోత్సవేడుకలను పురష్కరించుకుని శనివారం తాండూరు పట్టణంలోని భద్రేశ్వర చౌక్ వద్ద జాతీయ పతాకావిష్కరణ సిపిఐ జిల్లా కార్యదర్శి విజయక్ష్మి పండిత్ ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి పిసిఐ మాజీ జిల్లా కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి కార్యదర్శి రవీందర్, మునీర్ ఆహ్మద్, సలాం, విజయ్, దస్తప్ప, రాజు, బుగ్గప్ప, పెంటప్ప, ఆహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఎపిఒ లక్ష్మీదేవికి ఉత్తమ పురస్కారం

ప్రజాపక్షం/నవాబుపేట్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నవాబుపేట్ మండల ఎంఎన్ఆర్ఈజీఎస్‌లో ఉత్తమ సేవలు అందించినందుకు ఏపీఓ లక్ష్మీదేవికి ఉత్తమ పురస్కా రం లభించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఎపిఒ లక్ష్మీదేవి పురస్కారా న్ని అందుకున్నారు. మండలం లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సమర్థవంతంగా అమలు చేయడం, కూలీలకు ఉపాధి కల్పించడం, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించడం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులను నిర్వహించడంలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు, ఎంఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఎపిఒ లక్ష్మీదేవిని అభినందించారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్‌లో మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని లక్ష్మీదేవి పేర్కొన్నారు.

పలు ప్రాంతాల్లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



బాచుపల్లిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కొలను హన్మంత రెడ్డి

నిజాంపేట్, ఆర్‌జికెలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి

స్వాతంత్ర్య సమర యోధుల చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కొలను రాజశేఖర్ రెడ్డి

జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఆగం రాజు

చర్లపల్లిలో

ఇసీఐఎల్ లో సిఎండి కోమల్‌కపూర్,కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో సిఐ భాస్కర్‌రెడ్డి, చర్లపల్లి సిఐఏ భవనంలో డిసిరెడ్డి, నాగారం సెరినిటీ పాఠశాలో స్కూల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, కుషాయిగూడలో సర్వతి శిశుమందిర్‌లో త్రివర్ణ పతాక వేడుకలు

మేడ్చల్‌లో

కబ్జాలకు పాల్పడుతున్నారనడం విడ్డూరం

డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : భూ కబ్జాలకు పాల్పడుతున్న మల్లారెడ్డి కాంగ్రెస్ నాయకులు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని అనడం విడ్డూరంగా ఉందని డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ విమర్శించారు. శనివారం శామీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నక్క సందీప్‌గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బొమ్మరాశిపేట గ్రామ రైతుల భూములను కబ్జాలకు పాల్పడుతున్నామని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు చేసిన వ్యాఖ్యలపై డిసిసి వజ్రేష్‌యాదవ్ ఘాటుగా స్పందించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీవు మంత్రిగా ఉన్నప్పుడే బొమ్మరాశిపేట భూములు రైతుల భూములు కావని జీవో ఇచ్చింది మీరు కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా గెలిచి 12 సంవత్సరాలు గడుస్తున్న నిరుపేదలకు జరుగుతున్న అన్యాయాలపై ఏనాడైనా స్పందించావా అని నిలదీశారు. ఎమ్మెల్యేగా ఉండి నిరుపేదల భూములు, చెరువులు, కుంటలు, దళితుల భూములు కబ్జా చేశావని ఆరోపించారు. గుండ్లపోచంపల్లిలో దళితుల భూమిని కబ్జా చేసి రోడ్డు వేస్తే మా కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టి కబ్జాను అడ్డుకున్నారని గుర్తుచేశారు.

తన పేరుపైన, మా కుటుంబ సభ్యుల పైన ఎక్కడైనా భూములు కబ్జాలకు పాల్పడినట్లు ఆధారాలు చూపిస్తే ముక్కు నేలకు రాసి రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. బొమ్మరాశిపేట భూములకు సిఎం రేవంత్‌రెడ్డికి తమకు ఏమి సంబంధం అని ప్రశ్నించారు. కబ్జాల మల్లారెడ్డిని పక్కకు పెట్టుకుని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భూముల కబ్జాల పై మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. మల్లారెడ్డి నీవు మనిషివా.. మానవ మృగానివా భూదాహంతో కబ్జాల కు పాల్పడుతోంది నీవేనని ఘాటు గా విమర్శించారు. బొమ్మరాశిపేట రైతులు గత యాభై ఏళ్లుగా తమ భూములను సాగుచేసుకుని జీవిస్తున్నారని వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, ఎ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషారెడ్డి, జిల్లా నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ దాడిలో 4 క్వింటాళ్ల కల్తీ బెల్లం

7,500 కిలోల బియ్యం స్వాధీనం

ప్రజాపక్షం/వికారాబాద్ : బంట్వారం జిల్లా స్నేహ ఐపిఎస్ అదేశాల మేరకు వికారాబాద్ జిల్లాలో నిబంధనలకు ఉల్లంఘనలపై టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక నిఘా కానసాగుతుంది. అందులో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కె అన్వర్ పాషకు ఆటోలో తరలిస్తున్న సుమారు 4క్వింటాళ్ల కుళ్లిపోయిన బెల్లాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆటోలు ఉన్న చంద్ పాష డ్రైవర్ మొహమ్మద్ కుతుబుద్దీన్‌ను విచారించగా, వారి దుకాణంలో కూడా కల్తీ, కుళ్లిపోయిన బెల్లం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దాంతో అధికారులు 7,500 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకుని తదుపరి చర్య నిమిత్తం బంట్వారం పోలిస్టేన్‌కు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కె అన్వర్ పాష మాట్లాడుతూ కల్తీ కుళ్లిపోయిన బెల్లం నిల్వలపై నిఘా కొనసాగుతుందని, ప్రభుత్వ నిబంధనలు ఎవరైన ఉల్లంఘిస్తే వారి పైన శాఖపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలకు కల్తీ కుళ్లిపోయిన బెల్లం ఎవరైన తరలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, తెలిపారు. ఈ కార్యక్రమంలో దారుర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రఘురాములు, బంట్వారం స్థానిక ఎస్ఐ విమల, సిబ్బంది ఉన్నారు. ఫైల్‌నేమ్ : 15 ఎస్ఎంపి

'నారి నారి నడుమ మురారి', 'బైకర్' వంటి చిత్రాలతో వరుస విజయాలను అందుకున్నశర్వానంద్ తొలిసారిగా దర్శకుడు శ్రీను వైట్లతో జతకట్టారు. పీటివి సమర్పణలో, అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ-బ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

రీల్

చిన్న సినిమాలకు థియేటర్లు ఇవ్వడం లేదు

కొత్తవాళ్లు వస్తే నరకం చూపిస్తున్నారు

'ప్రజాపక్షం'తో దర్శక, నిర్మాత , నటుడు షెరాజ్ మెహిదీ

'అందాల రాక్షసి' అనే సినిమా తీశాడు షెరాజ్ మెహదీ. ఈ సినిమాలో ఆయనే హీరో, దర్శకుడు, నిర్మాత కూడా. లోబడ్జెట్ సినిమాలు చెయ్యాలనేది ఈయన ఆకాంక్ష. ఈ సినిమాను రీ రిలీజ్ చేసుకోడానికి షెరాజ్ మెహదీ పడ రాని పాట్లు పడుతున్నాడు. థియేటర్ల కోసం ఆయన పెద్ద పోరాటమే చేస్తున్నాడు. గత కొద్ది నెలలుగా తెలుగు ఫిలిం ఛాంబర్ వాళ్ళను కలిశాడు. చిన్న సినిమా లకు థియేటర్లు ఇవ్వాలి అనే డిమాండ్‌తో కొద్ది రోజుల క్రితం ఫిలిం ఛాంబర్ ముందు జరిగిన ధర్నాలో కూడా పాల్గొన్నాడు. థియేటర్లు దొరక్క తెలుగు సినిమా పెద్దల వైఖరిపై తిరు గుబాటు చేశాడు. పరిశ్రమ పెద్దలపై పోరాటం చేస్తున్న షెరాజ్ మెహదీని 'ప్రజాపక్షం' ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది.

ప్రశ్న: సినిమా పెద్దలపై ఎందుకు పోరాటం చేస్తున్నారు?

షెరాజ్ : నేను హీరోగా, నిర్మాతగా, దర్శ కుడిగా 'ఓ..అందాల రాక్షసి' అనే సినిమా తీశాను. ఈ సినిమాను రీ రిలీజ్ చెయ్యడా నికి గత కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాను. ఎన్నో సినిమాలు రీరిలీజ్ అవుతున్నాయి. నా సినిమా కూడా నేను రీ రిలీజ్ చేసుకుంటే ఎం బాగుటుంది అని ప్రయత్నిస్తున్న కానీ సినిమా పెద్దలు ఎవరూ సహకరిం చడం లేదు. తెలుగు చిత్ర పరిశ్రమలో కొత్త దర్శకులు, నిర్మాతలు, చిన్న బడ్జెట్ సినిమాలకు స్వేచ్ఛగా ఎదిగే అవకాశం లేకుండా పోతోంది. చిన్న సినిమాల విషయంలో థియేటర్ల కేటాయింపు నుంచి ఓటీటీ, ఆడియో, శాటిలైట్, ఇతర భాషల హక్కుల వరకు అనేక సమస్యలు ఉన్నాయి. వీటిపై పరిశ్రమలోని పెద్దలు, స్టార్ హీరోలు స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది. పరిశ్రమ సమస్యలపై ప్రశ్నిస్తే తనకు తెలుగు ఫిల్మ్ చాంబ ర్‌లో ప్రెస్ మీట్ నిర్వహించేందుకు అవకాశం కూడా ఇవ్వలేదు. ఈ ఇండ స్ట్రీలో 'ఆ నలుగురు' చెప్పిందే వేదం.

ప్రశ్న : కొత్తవారికి ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటి ?

షెరాజ్ : కొత్తవారిని అడ్డుకుంటున్నారు ఎట్లా అంటే సార్.... సినీ పరిశ్ర మలోకి కొత్తవారు రాకూడదన్నట్టుగా పరిస్థితులు తయారయ్యాయి. కొత్త దర్శకులు, నిర్మాతలు ఎన్నో కష్టాలు పడి సినిమా పూర్తి చేసిన తర్వాత సెన్సార్, క్యూబ్, పబ్లిసిటీ వంటి అంశాల పేరుతో అదనపు భారం పడు తోంది. చివరకు సినిమా విడుదలకు కూడా అనేక అడ్డంకులు ఎదురవుతు న్నాయి. ఇది మారాలి అని అంటున్న. చిన్న సినిమాలపై పరిశ్రమలో రాజ కీయాలు, ఆధిపత్య ధోరణులు పెరిగిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా మార్కెట్ విస్తరిస్తున్న సమయంలో చిన్న నిర్మాతలకు మాత్రం అవకాశాలు తగ్గిపోవడం బాధాకరం. క్యూబ్ వంటి సాంకేతిక సేవలకు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ సమస్యలను ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా తీసుకువెళ్లడం జరి గింది. ఇక్కడ క్యూబ్ , యు ఎఫ్ ఓ వంటి వాటికి వేలాది రుపా యలు కట్టాలి. ముంబై, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో మూడు వేల నుంచి అయిదు వేల రూపాయలు మాత్రమే తీసు కుంటున్నారు.

ప్రశ్న : థియేటర్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందా?

షెరాజ్ : చిన్న సినిమాలకు థియేటర్‌లు దక్కడం లేదు. 20 థియేటర్‌లు ఇస్తామని చెప్పి చివరకు ఐదు థియే టర్లు మాత్రమే కేటాయించారు. అందుకే ఒక దశలో మా సినిమా విడుదలను రద్దు చేయాల్సి వచ్చింది. చిన్న సినిమాకు సరైన స్క్రీన్లు ఇవ్వకపోతే ప్రేక్షకుల వద్దకు సినిమా ఎలా వెళ్తుంది? చిన్న సినిమాలకు థియేటర్‌లు కేటాయించకుండా అన్యాయం చేస్తు న్నారనే ఆరోపణలతో ఏషియన్ థియేటర్స్‌కు చెందిన సునీల్‌తో పాటు పివిఆర్, ఐమాక్స్ యాజ మాన్యాలకు లీగల్ నోటీసులు పంపించాను.

ప్రశ్న : సమస్యలు వచ్చినప్పుడు ఫిల్మ్ ఛాంబర్ ఫిర్యాదు చేయొచ్చు కదా ?

షెరాజ్ : తెలుగు ఫిల్మ్ చాంబర్ వ్యవస్థపైననే నేను విమర్శలు చేస్తున్న కదా. ఛాంబర్‌లో ప్యూన్ నుంచి ప్రెసిడెంట్ వరకు పరిశ్రమ సమస్యలు అందరికీ తెలుసు. కానీ నిర్ణయాలు తీసుకునే విషయంలో అక్కడ పనిచేసే వారికి ఎలాంటి స్వేచ్ఛ లేదు. సినీ పెద్దల్లో మమకారం తగ్గి అహంకారం పెరిగింది. పరిశ్రమను కాపాడాల్సిన వ్యవస్థలు కొందరి చేతుల్లో బొమ్మల్లా మారకూడదు. ప్రెస్ మీట్ పెట్టడానికి ఛాంబర్‌లో నాకు అనుమతి ఇవ్వ లేదు. ఈరోజు చిన్న సినిమాలకు ఎదురవుతున్న సమస్యలు రేపు పెద్ద సిని మాలకూ ఎదురయ్యే అవకాశం ఉంది. కాబట్టి సమస్య చిన్నదిగా ఉన్న ప్పుడే పరిష్కరించాలి అని సూచించారు.

ప్రశ్న : నువ్వొక్కడివే ఇంతపెద్ద ఇండస్ట్రీని ఏం చేయగలవు ?

షెరాజ్ : 'ఇది ఒక్కరి పోరాటం కాదు. నేను చేస్తున్న పోరాటానికి వంద లాది మంది మద్దతు ఇస్తున్నారు. భవిష్యత్తులో ఈ మద్దతు వేలల్లోకి మారుబోతోంది. నేను ఎవరికీ భయపడను. చట్టపరమైన పోరాటం చేయాల్సి వచ్చినా చేస్తాను. అవసరమైతే ఎంత దూరమైనా వెళ్తాను. కొత్త నిర్మాతలు, దర్శకులు, చిన్న సినిమాలకు న్యాయం జరిగే వరకు నా పోరాటం ఆగదు . గతంలో ఎదురైన థియేటర్‌ల సమస్యలను అధిగమించి, సరైన సంఖ్యలో థియేటర్లు, ఓటీటీ, ఆడియో, ఇతర హక్కులను సాధించి త్వరలోనే 'ఓ అందాల రాక్షసి'ని భారీ స్థాయిలో రీరిలీజ్ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. సినిమా చిన్నదా.. పెద్దదా అన్నది కాదు. కంటెంట్‌కు అవకాశం ఇవ్వాలి. కొత్త దర్శకుడైనా, నిర్మాతైనా తన ప్రతిభను నిరూపించుకునే స్వేచ్ఛ ఉండాలి. అదే నిజమైన సినిమా పరిశ్రమకు బలం అని షెరాజ్ మెహదీ అన్నారు.

దేశభక్తి నేపథ్యంలో 'ది ఇండియన్ బార్డర్'

ఆర్ట్ ఇన్ హార్ట్ క్రియేషన్స్ బ్యానర్ మీద నివేద్య రెడ్డి నిర్మాణంలో డి.ఎస్. బాషా దర్శకత్వం వహించిన చిత్రం 'ది ఇండియన్ బార్డర్'. ఈ సినిమాలో కిరణ్ యార్లగడ్డ, ఆదర్శ్, మురళీ మోహన్, మేఘా శ్రీ, సింధు తులాని ముఖ్య పాత్ర లను పోషించారు. ఇండిపెండెన్స్ డే సంద ర్భంగా ఈ మూవీ నుంచి ఓ దేశ భక్తి గీతాన్ని విడుదల చేశారు 'జిందా రహేన్ తో డ్యూటీ' అంటూ దేశ • భక్తిని రగిల్చేలా ఈ పాట సాగింది. ఇక ఈ పాటకు ఆనంద్ మంత్ర బాణీ, డి.ఎస్. బాషా సాహిత్యం, శరవణ గాత్రం దేశ భక్తి గీతంగా మార్చేసింది. జవాన్ల త్యాగాలను, ధైర్య సాహసాలను గుర్తు చేసేలా ఈ పాట సాగింది. కె మ్యూజిక్ ఈ మూవీ ఆడియో రైట్స్‌ను దక్కించు కుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో చిత్రయూనిట్ బిజీగా ఉంది. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో మేజర్ ఎస్‌పిఎస్ ఒబేరాయ్ మాట్లా డుతూ ''దేశం గురించి, సైన్యం గురించి సినిమా తీయడం ఆనందంగా ఉంది. అందరూ ఆరో గ్యాన్ని కాపాడుకోవాలి. బయటి ఆహారాన్ని తినొద్దు. నాకు సినిమా ఇండ స్ట్రీతో ఎలాంటి సంబంధం లేదు. ఈ మూవీ మంచి విజయం సాధించాలి' అని అన్నారు.ఈ కార్యక్రమంలో హీరో, రైటర్ కిరణ్ యార్లగడ్డ , దర్శకుడు డి.ఎస్. బాషా, నిర్మాత నివేద్య రెడ్డి , ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాం గోపాల్ చౌదరి, కొరియోగ్రాఫర్ రమేష్ మాస్టర్, మ్యూజిక్ డైరెక్టర్ ఆనంద్ మంత్ర , నలినికాంత్ కొండపల్లి కెమెరా మెన్‌గా, కె. రమేష్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. హర్నాథ్ సింగులూరి, గౌరి శంకర్ నడిపల్లి పాట లకు సాహిత్యాన్ని అందిస్తున్నారు.

శ్రీహరి కొడుకు హీరోగా 'భైరవకాళి' చిత్రం

నటుడిగా ఎన్నో విభిన్నమైన పాత్రలు, వైవిధ్యమైన సినిమాలు చేసి తనకంటూ ప్రేక్షకుల్లో ఓ ప్రత్యేకస్థా నాన్ని సంపాదించుకున్న లెజెండరీ నటుడు రియల్ స్టార్ డా. శ్రీహరి. ఇప్పుడు ఆయన అడుగుజాడల్లోనే నడుస్తూ నటుడిగా కెరీర్‌ను ప్రారంభించిన మేఘాంశ్ శ్రీహరి హీరోగా భైరవకాళి బ్యానర్‌లో ఓ చిత్రం రూపు దిద్దుకుంటోంది. లెల్లా రోహిత్ దర్శకత్వంలో లెల్లా రాహుల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణ సంస్కృతిలో బాగమైన పోతురాజు ఆహార్యంలో ఉన్న హీరో ఫస్ట్ లుక్ నీ ఆగస్టు 15న శ్రీ హరిపుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం విడుదల చేసింది. ఈ లుక్‌లో తనయుడు మేఘాంశ్ శ్రీహరికి అండగా వెనుక పోతురాజు ఆహార్యంలో రియల్‌స్టార్ డా. శ్రీహ రికి కూడా కనిపిస్తుండటంతో ఈ లుక్ మరింత పవర్ ఫుల్‌గా మారింది. ఇప్పటికే 50 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, శరవేగంగా ముస్తాబవుతోంది.

'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు' షూటింగ్ షురూ

కన్నడ చిత్ర పరిశ్రమలో 'సు ప్రీమ్ స్టార్' గా పేరు తెచ్చు కున్న భార్గవ్ హీరోగా నటిస్తూ దర్శ కత్వం వహిస్తున్న సినిమా 'తొలి సారి మిమ్మల్ని చూసింది మొదలు'. ఈ చిత్రంలో మీనాక్షి జైస్వాల్, ఆరియా మీనన్ హీరోయిన్స్ గా నటి స్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు కన్నడ భాషల్లో కౌసల క్రియేటివ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై ప్రొడ్యూసర్ బండి నాగరాజు నిర్మిస్తు న్నారు. మద్దినేని రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. భార్గవ్ బి. వి. దర్శకత్వం వహిస్తున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే ఎమోషనల్ థ్రిల్లర్ గా ఈ సినిమా రూపొందనుంది. హైదరాబాద్ లో పూజా కార్యక్రమాలతో ఈ చిత్ర ప్రారంభో త్సవం ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివే శానికి ప్రముఖ నిర్మాత చదలవాడ శ్రీనివాస రావు క్లాప్ ఇవ్వగా, ఫిలింఛాంబర్ సెక్రటరీ కె. అశోక్ కుమార్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు దశ రథ్ తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. డైరె క్టర్ వీరశంకర్ స్క్రిప్ట్ అందజేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మద్ది నేని రమేష్ మాట్లాడుతూ ఈ రోజు మా మూవీ పూజా కార్యక్రమాలకు అతిథులుగా వచ్చిన చదలవాడ శ్రీనివా సరావు, అశోక్ కుమార్, దశరథ్, ఇతర పెద్దలందరికీ కృతజ్ఞతలు. భార్గవ్ తెలుగు వారే. ఆయన కన్నడలో సుప్రీమ్ హీరోగా పేరు తెచ్చుకున్నారు. మా మూవీలో మీనాక్షి జైస్వాల్, అరియా మీనన్ హీరోయిన్స్‌గా నటి స్తున్నారు. హైదరాబాద్, బెంగళూరులో మా చిత్ర షూటింగ్ జరపబోతున్నాం. అక్టోబర్ కల్లా మూవీ చిత్రీకరణ పూర్తి చేసి రిలీజ్ కు రెడీ చేస్తాం అన్నారు. ప్రొడ్యూసర్ బండి నాగరాజు మాట్లాడుతూ ఒక మంచి కథతో మా సినిమాను నిర్మిస్తున్నాం. భార్గవ్ కన్న డలో ఎంతో కష్టపడి పేరు తెచ్చుకున్నారు. స్టార్ గా ఎదిగారు. ఆయన మా చిత్రం లో హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. మా మూవీ షూటింగ్ సెప్టెంబర్ ఫస్ట్ వీక్ నుంచి బెంగళూరులోని ఒక విలేజ్‌లో ప్రారంభిస్తాం. రెండు షెడ్యూల్స్‌లో సినిమా చిత్రీకరణ పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నాం. మా సినిమాకు రోహిత్ నాలుగు మంచి సాంగ్స్ ఇచ్చారు. అలాగే టెక్నీషియన్స్, నటీన టులు అందరూ బాగా సపోర్ట్ చేస్తున్నారు అన్నారు.కాదంబరి కిరణ్ నటుడు కిల్లి క్రాంతి, మ్యూజిక్ డైరెక్టర్ పెద్దపల్లి రోహిత్, నటుడు తేజ, హీరో యిన్ ఆరియా మీనన్ , డైలాగ్ రైట ర్ త్యాగరాజు గీత రచయిత రాంబాబు , హీరోయిన్ మీనాక్షి జైస్వాల్ , హీరో, డైరెక్టర్ భార్గవ్ పాల్గొన్నారు.

పోరాటాలతో స్వేచ్ఛను పరిరక్షించుకోవాలి

సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

చెన్నై: స్వాతంత్ర్యం అంత సులభంగా రాలే దని, మన స్వాతంత్ర్య సమరయోధులు అపా రమైన త్యాగాలతో, స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, న్యాయం వంటి విలువల పట్ల ప్రగాఢ నిబద్ధతతో దానిని సాధించారని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. వారు స్వేచ్ఛను సాధించారని, ఇప్పుడు దానిని మనం పోరాటాల ద్వారానే పరిరక్షిం చుకోవాల్సిన సమ యం ఆసన్నమైందని పేర్కొన్నారు. తమిళనాడు రాజధాని చెన్నైలోని సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యాలయం బాలన్ ఇల్లంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జా తీయ జెండాను రాజా ఎగురవేశారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం అపా రమైన త్యాగాలు చేసిన అసంఖ్యాక స్వాతంత్ర్య సమర యోధులకు నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటా నికి కమ్యూనిస్ట్ ఉద్యమం చేసిన చారిత్రక సహకా రాన్ని గుర్తుచేసుకున్నారు. మనం స్వాతంత్ర్య దినోత్స వాన్ని జరుపుకుంటున్న ఈ తరుణంలో, తరతరాలుగా పోరాడి, త్యాగాలు చేసిన విలువలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటామని ప్రతిన పూను దామని దేశ ప్రజలకు పిలుపునిచ్చా రు. ఈ విలువలను పరిరక్షించేందుకు ఆగస్టు 6 నుండి 15 వ రకు దేశవ్యా ప్తంగా 'బద్లావ్ జరూరీ హై' పాదయాత్రను సిపిఐ ప్రారంభించిందని, మార్పు సందేశాన్ని తీసుకెళ్తూ, ప్రజల గ ళాన్ని వినిపిస్తోందని, ఈ ఉద్యమంలో దేశ వ్యాప్తంగా ప్రజలు ఉ త్సాహంగా పాల్గొన్నారని రాజా తెలిపారు. ఢిల్లీలో సెప్టెంబర్ 1న రామ్‌లీలా మైదాన్‌లో జరిగే బహిరంగ సభలో హాజరుకావాలని ప్రజలకు పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమానికి సిపిఐ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి ఎం. వీరపాండియన్ అధ్యక్షత వహించారు.

అజయ్‌భవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని సిపిఐ ప్రధాన కార్యాలయం అజయ్‌భవన్‌లో స్వాతంత్ర్య దినోత్స వా న్ని పురస్కరించుకొని జాతీయ కార్యదర్శి డా క్టర్ గిరీశ్ జాతీయ జెం డాను ఎగు రవేశారు. అ నంతరం ఆయన చారిత్రాత్మక స్వాతంత్ర్య పోరాటాన్ని గుర్తుచేసు కుంటూ, భారతదేశ స్వాతం త్ర్య పోరాటంలో సిపిఐ పోషించిన అద్భుతమైన ప్రస్తా వించారు. కార్మికులు, రైతుల సమీకరణ నుండి ఎఐఎస్ఎఫ్, ఎఐకెఎస్, పిడబ్ల్యుఎ, ఐప్టా చారిత్రక పా త్ర వరకు, భారత స్వాతంత్ర్యపు చివరి యుద్ధమైన 1946 నాటి రాయల్ ఇండియన్ నే వీ (ఆర్ఐఎన్) తిరుగుబాటులో సిపిఐ పోషించిన నిర్ణయాత్మక పాత్రను ఆయన గుర్తు చేశారు. కమ్యూనిస్టులు స్వాతంత్ర్య పోరాటంలో ముందుండి, దాని అజెండాను తీవ్రతరం చేశారని, ఆ తీవ్రతే మన రాజ్యాంగంలో ప్రతిబింబించిం దన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి, ఎంపి పి. సందోష్ కుమార్, సిపిఐ ఢిల్లీ కార్యదర్శి ప్రొఫెసర్ దినేష్ వర్ష్‌నే, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధూ, అజోయ్ భవన్ సిబ్బంది హాజరయ్యారు.

నిలిపివేత సబబే

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితుల్లో పరిమితంగా ఉన్న ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకుని 2019 ఖరీఫ్, రబీ సీజన్లలో రైతుబంధు నిధులు విడుదల చేయకపోవడం ప్రభుత్వ విధాన నిర్ణయంలో భాగమేనని తెలి పింది. ఈ మేరకు రైతుబంధు చెల్లించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని తల్లాడ, తెల గారం రెవెన్యూ గ్రామాలకు చెందిన టి.వెంకటనా రాయణతో పాటు మరో నలుగురు రైతులు దాఖలు చేసిన పిటిషన్‌పై సింగిల్ జడ్జి రైతుబంధు చెల్లించాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రభుత్వం అప్పీలు దాఖలు చేసింది. చీఫ్ జస్టిస్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల అప్పీలుపై తీర్పు వెలువరించింది. బడ్జెట్‌లో కేటాయింపులు లేని మొత్తాన్ని చెల్లించా లని కోర్టులు ఆదేశించలేవని పేర్కొంది. కొవిడ్ సమయంలో తక్కువ విస్తీర్ణం కలిగిన రైతులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చినట్లు సమర్పించిన వివరాలతో స్పష్టమవుతోందని తెలిపింది. 2019 వానాకాలంలో 1.42 లక్షల మంది రైతులకు రూ.850.82 కోట్లు, యాసంగిలో 9.46 లక్షల మందికి రూ.2,132.95 కోట్లు విడుదల కాలేదని పేర్కొంది. దీంతో పిటిషనర్లు మాత్రమే వివక్షకు గురయ్యారని చెప్పడానికి ఆధారం లేదని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యాలు, నిధుల లభ్యత వంటి అంశాలను ప్రభుత్వాలే నిర్ణయించా లని, వాటిని నిర్దేశించే అధికారం కోర్టులకు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విషయాన్ని డివిజన్ బెంచ్ ప్రస్తావించింది. రైతుబంధు నిధులు విడు దల చేయాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేస్తూ ప్రభుత్వ అప్పీలును అనుమతించింది.

గణనీయమైన పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

ఎన్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సంపూర్ణ స్వాతంత్ర్య నినాదం ఇచ్చిన తొలి ఏకైక పార్టీ సిపిఐ :

భారత స్వాతంత్ర్యోద్యమంలో సిపిఐ అగ్రగా మిపాత్ర పోషించడమే కాకుండా, సంపూర్ణ స్వాతంత్ర్యంకోసం నినాదం ఇచ్చిన తొలి ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ అని పల్లా వెంక ట్‌రెడ్డి అన్నారు. స్వా తంత్ర్యం అనంతరం అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏ ళ్లు గడిచినా ప్రజలు ఆశించిన సమాజం ఇంకా పూర్తిగా ఆవిష్కృతం కాలే దని ఆయన ఆవేదన వ్య క్తంచేశారు. ఈ 80 ఏళ్లలో దేశం కొంత అభివృద్ధి సాధించినప్ప టికీ, ప్రజలందరూ స్వేచ్ఛగా, సమస్యలు లేకుండా జీవించే సమాజం ఏర్పడినప్పుడే దానిని నిజమైన అభివృద్ధిగా పరిగణించగల మన్నారు. ప్రతి ఒక్కరికీ తిండి, గుడ్డ, ఇల్లు, విద్య, ఉ ద్యోగాలు అందుబాటులోకి రావా లని సిపిఐ నిరంతరం పోరాటాలు నిర్వహి స్తోందన్నారు. పాలకుల వైఫల్యాలు, అసమర్థ నిర్ణయాల కారణంగా ఆర్థిక అసమానతలు మరింత పెరిగాయని విమర్శించా రు. పేదలు మరింత పేదలుగా, ధనికులు మరింత ధనికు లుగా మారుతున్న పరిస్థితి నెలకొందన్నా రు. మరీ ముఖ్యంగా బిజెపి ప్రభుత్వ హయాంలో రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజల సమ స్యలు గతంతో పోలిస్తే మరింత తీవ్రంగా మారాయని అన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి, ఉపాధి, విద్య, సామాజిక న్యాయం తదితర అంశాల్లో కేంద్ర ప్ర భుత్వ విధానా లపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతో ందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో సిపిఐ దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. తెలంగా ణలోనూ అన్ని ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. సెప్టెంబర్ 1న ఢిల్లీ లోని రాంలీలా మైదానంలో భారీ బహిరంగ సభ, ప్రదర్శన నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

జన్-జీల ఉద్యమాలతో బిజెపిలో వణుకు

ఇంతకాలం తమకు ఎదు రే లేదని భావించిన కేంద్ర ప్రభుత్వానికి ప్రజా ఉద్యమాలు వణుకు పుట్టించాయని పల్లా వెంకటరెడ్డి అ న్నారు. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కు వ్యతి రేకం గా జంతర్‌మంతర్ వేదికగా జన్‌జీల పోరాటం, పార్లమె ంట్ లోపల, వెలుపల వామపక్షాలు, డిఎం కె, ఎన్‌సిపి,టిఎంసి, ఇండి యా కూటమి తదితర పార్టీలు కలిసి ఉద్యమా లు నిర్వహిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతిఘటించాయని తెలిపారు. రాను న్న ఎన్ని కల్లో బిజెపిని ఓడించడమే లక్ష్యంగా సి పిఐ పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఇందు కోసం వివిధ రాజకీయ ప్రాంతీ య పార్టీలను కలు పుకుని విస్తృత ప్రజా ఐక్యతను నిర్మించేం దుకు పార్టీ దృఢనిశ్చయంతో ముందుకు కొన సాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజానాట్యకళాకారులు దేశభక్తి గీతాలతో అలరించారు.

గిరిప్రసాద్ భవన్‌లో...

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నవచే తన విజ్ఞాన సమితి నాగోల్ బండ్లగూడ ప్రాంగణంలో జరిగాయి. నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బిఎస్ఆర్ మోహన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సందేశమిచ్చారు. ఈ కార్యక్ర మంలో నవచేతన విజ్ఞాన సమితి కోశాధికారి వి. రత్నాకర్ రావు, జనరల్ మేనేజర్ మధు కర్,ప్రజాపక్షం ఎడిటర్ మక్కిన సుబ్బారావు గారు ప్రజాపక్షం ఎడిటర్ మక్కిన సుబ్బా రావు, నవచేతన పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ పి నారాయణ రెడ్డి, ప్రెస్ మేనేజర్ జనార్దన్‌రెడ్డి, ఇతర సిబ్బంది అనిల్, సుగుణాకర్, చక్రధర్ రావు, నవచేతన పబ్లిషింగ్ హౌస్ ఉద్యోగులు, నవచేతన ప్రింటింగ్ ప్రెస్ ఉద్యోగులు పాల్గొన్నారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com